Pubilshed from Kadapa
PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com





కడప KADAPA | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 141 Issue No : 141 | శనివారం Saturday | మార్చి 21, 2026 21 MARCH 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## పంట నష్టంపై పూర్తి నివేదిక సమర్పించండి

### ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు

- అకాల వర్షాలు, గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ఇప్పటివరకు పంట నష్టాన్ని రూ.63 కోట్లుగా లెక్కించిన అధికారులు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

భారీ గాలులు, అకాల వర్షాలు, వడగళ్లతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లో పూర్తి స్థాయి అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై శుక్రవారం క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటి విలువ రూ.40 కోట్లుగా లెక్కగట్టారు. అలాగే 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలపైనా వర్షాలు ప్రభావం చూపాయన్నారు. అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, ఆరెంజ్, నిమ్మ పంటలు దెబ్బతినగా...

2 పేజీలో..



## దేశ సార్వభౌమాధికారం అమెరికాకు తాకట్టు

- కేరళ సీఎం విజయన్

కేరళ : దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికా సామ్రాజ్యవాదానికి అప్పగించిన ప్రభుత్వం... దేశాన్ని పాలిస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. సీపీఐ (ఎం) మలప్పురం జిల్లా కమిటీ కార్యాలయం ఈఎంఎస్ భవనాన్ని విజయన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మధ్యప్రాచ్యంలో ఘర్షణల కారణంగా భారత్ ఇంధన కొరతను ఎదుర్కొన్నప్పుడు, 30 రోజుల పాటు రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునేందుకు అమెరికా అనుమతి ఇచ్చిందని, దీనిని బట్టి అమెరికాను భారత్ అభ్యర్థించిందనే విషయం స్పష్టమవుతోందని అన్నారు. చమురు దిగుమతి చేసుకునేందుకు అమెరికా అనుమతి ఎందుకు?

- మిగతా 2లో..

## దేశంలో ప్రీమియం పెట్రోల్‌పై వాత..




- సామాన్యులకు తప్పిన భారం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ప్రీమియం పెట్రోల్ ధరలు పెరిగాయి. అయితే, సామాన్యులు వినియోగించే సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలను మాత్రం స్థిరంగా ఉంచడం ఊరట కలిగించే అంశం. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం (హెచ్ పీసీఎల్) తమ ప్రీమియం రకం పెట్రోల్ ధరలను లీటర్‌కు సుమారు రూ.2 నుంచి రూ.2.30 వరకు పెంచాయి. ఈ కొత్త ధరలు మార్చి 20, శుక్రవారం నుంచే అమలులోకి వచ్చాయి.పెట్రోల్ బంకుల డీలర్ల సమాచారం ప్రకారం, ఐఓసీఎల్ కు చెందిన 'ఎక్స్ పీ 95', హెచ్ పీసీఎల్ కు చెందిన 'పవర్' పెట్రోల్ వంటి హై-ఆక్టేన్ ఇంధనాలపై ఈ పెంపు వర్తిస్తుంది.


2 పేజీలో..



## రానున్న 24 గంటల్లో ఏపీలో వానలు

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ : పశ్చిమ బంగాళాఖాతం సమీప ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు మారే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా తీర ప్రాంతాలతోపాటు అంతర్గత ప్రాంతాల్లో కూడా మేఘావృత వాతావరణం నెలకొనే అవకాశం ఉంది. రానున్న 24 గంటల్లో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందిన కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు లేదా జల్లులు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

2 పేజీలో..



## గోదావరిలో విద్యార్థుల గల్లంతుపై సీఎం చంద్రబాబు ఆరా

- ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : పోలవరం జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం రేవు వద్ద గోదావరిలో విద్యార్థుల గల్లంతుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.

- మిగతా 2లో..

## గ్యాస్ సరఫరాలో అపోహలు, ఆందోళలకు తావివ్వొద్దు

- ప్రజల్లో అనవసర భయాలను తొలగించాలి
- గృహ అవసరాల గ్యాస్ పక్కదారి పట్టకుండా చర్యలు
- వాణిజ్య అవసరాలకు ప్రాధాన్యతల ప్రకారం సరఫరా
- ఏజెన్సీల పెండింగ్ సరఫరాలు, అనుమానిత లావాదేవీలపై నిఘా
- ఆయిల్ కంపెనీల్లో గ్యాస్ నిల్వలు తగినంతగా ఉన్నాయి
- గ్యాస్ సరఫరాపై ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వీడియో కన్సరెన్స్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

రాష్ట్రంలో ఎక్కడా గృహ అవసరాలకు సంబంధించిన వంట గ్యాస్ కొరత లేదు. ప్రజల్లో అపోహలు, భయాందోళనలు కలిగించే వారిపై అప్రమత్తంగా ఉండాలి. గ్యాస్ సరఫరా వాస్తవ పరిస్థితిని జాయింట్ కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు మీడియా ముఖంగా ప్రజలకు తెలియజేయాలి. ప్రజల్లో నెలకొన్న అనవసర అపోహలు, భయాలను పారద్రోలేలా పని చేయాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు సూచించారు. వాణిజ్య అవసరాలకు సంబంధించిన గ్యాస్ సరఫరాను కూడా ప్రాధాన్యత ప్రకారం ఇబ్బంది లేకుండా అందించాలని కోరారు.

2 పేజీలో..





## విద్యావిధానంలో మార్పులు..

- ఇక టెన్త్ పరీక్షలు ఉండవు
- రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :

ఫోన్ ట్యాపింగ్ అరెస్టులు, సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారం, విద్యా విధానం అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడిన ఆయన, విద్యా విధానంలో కీలక మార్పులు తెస్తున్నామని స్పష్టం చేశారు. ఇక టెన్త్ పరీక్షలు ఉండవని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానం ఉంటుందని, దీనిని ముున్ముందు అమలుచేస్తామని అన్నారు. మూసీ ప్రక్షాళన ఆగదని, ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

జగిత్యాలకు చెందిన తమ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారాన్ని టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ చూసుకుంటారని తెలిపారు.అటు, ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు కొనసాగుతాయని తెలిపారు. చట్టప్రకారమే ఈ దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. విద్యావిధానంలో మార్పులు చేస్తున్నామని, ఇక పదో తరగతి బోర్డు పరీక్షలు ఉండబోవని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు ఏవని విపక్షాలు ప్రశ్నిస్తుండటంపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. విచారణ జరపకుండానే అరెస్టులు చేయలేం కదా అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని

2లో

## సెట్టింగ్ పూజలు జగన్‌కు అలవాటు




- డిక్లరేషన్ ఇవ్వని నైజం జగన్‌ది
- మండిపడ్డ మంత్రి పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

జగన్ ఆలయాలకు వెళ్లకుండా ఇంట్లోనే సెట్టింగ్‌లు వేసి పూజలు చేస్తున్నట్లు నటించడం అలవాటుగా మారిందని మంత్రి పార్థసారథి విమర్శించారు. అబ్దుల్ కలాం వంటి మహానుభావులు సంప్రదాయాలను గౌరవించి డిక్లరేషన్ ఇచ్చారని.. కానీ జగన్ ఎప్పుడూ ఆ పని చేయలేదన్నారు.ఈ మమేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు చేశారు.శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ..

2 పేజీలో..



## సౌభ్రాతృత్వం పాటిస్తే విద్వేష ప్రసంగాలనేవి ఉండవు

- సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : సమాజంలో ప్రతి ఒక్కరూ సౌభ్రాతృత్వాన్ని పాటించినపుడు విద్వేష ప్రసంగాలనేవి ఉండవని సుప్రీంకోర్టు శుక్రవారం సూచించింది. విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా కచ్చితంగా పోరాటం చేయాలని, అయితే ఈ పోరాటం కేవలం ఒక కమ్యూనిటీకే పరిమితం కాకుండా, అన్ని వర్గాల తరపున జరిగేలా చూడాలని పేర్కొంది.

2లో

## షర్మిల పిల్లలకు జగన్ అన్యాయం

- విజయమ్మ అఫిడవిట్



అమరావతి ప్రజా భూమి ప్రతినిధి : వైఎస్ కుటుంబ ఆస్తుల వివాదంలో తల్లి విజయమ్మ వేసిన అఫిడవిట్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. తన సొంత కుమారుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తన మనవలైన షర్మిల పిల్లలకు అన్యాయం చేస్తున్నాడని ఆమె నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో అఫిడవిట్ దాఖలు చేశారు.

- మిగతా 2లో..

ప్రజాభూమి
శనివారం, మార్చి 21, 2026


# సంపాదకీయం

## అభిశంసనతో సాధించేదేమిటి ?



అభిశంసనతో సాధించేదేమిటి ? సర్ ప్రక్రియలతో అనేక రాష్ట్రాల్లో లక్షల ఓట్లు తొలగించారు. అయితే తొలగించిన ఓట్లకు సంబంధించి ఎక్కడా పెద్దగా ఫిర్యాదులు అందలేదు. దీంతో ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా పార్టీలు తిరిగి అధికారం పొందుతాయా అన్న సందేహంలో ఉన్నాయి. ప్రధానంగా బెంగాల్లో మమతా బెనర్జీకి అధికార భయం పట్టుకుంది. సర్‌తో బెంగాల్లో 60 లక్షలకు పైగా ఓట్లు తొలగించారని తెలుస్తోంది. సర్ ప్రక్రియ ముగిసిన తరవాత వివిధ రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దఫాల్లోనూ, మిగిలిన చోట్ల ఏప్రిల్ 9న ఒకే దఫాతో ఎన్నికలు ముగుస్తాయి. ఐదు అసెంబ్లీల పరిధిలో 824 స్థానాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎస్ఐఆర్ పక్రియతో సుమారు కోటీ 40 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. అయితే ఏ రాష్ట్రంలోనూ ప ఎద్దగా వ్యతిరేకత రాలేదు. వ్యతిరేకత కేవలం మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారి నుంచి వచ్చాయి. తాము ఓట్లు కోల్పోయామని పదుల సంఖ్యలో కూడా ఎవ్వరూ ముందుకు రాకపోవడం గమనించాలి. అయితే ఓటు నమోదులో ఇప్పటికీ శాస్త్రీయ పద్ధతిని అవలంబించడం లేదు. పక్కాగా ఓటరు కార్డు దక్కడం లేదు. ఓటు నమోదు మొదలు, ఓటు తొలగింపు వరకు అంతా గందరగోళంగా సాగుతోంది. ఈ క్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఎన్నికల కమిషన్ ఓ రాజ్యాంగ ప్రతిపత్తి గలిగిన సంస్థ. దాని పని అది చేసుకుంటూ పోతున్నది. ఎవరు అధికారంలో ఉన్నా, ఎన్నికల కమిషన్ పనిచేస్తూనే ఉంది. కానీ విపక్ష కాంగ్రెస్, తదితర పార్టీలకు ఇది మింగుడు పడడం లేదు. అందుకు జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన నోటీసులు ఇచ్చారు. ఇది కేవలం రాజ్యాంగ సంస్థ నిజాయితీని నిలదీయడం తప్ప మరోటి కాదు. ఇప్పటికే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ తదితర పక్షాలు తలబొప్పి కట్టించుకున్నాయి. ఇకపోతే రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 17.4 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల పరిశీలన సర్ పేరుతో తొలగించండతో తట్టుకోలేక పోతున్న ఓట్లను ప్రతిపక్షాలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను నిలదీసే లక్ష్యంతో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లో పక్కనే ఉన్న బంగ్లా జాతీయు ఓట్లను తొలగించే ప్రక్రియ జరిగింది. అక్రమంగా ఇక్కడ తిష్టవేసి ఓటర్లుగా మారారు. వారే రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉండాలో నిర్ణయించే దశకు చేరుకున్నారు. మరో వైపు ఒక్క చట్టబద్ధమైన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా చూశామని సిఇసి జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. ఒక్క అనర్హుడు కూడా ఓటు వేసే అవకాశం లేకుండా చూడటమే తన లక్ష్యమని చెప్పారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రోజుకు లక్ష వరకూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాయి. నోటిఫికేషన్ రాగానే బెంగాల్ సిఎస్, డిజిపి, హోం శాఖ కార్యదర్శి, కొల్‌కతా సిపిలను ఇసి బదిలీ చేయడం ద్వారా మమతకు వత్తాసుగా ఉన్న వారిని తొలగించింది. పశ్చిమ బెంగాల్‌లో పగ్గాలు చేజిక్కించుకోవాలని, కేరళం, తమిళనాడులోనూ అధికారం నిలబెట్టుకునేందుకు ఆయా పార్టీలు చేస్తున్న ప్రయత్నాలకు నిజంగానే సర్ విఘాతం కలిగించి ఉంటుంది. ఓ వైపు మత విద్వేషాలు, హింసను రెచ్చగొట్టడం ద్వారా కుల, మత విభజనను తీసుకురావడం ద్వారా మరోమారు అధికారంలో కొనసాగాలని మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారు ఎత్తులు వేస్తున్నారు. అందుకే మమతా బెనర్జీ ఏకంగా 50శాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించింది. తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని నిలబెట్టు కునేందుకు ప్రజాతీర్పును కోరుతోంది. పదేళ్ల పాలనలో అభివృద్ధి చెందిన దేశాల జీవన ప్రమాణాలతో పోటీ పడేలా కేరళంను తీర్చిదిద్ది, తీవ్ర పేదరికాన్ని తరిమేసి, ఎన్నో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ చెప్పకుంటోంది. ప్రజానుకూల పాలనకు, ప్రజలపై ఉన్న నమ్మకానికి ప్రతీకగా మరోమారు విజయం సాధిస్తామని చెబుతోంది. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య యుతంగా జరగాలని కోరుకుంటున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. అయితే జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసిండం అంత సులువు కాదు. అధికార ఎన్‌డిఎ పూర్తి మద్దతుతో ఉండండతో ఈ ప్రయత్నం ఎరవేరక పోవచ్చు. అలాగే సర్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా బీహార్‌లో కాంగ్రెస్ తలబొప్పి కట్టించుకుంది. మమతా బెనర్జీ కూడా సుప్రీంతో చివాట్లు తింది. ఇవన్నీ మరచి వీరు చేస్ప ప్రయత్నాలతో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే పని తప్ప మరోటి కాదని గుర్తించాలి. అలాగే అధికారంలో ఉంటూ మమతా బెనర్జీ లాంటి వారు రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరంగా పరిగణించాలి.

# పంట నష్టంపై పూర్తి నివేదిక సమర్పించండి

నష్టం విలువ రూ.23 కోట్లుగా అంచనా వేశారు. ఇప్పటివరకు వేసిన అంచనాల ప్రకారం అన్ని పంటలకు కలిపి మొత్తం నష్టం రూ.63 కోట్లుగా అధికారులు లెక్క తేల్చారు. మరోవైపు ఎల్పీజీ సరఫరాపైనా సీఎం సమీక్షించారు. ఇరాన్ -- ఇజ్రాయిల్, అమెరికా మధ్య మరి కొన్నాళ్లు యుద్ధం కొనసాగితే... ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉందని, ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా రాష్ట్రంలో సమర్ధవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. ఎక్కడా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చూడాలన్నారు. గ్రామీణ - గిరిజన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆలయాలు, అన్న క్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ డెలివరీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎరువులు, పెట్రోల్, డీజిల్‌కు లోటు రానివ్వకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు.



# దేశ సార్వభౌమాధికారం అమెరికాకు తాకట్టు



అని ఆయన ప్రశ్నించారు. సామ్రాజ్యవాద అనుకూల విధానాల విషయంలో కాంగ్రెస్, బీజేపీలు ఒకేలా వ్యవహరిస్తాయి. పివీ నరసింహారావు హయాంలో, వారు సరళీకరణ విధానాల ద్వారా సామ్రాజ్యవాద బుజ్జగింపు వైపు మొగ్గు చూపారు. మన్మోహన్ సింగ్ హయాంలో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యూహాత్మక మిత్రపక్షంగా మారడానికి ప్రయత్నించారు. మరోవైపు, బీజేపీ పూర్తిగా అమెరికాకు దాస్యం చేస్తోంది. దేశ ప్రతిష్టను మసకబార్చే వైఖరిని తీసుకుంటున్నారు. దేశానికి అవసరమైన ఇంధనాన్ని అందించడానికి ఇరాన్ సిద్ధంగా ఉంది. పాకిస్థాన్ మీదుగా పైప్‌లైన్ ద్వారా ఇంధనాన్ని సరఫరా చేయాలన్నది ప్రణాళిక. అయితే, అమెరికాకు దాస్యం చేసే వైఖరితో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రణాళిక నుంచి వెనక్కి తగ్గింది. భారీ ఇంధన నిల్వలు ఉన్న అమెరికా, భారత్‌కు సహాయం చేయడానికి సిద్ధంగా లేదు. శతాబ్దాలుగా మంచి వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న ఇరాన్‌పై దాడి జరుగుతున్నప్పుడు, భారతదేశం ఆ దేశానికి అండగా నిలవకుండా, కనీస కృతజ్ఞత లేకుండా వ్యవహరించింది. దేశంలో ఇంధన కొరతను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విజయన్ అన్నారు. కేరళలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ జోక్యానికి పరిమితులు ఉన్నాయని ఆయన తెలిపారు.

# దేశంలో ప్రీమియం పెట్రోల్‌పై వాత...

ఉదాహరణకు, పూణేలో ప్రీమియం పెట్రోల్ ధర లీటర్‌కు రూ.111.68 నుంచి రూ.113.77కి చేరింది. ఈ పెంపు ప్రభావం ప్రధానంగా లగ్జరీ కార్లు, హై-పెర్ఫార్మెన్స్ బైకులు, స్పోర్ట్స్ వాహనాలు వినియోగించే వారిపైనే ఉంటుంది. సాధారణ వాహనదారులు వాడే రెగ్యులర్ పెట్రోల్, డీజిల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైనే స్థిరంగా కొనసాగడం, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా సరఫరాపై ఆందోళనలు పెరగడం ఈ పెంపునకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. భారత్ తన చమురు అవసరాల్లో అధిక శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. దీనికి తోడు రూపాయి విలువ తగ్గడంతో దిగుమతి వ్యయం కంపెనీలకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో, పెరిగిన వ్యయ భారాన్ని పూర్తిగా వినియోగదారులపై మోపకుండా, కేవలం ప్రీమియం ఇంధనాల ధరలను మాత్రమే పెంచడం ద్వారా కంపెనీలు నష్టాలను సర్దుబాటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఇంధన సరఫరాపై వస్తున్న వదంతులను నమ్మవద్దని హెచ్‌పీసీఎల్ స్పష్టం చేసింది. "క్రూడ్ ఆయిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదు. అదనపు కార్గోలు ఇప్పటికే దేశానికి చేరుకుంటున్నాయి. సరఫరా వ్యవస్థ పటిష్టంగా ఉంది" అని కంపెనీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఇంధన ధరలు భారీగా పెరిగినప్పటికీ, భారత్‌లో సాధారణ ఇంధనాల ధరలు చాలాకాలంగా స్థిరంగా ఉండటం గమనార్హం. తాజా పెంపు ప్రీమియం వినియోగదారులకు కొంత భారం కానుండగా, సామాన్య ప్రజలపై దీని ప్రభావం దాదాపుగా శూన్యం.

## సౌభ్రాతృత్వం పాటిస్తే విద్వేష ప్రసంగాలనేవి ఉండవు



"విద్వేషపూరిత ప్రసంగాల నుండి మా కమ్యూనిటీని రక్షించండి అని నిర్దిష్ట కమ్యూనిటీ ఎందుకు ప్రశ్నించాలి. బదులుగా ఎవరూ విద్వేషపూరిత ప్రసంగాలు చేయకూడదని మనం చెప్పాలి. ఈ పోరాటం అందరి తరపున జరగాలి" అని జస్టిస్ బి.వి.నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. ఏమైనప్పటికీ.. విద్వేష ప్రసంగాలకు కోర్టు వ్యతిరేకమని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. విద్వేష ప్రసంగాలను తాము కోరుకోవడం లేదని, అది సమాజంలోని విద్య స్థాయి, మేధో వికాసం, సహనం మరియు ఓర్పుపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సౌభ్రాతృత్వాన్ని పాటించినపుడు, విద్వేష ప్రసంగాలనేవి ఉండవని పేర్కొన్నారు. బ్రాహ్మణ కమ్యూనిటీ లక్ష్యంగా చేస్తున్న విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా కోర్టు జోక్యం చేసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి.నాగరత్న ఈ వ్యాఖ్యలు చేశారు. 'బ్రహ్మఫోబియా' అనే పదాన్ని సృష్టించారని, కుల ఆధారిత వివక్షగా పరిగణించి తగిన విధంగా శిక్షించాలని పిటిషనర్, న్యాయవాది మహాలింగం బాలాజీ స్వయంగా వాదనలు వినిపించారు.

# గ్యాస్ సరఫరాలో అపోహలు, ఆందోళలకు తావివ్వొద్దు

రాష్ట్రంలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై శుక్రవారం ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్సరెన్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయిల్ కంపెనీల ప్రతినిధులు రాష్ట్రంలో రోజువారీ గ్యాస్ బుకింగ్ లు, నిల్వలు, డెలివరీలపై గత వారం రోజుల నివేదిక వివరాలను మంత్రి గారికి తెలియజేశారు. అనంతరం జిల్లాల వారీగా ప్రస్తుత పరిస్థితిని నాదెండ్ల మనోహర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ... " సోషల్ మీడియాలో కొందరు కావాలని గ్యాస్ సరఫరా విషయంలో ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా మాట్లాడుతున్నారు. దీనివల్ల ప్రజల్లో అపోహలు, ఆందోళనలు ఎక్కువవుతున్నాయి. గత వారం రోజుల్లో ఇలాంటి అపోహల వల్లనే అధికంగా బుకింగ్స్ జరిగాయి. రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదు. ముఖ్యంగా గృహ అవసరాలకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా సాఫీగా గ్యాస్ సరఫరా చేస్తున్నాం. వాణిజ్య అవసరాలకు కూడా ప్రస్తుతానికి పెద్ద ఇబ్బందులేవీ లేవు. ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాలు, అత్యవసర సర్వీసులకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ వాణిజ్య అవసరాల గ్యాస్ ను సరఫరా చేస్తున్నాం. క్రమంగా గ్యాస్ సరఫరా మరింత మెరుగయ్యేలా ప్రణాళికాబద్ధంగా సమష్టిగా పనిచేయాలి. జిల్లాస్థాయిలోనూ జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని గ్యాస్ సరఫరా వాస్తవ పరిస్థితిని పత్రికల ద్వారా ప్రజలకు చేరవేయాలి. దీనివల్ల ప్రజల్లో భయాందోళనలు తగ్గుతాయి.

**సప్లై చైన్ బ్రేక్ కాకుండా చూడాలి :** గ్యాస్ సరఫరా సప్లై చైన్ బ్రేక్ కాకుండా చూసుకోవాలి. గృహ అవసరాలకు కేటాయించిన గ్యాస్ పక్కదారి పట్టకుండా చూసుకోవల్సిన బాధ్యతను క్షేత్రస్థాయిలో సమర్ధంగా చేపట్టాలి. అప్పుడే క్షేత్రస్థాయిలో పరిస్థితి క్రమపద్దతిలో వెళ్తుంది. బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు గ్యాస్ సరఫరా తేదీని సైతం ఏజెన్సీల నిర్వాహకులు ఫోన్ లో స్పష్టంగా తెలియజేయండి. అప్పుడు ఏజెన్సీ కార్యాలయాల వద్దకు వినియోగదారులు రాకుండా ఉంటారు. రద్దీ లేకుండా కనిపిస్తుంది. తహశీల్దార్లు, ఆర్డీవోలతో పాటు, తూనికలు, కొలతల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టండి. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్యాస్ పక్కదోవ పట్టకుండా, బ్లాక్ మార్కెటింగ్ వైపు వెళ్లకుండా చూడాలి. గత వారం ఆందోళనలతో కూడిన గ్యాస్ బుకింగ్స్ అధికంగా జరిగాయి. అవి క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. దీనిని మరింత కంట్రోల్ లోకి తెచ్చేలా, గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవన్న సంగతిని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలి. సాధారణ స్థితిని కొనసాగించేలా యంత్రాంగం ఇదే స్ఫూర్తితో పని చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్ట ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలనుగుణంగా సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. మండలాల వారీగా తాహశీల్దార్లు బాధ్యత తీసుకొని గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవనే సంగతిని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.

**ఏజెన్సీల వారీగా సరఫరాను పర్యవేక్షించండి :** జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, డిస్టిబ్యూటర్ల వద్ద బుకింగ్స్, డెలివరీలు, పెండింగ్ ల కారణాలను ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులు సమీక్షించాలి. ఏవైనా అనుమానిత లావాదేవీలు, సరఫరా జరుగుతున్నట్లు గుర్తించినా, సమాచారం వచ్చినా వెంటనే స్పందించి కఠినచర్యలు తీసుకోవాలి. గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ వాణిజ్య అవసరాలకు అక్రమ మార్గంలో మళ్లించే వారిపై నిఘా అవసరం. దీనిపై నిఘా బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేయండి. హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు అధికారుల వద్దకు వచ్చి గ్యాస్ సరఫరా విషయంలో ఫిర్యాదు చేసినా, మరేదైనా వినతి చేసినా సానుకూలంగా మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూడండి. ప్రతి ఒక్కరి కష్టం, వేదన వినేలా, వెతలు తీర్చేలా ప్రతి స్పందించండి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారత ప్రభుత్వం కూడా గ్యాస్ సరఫరాలో లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తోంది. కేంద్రం నుంచి అందుతున్న సహాయ సహకారాలను అందిపుచ్చుకోవాలి." అని చెప్పారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కార్యదర్శి, కమిషనర్ శ్రీ సౌరభ్ గౌర్, పౌర సరఫరాల శాఖ డెరక్టర్ శ్రీమతి నపూర్, హెచ్పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, జిల్లా జాయింట్ కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సెట్టింగ్ పూజలు జగన్‌కు అలవాటు




'హిందూ ధర్మాన్ని భక్షించే వారే 'హిందూ ధర్మ రక్ష' అని సాక్షి పత్రికలో ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదం' అని వ్యాఖ్యానించారు. పండుగల సమయంలో ప్రజలందరికీ మేలు జరగాలని కోరుకోకుండా.. కేవలం జగన్ బాగుండాలని మాత్రమే కోరుకోవడమే వైసీపీ నైజమని ఆరోపించారు. గత ఐదేళ్లలో హిందూ సంప్రదాయాలను గౌరవించిన దాఖలాలు లేవని, కల్తీ నెయ్యితో లడ్డూ తయారీ ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మంత్రి ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తు, యువత ఉపాధి విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో గ్రాడ్యుయేట్ నిరుద్యోగం 24 శాతానికి చేరి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గత 20 నెలల్లో 6,28,347 ఉద్యోగ అవకాశాలు కల్పించి దేశంలోనే ఏపీ రికార్డు సృష్టించిందని మంత్రి అన్నారు. ప్రతి ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. 2026 ఫిబ్రవరి 28 నుంచి దివ్యాంగులకు సిటీ బస్సులు, పల్లె వెలుగు బస్సుల్లో ఉచితం ప్రయాణం.. ఇతర బస్సుల్లో 50 శాతం రాయితీ అమలు చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా మౌజన్లకు రూ.45 కోట్లు తక్షణమే అకౌంట్లలో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇప్పటివరకు మూడు విడతలుగా 26,149 మందికి రూ.1,943 కోట్లు చెల్లించామని వివరించారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ... అల్లా దయతో అందరి జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని మంత్రి పార్థసారథి ఆకాంక్షించారు.



## గోదావరిలో విద్యార్థుల గల్లంతుపై సీఎం చంద్రబాబు ఆరా

స్నానం చేసేందుకు ఏడుగురు విద్యార్థులు గోదావరిలోకి దిగారని, వారిలో ఐదుగురు గల్లంతయ్యారని అధికారులు వివరించారు. గల్లంతైన వారిలో అభిరామ్, శ్రీకర్, నవదీప్ అనే విద్యార్థులు ముగ్గురు మృతి చెందారని, మిగిలి ఇద్దరు విద్యార్థులైన సతీష్ కుమార్, తేజ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీపక్, హర్ష ప్రాణాలతో బయటపడ్డారని వివరించారు. విద్యార్థులంతా అమరావతిలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీకి చెందిన వారని తెలిపారు. ఆచూకీ లభ్యం కాని ఇద్దరు విద్యార్థుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు.

## రానున్న 24 గంటల్లో ఏపీలో వానలు

కొన్ని చోట్ల తక్కువ స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో తేలికపాటి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కేవీఎస్ శ్రీనివాస్ వెల్లడించారు. సముద్ర మట్టానికి సుమారు 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని తెలిపారు. ఇక గంగా పరీవాహక ప్రాంతానికి చెందిన బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

## విద్యావిధానంలో మార్పులు...

హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావుకు సిద్దిపేటకు చెందిన చక్రధర్ కేసులోనే క్లీన్ చిట్ వచ్చిందని తెలిపారు. పదేళ్లు బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లు చేసిన తప్పులకు చెవిలో పువ్వులు కాదని, వీపుపై బండలు పెట్టాలని అన్నారు. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణకు ఇటీవల కేంద్రం అనుమతి ఇచ్చిందని, ఇప్పటికే అరవింద్ కుమార్‌ను సస్పెండ్ చేశామని అన్నారు.

## షర్మిల పిల్లలకు జగన్ అన్యాయం

వైఎస్సార్ బ్రతికున్నంత వరకు ఆస్తుల పంపకం జరగలేదని, ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులేనని ఆమె కుండబద్దలు కొట్టారు. తన నలుగురు మనవలు, మనవరాళ్లకు ఆస్తులను సమానంగా పంచాలన్నదే వైఎస్సార్ ఆఖరి కోరిక , ఆజ్ఞ అని ఆమె గుర్తు చేశారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి దక్కాల్సిన వాటాను ఇవ్వకుండా మోసం చేయడంపై విజయమ్మ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు, బెంగళూరులోని యలహంక ఇల్లు కూడా షర్మిలదేనని, ఇది వైఎస్సార్ స్వయంగా ఇచ్చిన ఆదేశమని ఆమె స్పష్టం చేశారు. కేవలం రాజకీయ కారణాలతో లేదా ఇతర విభేదాలతో తన చెల్లెలి పిల్లలకు రావలసిన ఆస్తులను జగన్ అడ్డుకోవడం ధర్మం కాదని ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్నారు. షర్మిల అడుగుతున్నది కేవలం తన పిల్లల భవిష్యత్తు కోసం ఆమెకు రావాల్సిన రాజ్యాంగబద్ధమైన వాటాయే తప్ప, జగన్ ఇచ్చే బహుమతి కాదని విజయమ్మ తేల్చి చెప్పారు. ఈ వివాదంలో తనను బినామీగా చిత్రించడంపై విజయమ్మ తీవ్రంగా విచారం వ్యక్తం చేశారు. దేవుడి సాక్షిగా నేను చెబుతున్నవి వాస్తవాలు. షర్మిల ఆస్తుల కోసం పాకులాడుతోందని జరుగుతున్న ప్రచారం అబద్ధం అని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికైనా జగన్ మనసు మార్చుకుని తన మేనల్లుడు, మేనకోడలికి న్యాయం చేస్తాడని ఒక తల్లిగా ఆశిస్తున్నట్లు ఆమె తన అఫిడవిట్‌లో బాధపడ్డారు. ఎన్‌సీఎల్‌టీలో జగన్ వేసిన పిటిషన్‌కు కౌంటర్‌గా విజయమ్మ నేరుగా షర్మిల వైపు నిలబడటంతో ఈ వివాదం పతాక స్థాయికి చేరింది. జగన్ పేర్కొంటున్న బహుమతి వాదనను ఆమె పూర్తిగా ఖండించారు. వైఎస్సార్ వారసులుగా అందరికీ సమాన హక్కులు ఉండాలని కోరుతూ విజయమ్మ వేసిన ఈ అఫిడవిట్, జగన్ వైఖరిని తప్పుపడుతూ షర్మిల పోరాటానికి నైతిక బలాన్ని చేకూర్చింది.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
శనివారం, మార్చి 21, 2026


# నిరుద్యోగ యువతీ యువకులకు భారీగా ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు 20 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిం చ డమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి నగరంలోని వారి క్యాంపు కార్యాల యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహిం చారు. మంత్రివర్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి కార్యక్ర మాలను చేపడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంతోపాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నామన్నారు. ఇటీవలే దివ్యాంగుల కోసం ఉగాది కానుకగా ముందు గానే దివ్యాంగ శక్తి పథకానికి శ్రీకారం చుట్టా మని, తద్వారా దాదాపు 11 లక్షల మందికి లబ్ధి చేకూరే విధంగా ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. నిన్నటి ఉగాది రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి నిరుద్యోగ యువతీ యువకులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిం చడంలో భాగంగా జాబ్ కాలండర్ను విడుదల చేయడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువత చాలా కాలంగా పోటీపరీక్షలకు తయార వుతూ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ఎప్పుడు విడుదల చేస్తుందా అని వేయికళ్లతో ఎదురుచూ స్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 1,2, మెగా డిఎస్సి, కానిస్టేబుల్ నియా మకం తదితర పోస్టుల ద్వారా 6 లక్షల 28,347 ఉద్యోగాలు సృష్టించిందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తో ఇంకా రాష్ట్రానికి 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. దేశంలో 25% పెట్టుబడులు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావడం గర్వకారణం అన్నారు.గ్రూప్ 1,2 పోస్టులు 600, కానిస్టే బుల్ పోస్టులు 1000, ఎక్సైజ్ కానిస్టేబుల్ 400 పోస్టులు కొత్త నోటిఫికే షన్లో ప్రకటించడం అభినందనీయ మన్నారు. దశలవారీగా వివిధ రకాల ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నా రు. గత ప్రభుత్వ కాలంలో ప్రతి సంవత్సరం ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్పటికీ ఇవ్వలే దని, వచ్చే పరిశ్రమలు రాకుండా వెళ్లిపోయాయని, ఉండే కంపెనీలు మూసుకుని పోయా యన్నారు. అంతేకాకుండా యువత గంజాయి బారినపడి నిర్వీర్యమైపోయింద న్నారు. రాష్ట్రం ఉద్యోగ అవకాశాలు కల్పించ డంలో ప్రపంచా నికి ఒక నాలెడ్జి హబ్ గా కేంద్రీకృతమైందన్నారు. అందు లకు కృషిచేసిన రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయు డు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మానవ వనరుల అభివృద్ధి ఐటీ కమ్యూనికేషన్ ఆర్టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ లకు ప్రత్యేక



ధన్యవాదా లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గుంతల రహదారులను బాగు చేశామన్నారు రాష్ట్రంలోని అన్ని జలవనురుల జలాశయాలను నింపుకొని తేదీలు నిర్ణయించి సాగునీటిని తాగునీటిని రైతులకు ప్రజలకు విడుదల చేస్తున్నా మన్నారు.గల్ఫ్ లో యుద్ధం వాతావరణం ముందుగానే పసిగట్టి గ్యాస్ సిలిండర్ల కొరతను తీర్చేందుకు కృషి చేశామన్నారు. స్వాతంత్ర సమరయోధులు ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి అవసర మైన స్థలం నగరపాలక సంస్థలో కేటాయించేం దుకు గత ప్రభుత్వ హయాంలో తీర్మానం చేయలే దన్నారు. దేశంలో మద్యం పాలసీ మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఉత్తమమైనదని వెల్లడించారు.నియోజకవర్గాన్ని స్వర్ణ యుగంలో మాదిరిగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామ న్నారు.నగరంలో మురుగునీటి వ్యవస్థ బాగుపర చుటకు 100 కోట్ల రూపా యల ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. డాక్టర్ పట్టాభి సీతారామ య్య స్మారక భవనం నిర్మించేందుకు అవసరమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, యూనియన్ బ్యాంక్ నుండి కావలసిన నిధులు తీసుకొస్తామని స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం త్రిశూల వ్యూ హంతో సంక్షేమం,అభి వృద్ధి, బిడ్డల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు జాబ్ క్యాలెండర్ను విడుదల చేయడం సంతోష్ కరమన్నారు.వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని, అర్బన్ బ్యాంకు చైర్మన్ దిలీప్ కుమార్,మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు అనిత, మరకాని సమతా కీర్తి స్థానిక నాయకులు వెంకటస్వామి, పల్లపాటి సుబ్ర హ్మణ్యంలు పాల్గొన్నారు.

## భోగరాజు స్మారక భవనాన్ని, తోట నరసయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

### నగరపాలక సంస్థ కమిషనర్ కు వినతి పత్రం అందించిన సీనియర్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ తదితరులు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కూటమి నాయకులు, స్వచ్ఛంద సంస్థలు ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనాన్ని కోనేర్ సెంటర్ లో జండా వీరుడు తోట నరసయ్య నాయుడు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కూటమి నాయకులు, పలు సంస్థల ప్రతిని ధులు, న్యాయవాదులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బాపిరాజుకు వినపత్రాన్ని అందజే శారు. ఎంతోకాలంగా పెండింగ్ లో ఉన్న భోగరాజు పట్టాభి సీతారామయ్య భవనానికి ఎన్. ఓ. సి. ని గంటల వ్యవధిలో మంజూరు చేసినందుకు జిల్లా కలెక్టర్ కు కూటమి నాయకులు స్వచ్ఛంద సంస్థలు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కీలకమైన భోగరాజు పట్టాభి స్మారక భవనాన్ని వెంటనే నిర్మాణం చేసి జాతికి అంకితం చేయాలని కోరారు. బ్రిటిష్ వారి లాఠీ దెబ్బలకు ఎదురొడ్డి జాతీయ జెండాను కోనేర్ సెంటర్లో ఎగరవేసిన స్వాతంత్ర సమర యోధులు తోట నరసయ్య నాయుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసి కోనేర్ సెంటర్ కి తోట నరసయ్య నాయుడు కోనేర్ సర్కిల్ గా పేరు మార్చాలని కూడా ప్రతినిధులు కోరారు. కోనేర్ సెంటర్లో ఉన్న తోట నరసయ్య నాయుడు పాత విగ్రహం రోడ్డు విస్తరణలో తీసివేయడం జరి గిందని వెంటనే విగ్రహాన్ని ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసి నగర ప్రజలకు అందించాలని ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పివి ఫణి కుమార్ జనసేన పార్టీ అధ్యక్షులు గడ్డం రాజు, రాష్ట్ర టీ. డి. పి మైనార్టీ సెల్ నాయ



కులు సయ్యద్ ఖాజా అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు వేము కోటేశ్వరరావు, ఇంజనీర్ఆర్ వి ఎస్ మురళీధర్ ఎం. వి.వి రామాంజనేయులు బాబు జోడి గుడులు చైర్మన్ దేవనూరి వీర బాబు, పి ఎస్ ఎస్ ఆర్ శర్మ, నిమ్మగడ్డ శ్రీధ ర్, జమ్మలమడక సేతురామయ్య, కాళీపట్నం రఘు, ఎం. సుబ్రహ్మణ్యం లు పాల్గొన్నారు.




# అబ్బురపరుస్తున్న బింగో సర్కస్

### పిల్లాపాపలతో కలిసి తిలకిస్తున్న తల్లిదండ్రులు
### ఆహ్లాదాన్ని అందిస్తున్న సర్కస్
### రష్యన్ కళాకారులతో ఆకట్టుకుంటున్న ప్రదర్శనలు

**మచిలీపట్నం ప్రజాభూమి ప్రత్యేక ప్రతినిధి**

మచిలీపట్నం నగరంలో డీమార్ట్ రోడ్డులో గత నాలుగు రోజులుగా "బింగో సర్కస్" బహుళ ప్రజాదరణ పొందుతోంది. మండువేసవిలో ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన బింగో సర్కస్ ప్రతిరోజు మధ్యాహ్నం, సాయం త్రం, రాత్రి, 3 ప్రదర్శనలతో అలరిస్తోంది. స్థానికంగా మొట్టమొదటిసారిగా ఈ రష్యన్ సర్కస్ ఏర్పాటు చేయడం పట్ల నగర ప్రజలు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నా రు. తమ పిల్లా, పాపలతో కలిసి ప్రదర్శనలను తిలకించ డానికి విరివిగా విచ్చేయడం విశేషం.

**రష్యన్ కళాకారులతో అలరిస్తున్న ప్రదర్శనలు:**

మొట్టమొదటిసారిగా రష్యన్ కళాకారులతో బింగో సర్కస్ ప్రదర్శనలు నగర ప్రజలను విశేషంగా అలరిస్తున్నాయి. ఏమాత్రం పబ్లిసిటీ లేకపోయినా, కేవలం మౌత్ పబ్లిసిటీ తోనే సర్కస్ తిలకించడానికి తండోపతండాలుగా జనం విచ్చే యడం విశేషం. మహిళలతో కలిపి 82 మంది కళా కారులు సర్కస్ విద్యలో తమ ప్రతిభాపాటవాలు కనబరుస్తూ అబ్బురపరుస్తున్నారు.

**వివిధ రకాల విన్యాసాలతో ఆద్యంతం అలరిస్తున్న సర్కస్:**

కళాకారుల ప్రదర్శనలతో, వారి అద్భుత విన్యాసాలతో, ఆద్యంతం సర్కస్ అలరిస్తోంది. పెద్ద గ్లోబ్ లో యువత మోటార్ సైకిల్ ప్రదర్శన, సైకిళ్లపై రష్యన్ మహిళల విచిత్ర విన్యాస ప్రదర్శనలు, ఉయ్యాల ప్రదర్శన, గాలిలో తేలియాడుతూ విచిత్ర విన్యాసాలతో వీక్షకులను అలరిస్తున్న మహిళల విన్యాసాలు చూడడానికి రెండు కళ్ళు సరిపోవడం లేదు అనడంలో అతిశయోక్తి లేదు. ప్రాణాలకు తెగించి వారు చేసే విన్యాసాలు చూపరులను అబ్బురపరుస్తున్నాయి. సర్కస్ ప్రాంగణం చప్పట్లతో మార్మోగుతోంది. చిన్నపిల్లల ఈలలు, పెద్దల కేరింతలతో అందరూ ఒక్కసారి ఆనాటి బాల్యానికి వెళ్ళిపోతు న్నారు. ఈ జగమంత పోనీ, యవ్వనమంతా పోనీ,ఈ జీవితం అంతా పోనీ, ఆనాటి బాల్యాన్ని ఒక్కసారి రాని, అని సరదాగా పిల్లలు పెద్దలు సర్కస్ ప్రాంగణంలో కేరింతలు కొడుతు న్నారు. దాదాపు మూడు గంటల సేపు సాగే సర్కస్ ప్రదర్శనలో ప్రజలు వారి సమకా లిన సమస్యలను మర్చిపోయి ఆహ్లాదంగా గడపడం విశేషం. మనిషికి కావలసింది ఆహ్లాదం, ఆనందమే కదా! సర్కస్ కళాకారులను ప్రత్యక్షంగా చూసి వారి విన్యాసాలను వీక్షించి అబ్బుర



పడుతూ ఆనందించడం నిజంగా వరం. అలా ఆనందిస్తూ నగర ప్రజలు సర్కస్ విన్యాసాలు తిలకించడం గమనార్హం.


**అందరూ సర్కస్ ని ఆదరించాలి:**

కళలు మన జీవితంలో ఒక భాగం. కళాకారులని గౌరవించడం మన కనీస సంస్కారం. ప్రాణాలకు తెగించి, ఎంతో కష్టపడి విన్యాసాలను ప్రదర్శిస్తున్న సర్కస్ కళాకారుల జీవనస్థితిగతులు నేటికీ అగమ్య గోచరం గానే ఉన్నాయి. ఈ సర్కస్ పై 500 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. రోజుకి సర్కస్ నిర్వహణకు కళాకారుల జీతభత్యాలకు దాదాపు 50 వేల రూపాయలు ఖర్చవుతుందని, సర్కస్ కంపెనీ బాధ్యులు షేక్ వజీర్ మీడియా ప్రతినిధులకు తెలిపారు. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన షేక్ వజీర్ ఈ సర్కస్ కంపెనీని దాదాపు 34 సంవత్సరాల నుండి స్వయంగా నిర్వహిస్తున్నారు. కష్టనష్టాలను భరిస్తూ సర్కస్ కంపెనీ మీద ఉన్న ప్రేమతో రాష్ట్రమంతటా ప్రదర్శన ఇస్తున్నారు. షేక్ వజీర్ కేవలం సర్కస్ నిర్వాహకుడు మాత్రమే కాక, జనసేన క్రియాశీలక సభ్యునిగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ అంటే వజీర్ కి ప్రాణం. అది ఎంతటి ప్రాణమంటే, వజీర్ గుండెలపై పవన్ కళ్యాణ్ "టాటూ" వేసుకోవడ మంత..! ఇది అతడికి పార్టీ మీద, పవన్ కళ్యాణ్ మీద ఉన్న అభిమానాన్ని చాటి చెపుతుంది. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలాంటి కళాకారులను, ఇలాంటి ప్రదర్శన లను గుర్తించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రభుత్వం సర్కస్ కి కేటాయించే స్థలాలని ఉచితంగా ఇవ్వాలని, విద్యుత్తు, పలువాటికి ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలని వజీర్ కోరుతున్నాడు. అలాగే సర్కస్ కంపెనీలో పని చేస్తున్న కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తే భవిష్యత్తులో వారి జీవనానికి భద్రత ఏర్పడుతుందని వజీర్ పేర్కొన్నారు.



ప్రస్తుతం భారతదేశంలో 11 సర్కస్ కంపెనీలు మాత్రమే నిర్వహించబడుతు న్నాయని వజీర్ తెలిపారు. ఒక్కొక్కసారి సర్కస్ ప్రదర్శనలో నష్టాలు కూడా చవి చూడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు సర్కస్ ప్రదర్శన అంటే వేలాదిగా జనం తరలి వచ్చి ఆదరించేవారు. ఇప్పుడు అంతరించిపోతున్న ఈ సర్కస్ కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. గతం నుండి ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు మాత్రమే ప్రస్తుతం ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతోంది. నూతన కళాకారులు ఈ సర్కస్ విద్య నేర్చుకోవడానికి ముందుకు రావడం లేదు.అలా రావాలంటే ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తూ వారి జీవనానికి భద్రత భరోసా కల్పిస్తే సర్కస్ లు అంతరించిపోకుండా మున్ముందు మూడు పువ్వులు,ఆరు కాయలుగా విరాజిల్లుతాయి అనడంలో ఏమాత్రం సందేహం లేదు. సర్కస్ కళ అంతరించిపో కుండా ఆ కలను ఆదరించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.!

## కీచక అర్చకుడు



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రత్యేక ప్రతినిధి

ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక యువతి అనారోగ్యం తో ఉంది. ఆ యువతికి నీరసం, వికారంగా ఉన్న పెద్దగా పట్టించుకోలేదు. ఒంట్లో కొంచెం నలతగా ఉండటంతో తల్లిదండ్రులు ఆమెను డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షల నిర్వహించి ఆ యువతిని గర్భవతిగా నిర్ధా రించారు. యువతి తల్లిదండ్రులు ఒక్కసారిగా షాక్ తిన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవ త్సరం చదువుతున్న యువతి, పెళ్లి కాకుండానే గర్భవతి కావడంతో తల్లిదండ్రులు బాధపడుతూ ఆ యువతని నిలదీశారు. యువతి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది.మచిలీపట్నం లక్ష్మణాపురం దగ్గరలో ఉన్న రామాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు రామాల యంలో పూజలు చేస్తూ దేవుని స్మరిస్తూ ఉంటాడు. భక్తులు అందరూ ఆ పూజారి వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకుంటారు కానీ ఆయనలో ఉన్న కీచక బుద్ధిని ఎవ్వరు గమనించలేదు. భక్తిశ్రద్ధలతో ఉండాల్సిన అర్చకుడు బరితెగించాడు. అర్చకుడి నీచపు బుద్ధి అర్చక వృత్తికే కళంకం తెచ్చింది. 45 ఏళ్ల అర్చకుడు, తన భార్య ,పిల్లలతో మచిలీపట్నం నిజాంపేట లో ఉంటున్నాడు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న యువతి అర్చకుని కుటుంబంతో సన్నిహితంగా ఉంటుంది. అర్చకుడు భార్య ఆ యువతిని తన కుటుంబంలో ఒకరిగా, ఇంటి మనిషిగా చూసుకుంటుంది. కానీ అర్చకుడు మాత్రం వక్రబుద్ధితోనే చూశాడు. దీనిని భార్య ఏమాత్రం గ్రహించలేదు. అర్చకుడు ఆ యువతి ఒంటరిగా ఉన్న సమయం చూసి లైంగికంగా వేధించటం మొదలుపెట్టాడు. తన లైంగిక వాంఛ తీర్చాలని ఆ యువతని బలవంతం పెట్టేవాడు. అర్చకుని కామ కోరికను యువతి ఒప్పుకోక పోవడంతో యువతని బెదిరించి వశపరచుకున్నాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే యువతి అంతు చూస్తానన్నాడు. ప్రతిరోజు రామాలయంలో దేవునికి పూజలు చేసి పాపానికి పాల్పడుతున్న ఆ పూజారి ఆటకు దేవుడు ముగింపు పలికాడు. అర్చకుడు యువతితో శారీరక వాంఛ తీర్చుకొని గర్భం దాల్చడం బయటపడింది. దీనితో తల్లిదండ్రులు అర్చకుడు పై మచిలీపట్నం ఆర్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు పై విచారణ చేసిన పోలీసులు కీచక అర్చకుడు పై ఫోక్సో కేసు నమోదు చేశారు.

## యువత భవిష్యత్తుకు భరోసా కూటమి ప్రభుత్వం : కనపర్తి శ్రీనివాసరావు




ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ:

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెం డర్ను విడుదల చేసి తన విశ్వసనీయతను చాటుకున్నారని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు కొనియాడారు. శుక్రవారం అవనిగడ్డలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ హామీ ఇచ్చినా దానిని తుచా తప్పకుండా అమలు చేస్తారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైకాపా ఏలుబడిలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా దిగిపోయిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువత సంక్షేమం కోసం ఒక అడుగు ముందే ఉంటున్నారని, నిరుద్యోగుల కళ్లలో ఆనందం చూడ టమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు .చదువుకున్న యువత ఉద్యో గాల కోసం విదేశాలకు వెళ్లకుండా, స్వదేశంలోనే స్థిరపడాలనే సంకల్పంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన వివరించారు.అమరావతి రాజధాని పనులను వేగవంతం చేస్తూ, దిగ్గజ సంస్థ లను ఆహ్వానించి పరిశ్రమల స్థాపనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం వల్ల నిరుద్యోగులకు స్పష్టమైన భరోసా లభిస్తోందని రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరియు మంత్రి నారా లోకేష్లకు ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. యువత అంతా కూటమి ప్రభుత్వం పట్ల పూర్తి సంతృప్తితో ఉన్నారని వారు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలోదివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లూరి బసవేశ్వర రావు,నాగాయలంక చలపల్లి మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, మోర్ల రాంబాబు పార్టీ నాయకులు మండలి రామమోహన రావు,ఘంటసాల రాజమోహనరావు , గుత్తికొండ వంశీ, ఉప్పల ప్రసాద్, తాడేపల్లి పాపారావు మరియు ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థినిపై అత్యాచారాన్నికి పాల్పడిన పూజారి రఘును కఠినంగా శిక్షించాలి:ఎస్ఎఫ్ఐ

మచిలీపట్నం ప్రజాభూమి బ్యూరో



మచిలీపట్నం జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరి సమావేశంలో ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా అధ్యక్షురాలు బి.పూజిత మాట్లాడారు. మచిలీపట్నం లక్ష్మణపురంలో ఉన్న రామాలయంలో పూజారిగా పనిచేస్తున్న రఘు విద్యార్థినిపై అత్యాచారా నికి పాల్పడి గర్భవతి చేసిన ఈ వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తరుపున డిమాండ్ చేశారు. పూజారి రఘు విద్యార్థిని కుటుంబాన్ని తన ఇంట్లో అద్దెకు ఉంచుకుని ఆ విద్యార్థినికి మాయ మాటలు చెప్పి లోబర్చుకుని రాత్రిపూట తిరునాళ్లకు సినిమాలకు వివిధ ప్రాంతాలకు తిప్పుతూ సమయం దాటిపోయిందని మా ఇంట్లో ఈ పూట ఉంచుకుని తెలవారాకా పంపుతాను అని ఆ కుటుంబాన్ని నమ్మబలికి విద్యార్థినిపై గత సంవత్సరం డిసెంబర్ 31 నుంచి ఇప్పటివరకు పలుమార్లు అత్యాచారానికి పాల్పడి విద్యార్థిని గర్భవతి చేసిన పూజారి రఘును కఠినంగా శిక్షించి ,విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు.మచిలీపట్నంలో లైంగిక దాడి లో అన్యాయానికి గురైన ఆ కుటుంబాన్ని రాష్ట్రప్రభుత్వం ఆదుకుని ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే విధంగా సమాజంలో గౌరవప్రదంగా ఉండే విధంగా చర్యలు తీసుకుని మహిళా సంఘం నాయకురాలు కోరారు.

## వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి




**ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే "స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయితే మంచి ఫలితాలు వస్తాయి.**

**శుభ్రమైన - ఆరోగ్యకరమైన ఏలూరు, మీ ఫిర్యాదు - మా ప్రాధాన్యం 9491041419 వాట్సాఫ్ ఫోన్ నెంబరు, గడపగడపకు అవగాహన గోడ పత్రికలను ఆవిష్కరణ.**

**స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తంగెళ్ళమూడి భారతీయ ఆహార సంస్థ గోడౌన్లు ఏటిగట్టు ప్రాంతంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**

**ప్రజా భూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.**

స్థానిక తంగెళ్ళమూడి 1వార్డు సచివాలయం వద్ద 27, 28వ డివిజన్ల పరిధిలోని శనివారం భారతీయ ఆహార సంస్థ గోడౌన్లు ఏటిగట్టు ప్రాంతంలో "స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా "ఈ-వేస్ట్ సేకరణ థీమ్"తో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, ఏపియస్ ఆర్టీసీ విజయవాడ -2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సంయుక్తంగా పాల్గొని, అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వార్డు సచివాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు.ముందుగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఏటిగట్టు ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి, క్లాప్ మిత్రాలతో మాట్లాడారు. రోజుకు ఎన్ని గంటలు పని చేస్తారు, ఏఏ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేస్తారు అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఉదయం ముందుగా రోడ్లను శుభ్రం చేసి చెత్తను ఒక చోట ప్రోగు చేసి, ఇంటింటికి వెళ్ళి తడి, పొడి చెత్తను సేకరిస్తామని తెలిపారు. దీంతో జిల్లా కలెక్టరు స్పందిస్తూ అంతా బాగా చేసినా అన్ని చోట్ల చెత్త ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. దీంతో క్లాఫ్ మిత్రాలు ఇంటింటికి వెళ్ళినప్పుడు పనులు ఉన్నాయని చెత్తను తర్వాత ఇస్తామని చెప్పి తర్వాత రోడ్డు ప్రక్కల, బయట చెత్తను వేస్తున్నారని, పట్టణ ప్రాంతాల్లో కల్యాణ మండపాలు, కన్వెన్షన్ సెంటర్స్ వద్ద కార్యక్రమాలు అయిన తర్వాత చెత్తను రాత్రి సమయాలలో ఇక్కడకు తరలించి చెత్తను వేస్తున్నారని చెప్పారు. దీంతో స్పందిస్తూ జిల్లా కలెక్టరు శాశ్వత చర్యలకు నగరపాలక సంస్థ కమిషనరుకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ-వేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని మండలాలు, మునిపాలిటీలో ఒక మహోద్యమంగా జరుగుతున్నాయన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం తంగెలమూడి ఏటిగట్టు ప్రాంతంలో నిర్వహించుచున్నామని అన్నారు. ఈ-వేస్ట్ పర్యావరణానికి విఘాతమని పర్యావరణ పరిరక్షణకు, పరిశుభ్రమైన నగర, గ్రామాలు నిర్మాణ కోసం పాత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఛార్జర్లు, బ్యాటరీలు, టీవీలు, తదితర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సక్రమంగా సేకరించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం మని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం అయినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. శుభ్రమైన ఏలూరు, ఆరోగ్య కరమైన ఏలూరు 'మీ ఫిర్యాదు - మా ప్రాధాన్యం' పై ఇప్పటికే నగరపాలక సంస్థలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. మరలా ఈరోజు 9491041419 మీరు నేరుగా కాల్ చేయవచ్చునన్నారు. లేదా ఎస్ఎంఎస్ పంపవచ్చును లేదా వాట్సప్ ద్వారా మీ సమస్యలను తెలియ జేసినట్లయితే కొన్ని నిమిషాల్లో పరిష్కరించి, ఏలూరును పరిశుభ్రతలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మనమంతా కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. త్వరలో ఇక్కడ ఒక చెక్ పోస్టును ఏర్పాటు చేస్తామని, చెత్తను వేసే వాహనాలను ఫోటోలు తీసి వాట్సఅఫ్ పెట్టితే చర్యలు వెనువెంటనే తీసుకుంటామని, అలాగే చెక్ పోస్టును 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకుంటే పరిస్థితి తప్పక మారుతుందని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, దీనివల్ల వ్యాధులు దూరం అవుతాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించడం ఒక అభిరుచిగా చేసుకోవాలన్నారు. మన ఇంటితోపాటు చుట్టు ప్రక్కల పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. శీతాకాలం సీజన్లో అంటూ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయని, చిన్నారులు, వృద్ధులు, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దుటకు, పరిశుభ్రంగా మార్చటం కోసం రాష్ట్రంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఒక ఉద్యమంగా ముందుకుతీసుకు వెళ్ళుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఒక అంశంమీద జరుగుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నగరంలో పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు భాగస్వామ్యం కావాలని తెలిపారు. స్వర్ణాంధ్ర-- స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు ప్రజలందరూ చురుకుగా పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, ఏలూరు ఉడా చైర్మన్ పెద్దిబోయిన శివ ప్రసాదు, జిల్లా వివిధ శాఖలు అధికారులు, సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, నగర పాలక సంస్థ ఉద్యోగులు, వార్డు సచివాలయ ఉద్యోగులు, పట్టణ పలు విద్యాసంస్థలు విద్యార్థులు, యన్ సిసి, యన్ ఎస్ ఎస్, పలు సేవా సంస్థలు సభ్యులు, స్థానిక ప్రజలు, క్లాప్ మిత్రాలు, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే జూన్ నెలాఖరు నాటికి అందరికీ టిడ్కో గృహాలు పూర్తిచేసేలా పనులు

**..... పాలకొల్లులో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి రామానాయుడు.**

**ప్రజాభూమి ప్రతినిధి , పాలకొల్లు**



పాలకొల్లులో మహిళలు, పేదల సొంతింటి కల నెరవేర్చేలా వచ్చే జూన్ నెలాఖరు నాటికి మిగిలిన టిడ్కో గృహాలను పూర్తి చేసి అప్పగించేలా పనులు వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు పట్టణంలో కోటి 50 లక్షలు తో జరుగుతున్న 27వ వార్డు క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ సుందరీకరణ పనులు, టిడ్కో గృహాల పనులు, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సుందరీకరణ పనులను కూటమి నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతంగా జరగడంతో పాటు ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంను అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో గత వైసిపి ప్రభుత్వం లో మరుగున పడిన, విధ్వంసానికి గురైన అభివృద్ధి పనులను నేడు కూటమి ప్రభుత్వంలో గాడిలో పెడుతున్నామని మంత్రి రామానాయుడు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ అందుకు అవసరమైన నిధులను వివిధ శాఖల వారీగా తీసుకొస్తున్నట్లు చెప్పారు. పనులు జరుగుతున్న టిడ్కో గృహాల బ్లాకులను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడంతోపాటు సమీక్ష చేయడం జరిగింది. గత టిడిపి ప్రభుత్వంలో పేదలు, మహిళల సొంతింటి కల తీర్చేలా టిడ్కో గృహాలను 70 శాతం నుంచి 100 శాతం వరకు పూర్తి చేస్తే మిగిలిన పది నుంచి 30 శాతం పనులను వైసిపి ఐదేళ్ల పాలనలో అరబస్త సిమెంట్ పని గానీ, రూపాయి ఖర్చు గాని చేయకుండా పడకేసిందన్నారు. దీంతో గృహాలు చెదల పట్టి, పాడయ్యాయని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిగిలిన గృహాలను గాడిలో పెట్టామన్నారు. ఇంకా 111 బ్లాక్ ల గృహాలు పూర్తి కావలసి ఉండగా కూటమి ప్రభుత్వ ఏడాది కాలంలో 60 బ్లాకుల ఇల్లు పూర్తయ్యాయని, మిగిలినవి వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రణాళికంగా తీసుకున్నామన్నారు.నాడు టిడిపి ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వంలో బ్యాంకులో తాకట్టు పెట్టి 150 కోట్లు నుంచి 160 కోట్లు వరకు దారి మళ్లించిన దుర్మార్గుడు జగన్ అని పేర్కొన్నారు. బ్యాంకు నుంచి ఋణం తీసుకున్న సొమ్ముతో ఇళ్ళు పూర్తి చేసేందుకు ఒక్క రూపాయి గాని, అర బస్తా సిమెంట్ గాని ఖర్చు చేయక పోగా రంగులేసుకుని చేతులు దులుపుకున్నారు.లబ్ధిదారుల నుంచి తీసుకున్న బ్యాంకు రుణం, గృహాల నిర్మాణ ఖాతాలో ఉంటే, ఇప్పటికే మిగిలిన ఇళ్ళు పూర్తి చేసి అందరికీ అందజేసే వాళ్ళమని,నేడు కూటమి ప్రభుత్వ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ హడ్కోనించి అప్పు తెచ్చి టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలు, మహిళలకు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.ఇళ్లతో పాటు, అన్ని మౌలిక వసతులు కల్పించే దిశగా పనులు వేగవంతంగా చేస్తున్నామని మంత్రి రామానాయుడు తెలిపారు .మాజీ ఎమ్మెల్సీ అంగర రామోహన్,కమీషనర్ విజయసారది,పెచెట్టి బాబు,యూ కబర్ది,డాక్టర్ ఎర్రా మాధురి తదితరులు పాల్గొన్నారు.

## "సత్య హరిచంద్ర "తో ఉగాది వేడుకలకు శోభ

**ప్రజా భూమి ప్రతినిధి,ఆగిరిపల్లి**



ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా "సత్య హరిచంద్ర" పద్యనాటకాన్ని అభినయ కళా నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించగా, కళాకారులు సాత్రోచితంగా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆగూరు త్రినాధ్ నాయుడు, గుమ్మడి జీవన్ కుమార్ హాజరయ్యారు. గ్రామస్తులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆస్వాదించారు.

## ఏలూరు ప్రజలకు త్రాగునీటి సరఫరా పై సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలన

**ప్రజాభూమి ఏలూరు.**



నగర ప్రజలకు నిరంతర త్రాగునీటి సరఫరా అందించే దెందులూరు సమీపంలో ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్. పెదబాబు మున్సిపల్ కమిషనర్ ఏ. భాను ప్రతాప్‌తో కలిసి పరిశీలించారు.నగర ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు అధికారులు చేపడుతున్న చర్యలను వారు సమీక్షించారు.ట్యాంక్‌లో నీటి నిల్వ సామర్థ్యం, సరఫరా విధానం, నిర్వహణ పరిస్థితులను అధికారులు వివరంగా తెలియజేశారు. వేసవి కాలంలో నగరానికి త్రాగునీటి కొరత రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎం.ఈ ఈ. సురేంద్రబాబు, డి.ఈ నారాయణరావు, ఏ.ఈలు సాయి, పవన్, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, పాము శామ్యూల్ పాల్గొన్నారు.

## మంత్రి సారథి సహకారంతో వార్డు అభివృద్ధికి ఊతం

**ప్రజా భూమి ప్రతినిధి,ఆగిరిపల్లి:**



ఏలూరు జిల్లా ఆగిరిపల్లి గ్రామంలోని 4వ వార్డులో సిమెంట్ రోడ్ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని పంచాయతీరాజ్ శాఖ సహాయ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ప్రజల రాకపోకలకు సౌకర్యంగా 3 మీటర్ల వెడల్పు, 206 మీటర్ల పొడవుతో ఈ రోడ్డును నిర్మించినట్లు చెప్పారు. ఈ పనులకు సుమారు రూ.10.50 లక్షల వ్యయంతో అంచనా సిద్ధం చేసి నాణ్యతతో పూర్తి చేసినట్లు వివరించారు. గ్రామ అభివృద్ధిలో మంత్రి కొలుసు పార్థసారథి సహకారం ఎంతో కీలకమని, వారి ప్రోత్సాహంతో ఈ పనులు సకాలంలో పూర్తయ్యాయని పామర్తి నరసింహారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు దుర్గాప్రసాద్, శంకర్, లక్ష్మీ విక్టర్ బాబు, మదుపల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణే భద్రతకు రక్ష

**ప్రజాభూమి ప్రతినిధి,ఆగిరిపల్లి**



ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండల పరిధిలోని పోతవరపాడు గ్రామ శివారులో విజయవాడ వెళ్లే రహదారిపై శుక్రవారం ఆగిరిపల్లి ఎస్సై శుభశేకర్ ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సూచిస్తూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరిగే ప్రమాదాల తీవ్రతను వివరించి, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. భద్రత నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ స్వీయ భద్రతను దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై శుభశేకర్ సూచించారు.

## రంజాన్ పండుగకు పేద ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ రంజాన్ తోఫా


**ప్రజాభూమి దెందులూరు**



.దెందులూరు నియోజకవర్గ ప్రజల పట్ల మరోసారి తన ప్రేమాభిమానాలను చాటుకున్నారు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.రంజాన్ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని పేద ముస్లిం కుటుంబాలకు ప్రత్యేకంగా రంజాన్ కానుకలను అందించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాదాపు 4200 మంది పేద ముస్లింలకు పాలు, సేమ్యా, పంచదారతో పాటు మటన్ అందించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని సుమారు 1500 పేద ముస్లిం కుటుంబాలకు 400 కిలోల సేమ్యా, 400 కిలోల పంచదార, 1500 లీటర్ల పాలు, దాదాపు 1400 కిలోల మటన్‌ను రంజాన్ కానుకగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఇదిలా ఉండగా గత నాలుగు రోజులుగా మహిళా కుటీర పరిశ్రమల నిర్వాహకులకు చేయూతనందిస్తూ వారి ఆధ్వర్యంలో నాణ్యమైన గోధుమపిండితో ప్రత్యేకంగా సేమ్యా తయారు చేయించారు.నియోజకవర్గంలోని గ్రామాల వారీగా పేద ముస్లిం కుటుంబాల జాబితాను సిద్ధం చేసి,ఆయా గ్రామాల్లో నివసిస్తున్న వారికి రేపు ఈ రంజాన్ కానుకలను అందించనున్నారు.కులమత భేదాలకు అతీతంగా నియోజకవర్గంలో ప్రతి పండుగ సందర్భంగా ప్రజలకు అండగా నిలుస్తూ, ఒక కుటుంబ పెద్దగా,అన్నగా నిలుస్తున్న ఎమ్మెల్యే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని కూటమి నాయకులు, ప్రజలు కొనియాడుతున్నారు.

## శనివారం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

**అమలాపురం ప్రజాభూమి ప్రతినిధి,**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం హౌసింగ్ బోర్డ్ కాలనీ,ఎమ్మెల్యే ఆనందరావు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 1:00 వరకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్జీలు సమర్పించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొబైల్ నెంబర్ మరియు ఆధార్ కార్డు జిరాక్స్ తో హాజరుకావాలని తెలిపారు,

## జిల్లా స్థాయి కథల పోటీలో గోదావరి కవికి ప్రథమ స్థానం!

**పలువురు ప్రశంసలు అభినందనలు.**

**ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం.**



జిల్లా స్థాయి ఉగాది కథల పోటీలో తాను రచించిన ఆత్మగౌరవం కథకు ప్రథమ స్థానం దక్కినట్లు రామచంద్రపురం పట్టణానికి చెందిన గోదావరి కవి డా.ర్యాలి శ్రీనివాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ఆలమూరు బాలమందిరం సాహితీ సంస్థ నిర్వహించిన ఉగాది కథల పోటీలో 18 కథలు ఎంపికైనట్లు సంస్థ అధ్యక్షులు కృష్ణశ్రీ ప్రకటించగా దానిలో శ్రీ నివాసు కథ ప్రథమ స్థానం దక్కించు కుందన్నారు. సమకాలీన సాధారణ అధ్యాపకులు ఎదుర్కొనే సమస్యల ఇతివృత్తం కథాంశంగా తీసుకుని కథ రచించానని ఆయన పేర్కొన్నారు.ఈ నెల 22 న ఆలమూరులో జరిగే పురస్కార ప్రదాన సభలో నగదు బహుమతి, జ్ఞాపికతో సత్కారం పొందనున్నట్టు ఆయన తెలిపారు . ఈ మేరకు ఆహ్వానం అందిందని శ్రీనివాసు పేర్కొన్నారు.కథకు ప్రథమ స్థానం దక్కడం పట్ల సాహితీ గోదావరి సంస్థ సభ్యులు, జాస్తి విద్యా సంస్థల డైరెక్టర్ చిట్టూరి వెంకటేశ్వర రావు డా.ర్యాలి ఈ సందర్భంగా అభినందించారు. అలాగే ర్యాలి శ్రీ నివాసు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాస్థాయిలో కథల పోటీలో ప్రథమ స్థానం సొంతం చేసుకున్నందుకు పలువురు ప్రశంసలతో పాటు అభినందనలు తెలియజేశారు.

## గిరిజన సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాభూమి,కుకునూరు**




విలీన మండలం కుకునూరు ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య ఏపీ మహిళా సమైక్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకాశ్యామల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సభ్యులు ఐతా సురేష్ బాబు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. గిరిజన గ్రామాల్లో రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు .కాగా పోలవరం ప్రాజెక్టు ముంపులేని గ్రామాల పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంటింటి మహిళలకు గుదిబండల మారి గ్యాస్ సరఫరా లో నెలకొన్న ఆటంకాలను నివారించాలని కోరారు ఈనెల 24వ తేదీన సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మార్వో కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు .ఈ సమావేశంలో సోడే నాగేష్ తదితరులు పాల్గొన్నారు

## రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి నిమ్మల

**ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు**



పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలంలో వైవి లంక- బాడవ గ్రామాల మధ్య రూ. 50 లక్షలు నిధులతో రహదారి నిర్మాణానికి ఏపీ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ రహదారి నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి, నిర్ణీత కాలంలో పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కరరావు, వైవి లంక సొసైటీ అధ్యక్షులు ఇనుకొండ వెంకటేశ్వరరావు, ఎలమంచిలి సొసైటీ అధ్యక్షులు బొప్పన హరి కిషోర్, చించినాడ సొసైటీ అధ్యక్షులు రుద్ర రాజు సత్యనారాయణ రాజు, మండల టిడిపి అధ్యక్షుడు మామిడి శెట్టి పెద్దిరాజు,కడలి గోపి తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

**-- జాబ్ క్యాలెండర్ విడుదలపై ఎమ్మెల్యే బడేటి చంటి**

**ప్రజాభూమి ఏలూరు.**



రాష్ట్ర యువతకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేసి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని జిల్లా టిడిపి అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏలూరులోని పవర్‌పేట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, యువగళంలో ఇచ్చిన హామీని మంత్రి లోకేష్ నిలబెట్టుకున్నారని అన్నారు.కొత్త సంవత్సరం రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు భరోసా కల్పించిందని చెప్పారు.వివిధ శాఖల్లో ఒకేసారి 10,060 పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే 20 నెలల్లో 6,28,347 ఉద్యోగాలు కల్పించామని, స్కిల్ డెవలప్మెంట్, డీఎస్సీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగాయని పేర్కొన్నారు.అలాగే విశాఖపట్నం, నెల్లూరు వంటి ప్రాంతాలకు కంపెనీలు తీసుకువచ్చి భవిష్యత్తులో మరో 25 లక్షల ఉద్యోగాలు సృష్టించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా రాష్ట్రంలోనే ఉపాధి కల్పించడమే లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే చంటి విమర్శలు చేశారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగులను మోసం చేసి యువత భవిష్యత్తును దెబ్బతీశారని అన్నారు.ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ కర్రీ శ్రీనివాసరావు, నగర టిడిపి నాయకులు చోడే వెంకటరత్నం, రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

## అప్పును నెత్తిన మోస్తూ అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం

**ఒక్కో వ్యక్తి నెత్తి పైన రూ. 2.40 క్షల అప్పు పెట్టారు**

**పాలకొల్లు నియోజకవర్గంను నెంబర్ వన్ గా తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న**

**మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి**

**ప్రజాభూమి ప్రతి నిధి,పాలకొల్లు**



ఏపీలో గత వైసిపి ప్రభుత్వం మిగిల్చిన రూ. 14 లక్షల కోట్లు అప్పు ను కూటమి ప్రభుత్వం నెత్తిన మోస్తూ అభివృద్ధి,సంక్షేమ పథకాలను లోటు రాకుండా అమలు చేస్తుందని ఏపీ రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఏపీ లో ఒక్కొక్క వ్యక్తి నెత్తినరూ. రెండు లక్షల 40000 అప్పు పెట్టారని, ఇద్దరు ఉంటే రూ.నాలుగు లక్షల 80000, ముగ్గురు ఉంటే రూ.ఏడు లక్షల ఇరవై వేలు, నలుగురు ఉంటే రూ.పది లక్షలు అరవై వేలు అప్పు వైసీపీ ప్రభుత్వం పెట్టుందని , ఇది ప్రభుత్వ స్కీం కాదని ఏపీలో ప్రతి వ్యక్తికి ఉన్న అప్పు మాత్రమేనని అర్థం చేసుకోవాలని ఇదంతా గత ప్రభుత్వ నిర్వాకం అని మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం లో కాజా, బాడవ గ్రామంలోరూ. 2.70 కోట్లతో నిర్మించనున్న రహదారుల నిర్మాణాలకు మంత్రి నిమ్మల శంకుస్థాపన చేసి అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దివ్యాంగుల పెన్షన్లు రూ.3000 నుంచి 6000 రూపాయలకు పెంచడం, అదేవిధంగా మిగిలిన అన్ని పెన్షన్లు పెంచి ఇవ్వడం మాట నిలబెట్టుకోవడం జరిగిందని అన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం 2019 -24 సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా పెంచడానికి మనసు రాలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో 16, 300 టీచర్ పోస్టులు భర్తీ చేస్తే వైసిపి ప్రభుత్వం లో ఒక టీచర్ పోస్ట్ కూడా భర్తీ చేయలేకపోయిందని విమర్శించారు. తల్లికి వందనం ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి కూటమి ప్రభుత్వం ఇస్తే, వైసీపీ ప్రభుత్వం మాత్రం కుటుంబంలో రూ.15000 చొప్పున ఎంత మంది ఉంటే ఎంతమందికి ఇస్తామని చెప్పి ఒక్కరికే రూ.13000 చెప్పునిచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు.పేదలకు ఇళ్ల స్థలాలు పేరు చెప్పి ఎకరానికి రూ. 20 లక్షలుకు రైతు దగ్గర నుంచి కొంటే ప్రభుత్వం నుంచి రూ. 45 లక్షలు చొప్పున కొనుగోలు చేసి, లబ్ధిదారులకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా చేశారని ఆరోపించారు.అన్నదాత సుఖీభవ పథకం కేంద్రంతో కలిపి రైతులకు 20 వేల రూపాయలు ఇస్తున్నామని, మహిళలకు, దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించమని,పేదలకు మూడు గ్యాస్ సిలిండర్లు సరఫరా, ఆటో డ్రైవర్లకు 15000 రూపాయలు చొప్పున అకౌంట్ లో వేస్తున్నామని, 20 లక్షల ఉద్యోగుల కల్పన లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంను ఏపీ లోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దడానికి లక్ష్యంగా కృషి చేస్తున్నానని వారానికి ఏడు రోజులు పని చేస్తూ అవసరమైన చోట్ల నిధులు కోసం ఇతర మంత్రులు గడ్డాలు పట్టుకుని కూడా నిధులు చేస్తున్నామని తెలిపారు. అందువల్ల పాలకొల్లు నియోజకవర్గం ప్రజలు తన కష్టాన్ని అర్థం చేసుకుని ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల సభ ముఖంగా కోరారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కరరావు, సొసైటీ అధ్యక్షులు బొప్పన హరి కిషోర్, పంజా నరసింహారావు, బత్తుల రాజు, రుద్రరాజు సత్యనారాయణ రాజు, యు కబర్థి, బోనం నాని, కొప్పునీడి రాజా, యూ ప్రేమ్ కుమార్,మామిడి చెట్టి పెద్దిరాజు,కడలి గోపి, పీతల శ్రీనివాస్, తోలేటి చంటి, వీరాజీ, అధికారులు వివి రమణ, బి హెచ్ శ్రీనివాస్, వైవిఆర్ నాగేశ్వరరావు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు,గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అకాలవర్షం అపారనష్టం

**రైతుల నడ్డి విరిచిన ఈదురు గాలులు, వర్షం**
**వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న లంక పొగాకు, మిర్చి తోటలు.**
**లబోదిబో మంటూ తలలు పట్టుకు కూర్చున్న రైతులు.**
**వడ్డీగూడెం, వడ్డీగూడెం కాలనీ, విఆర్ పురం గ్రామాల్లో విజృంభించిన గాలివాన బీభత్సం.**
**ఈదురు గాలులు, వానకు ధ్వంసమైన ఇళ్లు.**
**పలుచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ కు అంతరాయం.**
**హుటాహుటిన హెడ్ కోటర్కు విద్యుత్తును పునరుద్ధరించిన విద్యుత్ సిబ్బంది.**

**ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.**



మండలంలో అకాల వర్షం, ఈదురుగాలులకు రైతుల ఆశలను ఆవిరి చేశాయి, మిర్చి, లంక పొగాకు పంటలను సాగు చేస్తున్న రైతులకు నిరాశ మిగిల్చాయి. గత రెండ్రోజులుగా వాతావరణం ఒక్కసారిగా మారిన విషయం విదితమే, పలు చోట్ల ఈదురుగాలులు, వడగళ్ళతో విస్తారంగా వర్షాలు కురిశాయి. గురువారం సాయంత్రం మండలంలో కురిసిన అకాల వర్షం రైతులను అతలాకుతులం చేసి అపారణష్టాన్ని చవిచూసేలా చేసింది. మండల వ్యాప్తంగా ఈ సీజన్‌లో దాదాపుగా రెండువేల ఎకరాలలో లంక పొగాకు సాగు చేస్తున్నారు రైతులు. అలాగే దాదాపు ఐదు వందల ఎకరాల్లో మిర్చి పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు రైతులు కంటికి రెప్పలా పంటలను చూసుకుంటూ వచ్చారు, కానీ ఈ అకాల వర్షం ప్రభావం రైతుల నడ్డి విరిచింది. కురిసిన ఈదురు గాలులు వర్షం ప్రభావంతో లంక పొగాకును కోసి పాకమీదకు ఎక్కించి ఆరబెట్టిన తరువాత, వర్షాలు కురుస్తాయని తెలిసి ప్లాస్టిక్ పరదాలతో కప్పుకొని భద్రపరిచారు రైతులు, అయినా కానీ ఈ తుఫాను లాంటి గాలివానకు పొగాకు పాకాల పై కప్పుకున్న పరదాలు చినిగిపోయి, కొన్ని పాకలు పేక మేడల కూలిపోయి కురిసిన వర్షానికి తడిసిముద్ద అయ్యాయి. అదేవిధంగా మిర్చి



పంటలను సాగు చేస్తున్న రైతులు కోసిన మిర్చిని కళ్లాలలో ఆరబెట్టిన మిర్చి, వర్షం వస్తుందని తెలిసి మిర్చి అంతా కళ్లాలలో పోగుచేసి పరదాలు కప్పినా ఫలితం లేక పోయింది. విపరీతమైన గాలి, వడగళ్ల వాన దాటికి పరదాలు చెదిరిపోయి, మిర్చి కొంత గాలికి కొట్టుకు పోయి మిగిలిన మిర్చి అంతా తడిసి ముద్దయ్యాయి. అలాగే ఈ ప్రకృతి వైపరీత్యానికి కోతలు కోయకుండా ఉన్న లంక పొగాకు వడగళ్ల వానకు ఆకులు చినిగిపోయాయి, మిర్చి విషానికి వస్తె ఈదురు గాలులకు కాయలతో ఉన్న మిరప మొక్కలు పడిపోయి రైతులకు కన్నీళ్లను మిగిల్చాయి. ఇప్పటి వరకు రైతులు ఒక ఎకరాకు లంక పొగాకు దాదాపుగా రెండు లక్షలు రూపాయలను ఖర్చు చేయగా, అదే విధంగా మిర్చి సాగుకు కూడా దాదాపుగా ఒక ఎకరాకు రెండు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఉన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి అందే సమయానికి అకాల వర్షం బీభత్సానికి నేలపాలు కావటంతో రైతులు లబోదిబోమంటూ తలలు పట్టుకు కూర్చున్నారు.



**గ్రామాల్లోనూ బీభత్సం సృష్టించిన గాలివాన దుమారం:** అకస్మాత్తుగా మండలంలో అటు రైతాంగాన్ని, ఇటు గ్రామస్తులను గాలివాన దుమారం బీభత్సం సృష్టించి తీవ్రనష్టాన్ని మిగిల్చింది. ప్రకృతి విలయతాండవం చేసి భారీ తుఫాను లాంటి గాలివానకు వడ్డీగూడెం, వడ్డీగూడెం కాలనీ, విఆర్ పురం గ్రామాల్లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి, పలుచోట్ల బారి చెట్లు విరిగి ఇల్లమీద పడి ఇల్లు ధ్వంసం కావటం, విపరీతమైన వీచిన గాలికి ఇంటి



పై కప్పులు ఎగిరి దూరంగా పడటం జరిగింది. నరసింహస్వామి గుడిమీద కరెంట్ స్తంభం పడి డామేజ్ ఐంది, ప్రధాన సెంటర్లో రెండు కరెంటు స్తంభాలు, ఎకిదున బొడ్డు రమణయ్య ఇంటి దగ్గర ఒక స్తంభం, బాగుల ఆత్మారావు ఇంటివద్ద ఒక కరెంటు స్తంభం నేలకొరిగాయి. అదేవిధంగా గ్రామంలోని బొర్రా బుచ్చమ్మ, ముంజపు మోహనరావు, బొర్రనాగసింహాద్రి, పట్టి శంకర్రావు, బొర్రా నాగేశ్వరావు, బొర్రా వెంకట రమణ, ముంజపు సీత రామమ్మ, కడుపు ప్రభావతి, బొర్రా దుర్గా, బొర్రా వరలక్ష్మి, ముంజపు సీత రామమ్మ, ముంజపు అయ్యప్ప, పోర్తుల సత్యనారాయణ, బొర్రా సుశీల తదితరుల ఇల్లు కొన్ని పాక్షికంగాను, కొన్ని పూర్తిగాను గాలివాన బీబచ్చానికి దెబ్బతిన్నాయి. అలాగే వడ్డీగూడెం కాలనీ గ్రామంలో కోట్ల నరేష్ ఇల్లు పైకప్పు, గాలివానకు పూర్తి లేచి పడిపోయింది. అదేవిధంగా విఆర్ పురం వద్ద జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఒక ట్రాన్స్ఫార్మర్ కలిగిన విద్యుత్ స్తంభం ఈ ప్రకృతి విలయతాండవానికి నేలకొరిగింది. ఈదురు గాలులు, భారీ వర్షాలకు గురువారం రాత్రి మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయ ఏర్పడింది. పలుచోట్ల పడిపోయిన విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ తీగలను, విద్యుత్ సిబ్బంది సరిచేసి మండల హెడ్కోటర్కు విద్యుత్ను పునరుద్ధరించారు.

## ఏలేశ్వరంలో సత్‌సంఘ్

**ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం**



రాష్ట్ర విశ్వ హిందూ పరిషత్ ఆదేశాల మేరకు.. ఏలేశ్వరం మండల విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలేశ్వరం లో గల దిబ్బల పాలెం లో గల కోదండ రామాలయం లో రామ మహోత్సవం లలో భాగంగా అక్కడ గల భజన మండలులు ఇరుగు పొరుగు వారు, ఆలయ ధర్మకర్తలు, అందరితో కలసి సత్ సంఘ్ నిర్వహించారు. ఈ సత్సంగంలో రాముని చరిత్ర, రాముని భజన, రామ గీతాలు, హనుమాన్ చాలీసా, దేశ భక్తి గీతాలు ఆలపించుట జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా విహెచ్పి సంస్కృతి విభాగ్ కన్వీనర్. కే . కిరీటి బాబు మండల కార్యదర్శి. పి . దేవి. మాతృశక్తి అధ్యక్షురాలు కే. రమా దేవి, గిరిజ, వి. లక్ష్మి,బేబీ, నాగమణి, సత్యవతి, అనురాధ, హైమావతి, సత్యనారాయణ, గీతా ఆశ్రమం సంరక్షకుడు ముక్కోటి ఆలయ ధర్మ కర్త శిడగం త్రివేణి వెంకటేశ్వరరావు కుటుంభ సభ్యులు, లక్ష్మి నారాయణ భజన మండలి పందరి నాథ భజన మండలితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ ఇక్కడ ఇంత ఘనంగా కార్యక్రమం జరగడానికి సహకరించిన మాజీ. జడ్పిటిసి సభ్యులు శిడగం వెంకటేశ్వరరావు భక్త బృందల వారికి వి హెచ్ పి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉగాది పచ్చడి పంపిణి చేసిన డొక్కా సీతమ్మ సేవాసమితి

**ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం**



ఏలేశ్వరం పట్టణంలో బాలాజీ చౌక్ సెంటర్లో డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యులు మీడియాతో మాట్లాడుతూ ముందుగా అందరికీ పరాభావ నామ సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. గత రెండు సంవత్సరాల నుంచి ఉగాది పచ్చడిని పుర ప్రజలకు పంపిణీ చేయడం జరుగు తుందని,పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయబాబు,సిహెచ్సి చైర్మన్ వాగు రాజేష్,మెల్లిపాక నాగేంద్ర,సిరి ఫుడ్ కృష్ణ,కుర్ర గోవిందు,పబ్లిక్ స్కూల్ మాస్టర్ సత్యనారాయణ,నడికట్ల వెంకన్న,తిరగటి సత్యనారాయణ,పంపన సూరిబాబు,స్కూల్ చైర్మన్ శ్రీను,డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామికి స్వర్ణ శఠగోపం సమర్పణ



**భీమవరం నివాసితురాలు ఉద్దరాజు సత్యవతమ్మ స్మారకార్థం108 గ్రాముల బరువుగల, దాదాపు రూ.17 లక్షల విలువైన స్వర్ణ శఠగోపం.**

**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.**

కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈరోజు భక్తిశ్రద్ధల నడుమ విశేష కార్యక్రమం జరిగింది. భీమవరం నివాసితురాలు ఉద్దరాజు సత్యవతమ్మ స్మారకార్థం ఆమె కుమారులు రాఘవరాజు, సూర్యనారాయణరాజులు స్వామివారికి సుమారు 108 గ్రాముల బరువుగల, దాదాపు రూ.17 లక్షల విలువైన స్వర్ణ శఠగోపాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో ఘనంగా జరిగింది. భక్తులు సమర్పించిన స్వర్ణ శఠగోపాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావుకు అధికారికంగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే, దాతలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో కొనసాగుతున్న ఉచిత క్యూలైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వేసవి దృష్ట్యా క్యూలైన్‌లో ఫ్యాన్లు ఏర్పాటు చేయడం, తాగునీటి సదుపాయం నిరంతరం అందుబాటులో ఉంచడం, వృద్ధులు, చిన్నపిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం కోనసీమ ప్రాంతంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), ధర్మకర్తల మండలి సభ్యులు తమ్మన సాయి ప్రసాద్, స్థానిక నాయకులు, భక్తులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## రావులపాలెం డిపో నుంచి రామేశ్వరం--అరుణాచలం యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభం

**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) రావులపాలెం డిపో నుండి భక్తులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రామేశ్వరం--అరుణాచలం యాత్ర సూపర్ లగ్జరీ బస్సు శుక్రవారం ఘనంగా బయలుదేరింది. ప్రయాణికుల విశేష ఆదరణతో ఈ యాత్ర ప్రారంభమైందని డిపో మేనేజర్ వైవీవీ ఎన్. కుమార్ తెలిపారు. ఈ ప్రత్యేక యాత్ర బస్సు మార్చి 25, 2026న బయలుదేరి ఏప్రిల్ 3, 2026న తిరిగి రావులపాలెం చేరుకోనుంది. యాత్రకు ఒక్కో టికెట్ ధర రూ. 9,000గా నిర్ణయించగా, ఇందులో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం టిఫిన్ సదుపాయాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ యాత్రలో భాగంగా భక్తులు మంత్రాలయం, హంపి, గోకర్ణ, మురుడేశ్వర్, మూకాంబికా, ఉడిపి, శృంగేరి, హొర్నాడు, ధర్మస్థలం, కుక్కే సుబ్రహ్మణ్యం, శ్రీరంగపట్నం, మైసూరు వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకునే అవకాశం కల్పించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఏప్రిల్ 25 నుంచి ఇప్పటివరకు రావులపాలెం డిపో ద్వారా మొత్తం 155 ప్రత్యేక బస్సులు నడిపినట్లు తెలిపారు. ఇందులో శబరిమల యాత్రకు 16, విజయవాడ భవాని యాత్రకు 18, కోనసీమ దర్శనానికి 28, కర్ణాటక--మైసూరు యాత్రకు 3, కాశి యాత్రకు 1, భద్రాచలం యాత్రకు 4, శ్రీశైలం యాత్రకు 2 బస్సులు నిర్వహించినట్లు వెల్లడించారు. అదేవిధంగా కార్తీక మాసంలో కూడా ప్రత్యేక బస్సులు నడిపినట్లు తెలిపారు. ప్రయాణికుల ఆదరణకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఇదే ఉత్సాహంతో మరిన్ని యాత్రా బస్సులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మార్చి 25న బయలుదేరే కర్ణాటక యాత్ర బస్సు టికెట్ల కోసం ఆసక్తి గల వారు అసిస్టెంట్ మేనేజర్ను సంప్రదించాలని సూచించారు.

ద

## నవోదయ ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించిన గిరిజన విద్యార్థిని.

**ప్రజాభూమి ప్రతినిధి చింతూరు.**



నవోదయ ఆరో తరగతి ప్రవేశాల ఎంట్రన్స్ టెస్టులో చింతూరు మండలం పోలవరం జిల్లా ఎర్రంపేట ఎంపీపీ పాఠశాల కు చెందిన కారం నిక్షిప్త సాయి అనే విద్యార్థిని నవోదయ ఎంట్రన్స్ లకు పరీక్షలు రాయగా డివిజన్ స్థాయిలో 5వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పండా కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థిని మంచిర్యాంకు సాధించడం గొప్ప విషయం అని పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఎస్ఎంసి సభ్యులు తల్లిదండ్రులైన కారం ధారయ్య గంగాభవాని లను అభినందించారు.

## జాబ్ క్యాలెండర్ తో నిరుద్యోగులకు భరోసా

**జాబ్ క్యాలెండర్ తో యువతకు అండగా కూటమి ప్రభుత్వం - కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**

**ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.**



యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ యువగలం పాదయాత్ర లో నారా లోకేష్ యువతకు ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదలకు కృషి చేసి యువతకు పెద్దన్న లా వ్యవహించారు అని ఎమ్మెల్యే ప్రశాంశించారు. ఉగాది సందర్భంగా ప్రభుత్వం 10,060 ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్లో ప్రధానంగా విద్య, పోలీస్ శాఖలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఇప్పటికే 20 నెలల్లోనే 6,28,347 ప్రైవేటు ఉద్యోగాలను యువతకు అందించడం జరిగిందన్నారు. వీటితో పాటు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి భారీగా టీచర్ పోస్టులను భర్తీ చేసిందని, నేడు మరోసారి డీఎస్సీని, జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం 3,000 ఖాళీలను కేటాయించిందని, ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,500 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తుందన్నారు. పరిపాలనా విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల కోసం దాదాపు 600 పోస్టులతో పాటు శాంతి భద్రతల పరిరక్షణ కోసం 1,000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ కాబోతున్నాయన్నారు. జాబ్ క్యాలెండర్ తో నిరుద్యోగులకు భరోసా లభిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానన్న జగన్ రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేసి ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కొత్తగా రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు రాకపోగా కమీషన్ల కోసం ఉన్న కంపెనీలను తరిమేసి 34 లక్షల మంది యువత భవిష్యత్ ను నాశనం చేశారన్నారు. జగన్ పాలనలో యువత ఉద్యోగాలు, ఉపాధి లేక వేలాదిమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక ప్రకారం గ్రాడ్యుయేట్లలో 24 శాతం నిరుద్యోగంతో అప్పట్లో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ద్వారా నిరుద్యోగుల పట్ల, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను తెలుపుతుందన్నారు

## చింతూరులో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్

**ప్రజాభూమి ప్రతినిధి చింతూరు**



చింతూరు పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పోలీస్ ఉన్నతాధికారులైన డిజిపి హరీష్ గుప్తా పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఏ ఎస్ పి బొడ్డు హేమంత్ సిఐ గోపాలకృష్ణ నేతృత్వంలో చింతూరు ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో చింతూరులోని సంత మార్కెట్ లోను, చింతూరు ఒడ్డు లోని ప్రతి ఇంటిని సందర్శించి,కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆధార్ కార్డులు సేకరించారు. ఇంట్లో ఉండే జనాభా ఎంత ? ప్రతి ఇంట్లో అద్దెకు ఎవరు ఉంటున్నారు ? మొదలగు వివరాలు సిబ్బందితో సేకరించారు. ఛత్తీస్గఢ్, ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దు పోలీస్ స్టేషన్ అవడంతో, గంజాయి అక్రమ రవాణా, కొత్త వ్యక్తుల గురించి ఆరా తీశారు. అలాగే సి బుక్కు లేని ద్విచక్ర, ఆటో, తదితర వాహనాలు గురించి వివరాలు సేకరించారు. కొత్త అపరిచిత వ్యక్తుల వివరాలు, వేలి ముద్రలు కూడా సేకరించారు. ఈ కార్యక్రమంలో ,ఎస్ఐ రమేష్, తో పాటు,ఎ ఎస్ఐ దొర, మల్లికార్జున్, పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## 25 మందికి రూ.12.74 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.

**అనారోగ్య బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా.**
**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్.**

**ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం.**



రామచంద్రపురం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 25 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.12.74 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 1,36,240 మందికి 1241 కోట్ల మేర ఆర్థిక, వైద్య సాయం సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించినట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణ విషయంలో సీఎం సహాయనిధి కష్టకాలంలో ఆదుకునే ఆపన్నహస్తమని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం గొప్ప భరోసానిచ్చే చర్యగా మంత్రి సుభాష్ అభివర్ణించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి అందేలా కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ,కడియాల రాఘవన్,కంచుమర్తి బాబురావు, కొండేటి చక్రం, బొండా శ్రీను, కేసన నారాయణమూర్తి, కొప్పిశెట్టి లక్ష్మినారాయణ,దంగేటి గౌరీ శంకర్, వనుం వీరబ్రహ్మం, నారపురెడ్డి బలరాం, గున్నం వినోద్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో ఉగాది వేడుకలు

**అమలాపురం ప్రజాభూమి ప్రతినిధి,**



డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరాభవనామ ఉగాది వేడుకలు జరిగాయి ఈ ఉగాది కార్యక్రమంలో కవిత గానం చేసిన తెలుగు లెక్చరర్, కవి ఎస్.సంసోను ను ఏపీసి మరియు ఆర్డిఓ జి.మమ్మి,దేవాదాయ ధర్మాదాయ సహాయం కమీషనర్ వి.సత్యనార యణ,జిల్లా వైద్యాధి కారి ఎమ్.దుర్గా రావు ఉగాది సభా నిర్వాహ కులుజియస్.సుబ్రమణ్యం సాలువా కప్పి ఘనంగా సత్కరించారు.స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల కర్సాపాండెంట్ కె.నరసింహారావు ప్రిన్సిపాల్ మనోహర్, వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్ అధ్యాపకులు విద్యార్థులు ప్రత్యేక అభినందనలు,తెలియ జేశారు,.

కూటమి ప్రభుత్వంతోనే యువతకు స్వర్ణయుగం

## – దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌తో ఉత్తరాంధ్రకు మహర్దశ

**స్టీల్ ప్లాంట్ కరపత్రాన్ని ఆవిష్కరించిన**
**కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు**

**కాకినాడ, ప్రజాభూమి ప్రతినిధి:**



రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు, కాకినాడ జిల్లా టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు సంయుక్తంగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఉగాది కానుక 'జాబ్ క్యాలెండర్' వివరాలను మీడియాకు వెల్లడించారు. అనంతరం, అనకాపల్లిలో ఏర్పాటు కానున్న 'దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్' ప్రాజెక్టు కరపత్రాన్ని ఇద్దరు నేతలు కలిసి ఆవిష్కరించారు. ఈ ప్రెస్ మీట్‌లో ఎమ్మెల్యే కొండబాబు, శ్రీనివాస్ బాబా వెల్లడించిన ముఖ్య అంశాలు:రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కొండబాబు, శ్రీనివాస్ బాబా తెలిపారు. కేవలం 20 నెలల కాలంలోనే వివిధ రంగాల ద్వారా 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించామన్నారు. విద్య, పోలీసు శాఖలకు పెద్దపీట వేస్తూ నోటిఫికేషన్లు ఇస్తున్నామని, ఇప్పటికే మెగా డీఎస్సీ ప్రకటించామన్నారు. త్వరలో 3,000 జూనియర్ లెక్చరర్ పోస్టులు, యూనివర్సిటీల్లో 1,500 అధ్యాపక పోస్టులు, 600 గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులు, 1,000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపామని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ నుంచి నియామకం వరకు స్పష్టమైన గడువులతో, పారదర్శకంగా ప్రక్రియను చేపడుతూ నిరుద్యోగులకు ప్రభుత్వం భరోసా ఇస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ గారి ప్రత్యేక చొరవతో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక వృద్ధికి పెద్దపీట పడుతోందని నేతలు హర్షం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ (ఏఎం/ఎన్ఎస్) సంయుక్తంగా రూ. 1,35,964 కోట్ల పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నాయని వెల్లడించారు. 2,200 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్ ద్వారా మొత్తం 55,000 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, తొలిదశలో రూ. 80 వేల కోట్ల పెట్టుబడితో 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో జగన్ రెడ్డి యువత భవిష్యత్తును దారుణంగా నాశనం చేశారని ఎమ్మెల్యే కొండబాబు, శ్రీనివాస్ బాబా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని విమర్శించారు. కమీషన్ల కోసం రాష్ట్రంలో ఉన్న కంపెనీలను తరిమేసి 34 లక్షల మంది యువతను రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అసమర్థ పాలన వల్లే పీఎల్ఎఫ్ఎస్ (ఏఎల్ఎఫ్ఎస్) నివేదిక ప్రకారం రాష్ట్రంలో గ్రాడ్యుయేట్లలో 24% నిరుద్యోగంతో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, ఎన్సీఆర్బీ (చీజ=దీ) నివేదిక ప్రకారం ఉపాధి లేక 4,100 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో టౌన్ పార్టీ అధ్యక్షులు మల్లిపుడి వీరు, కాకినాడ పార్లమెంట్ అధికార ప్రతినిధి తుమ్మల సునీత, కార్యనిర్వాహక కార్యదర్శి రామదేవు సీతయ్యదొర, కార్యదర్శి గాడి శివ రామ కృష్ణ, ఎం.డి. ఖాన్, మీడియా కో-ఆర్డినేటర్ రహీమ్, కొనాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 21 మార్చి 2025

# జల సంరక్షణ భూగర్భ జలాల పెంపే లక్ష్యం తెలుగుదేశం



ప్రజాభూమి , ఎన్ పి కుంట

జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా "మన పల్లె-మన నీరు" కార్యక్రమం ప్రతిష్టాత్మకం చేపట్టినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. మండల వ్యాప్తంగా చెరువుల్లో పూడికతీత, ఫీడర్ ఛానల్స్ అభివృద్ధి, హంద్రీనీవా నీటితో చెరువులను నింపడం వంటి పనులను, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నేతృత్వంలో మన పల్లె మనమేలు కార్యక్రమం నిర్వహించారు.

జల సంరక్షణ: వర్షపు నీటిని నిల్వ చేయడం, చెరువులు మరియు కుంటలను పునరుద్ధరించడం.

భూగర్భ జలాల పెంపు: పూడికతీత పనుల ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంచడం.

ఉపాధి హామీ పథకం: ఉపాధి హామీ పనుల ద్వారా ఫీడర్ ఛానళ్ల అభివృద్ధి, నీటి వనరుల సంరక్షణ.

కమ్యూనిటీ భాగస్వామ్యం: "మన పల్లె మన నీరు" కార్యక్రమంలో భాగంగా, గ్రామ ప్రజలే స్వయంగా తమ ఊరి సమస్యలను ప్రజలే చేసుకునే విధంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గ్రామస్తులకు తెలియజేశారు వర్షాకాలం ప్రారంభానికి ముందే మండలంలోని చెరువులు, సప్లై ఛానళ్లు, కాస్కేడ్ చెరువుల్లో పూడికతీత పనులను పూర్తి చేయాలి. నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న కంప చెట్లను తొలగించి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలి. పనుల్లో జాప్యం లేకుండా చూసేందుకే ప్రభుత్వ పరంగా కొత్త యంత్రాలను సమకూర్చినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీరాములు నాయుడు ,చంద్రశేఖర్ నాయుడు, దండే రవి,, వంకమద్ది నరసింహులు, వంకమద్ది రవి, నాగేంద్ర, నరసింహారెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# అకాల వర్షం అపారనష్టం





ప్రజాభూమి ఎన్ పి కుంట

మండలంలోని పి కొత్తపల్లి, ఎన్ పి కుంట గ్రామాలలో గౌకనపల్లి లో మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర రెడ్డి, అలాగే వెలిచెలమల గౌకనపల్లి, మరికొమ్మదిన్నె, ఎన్ పి కుంట గ్రామాల్లో ఉద్యాన అధికారి ప్రతాప్ రెడ్డి అకాల వర్షాలకు, వడగండ్ల వాన మరియు ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటలను ఆయా అధికారులు ఆయా గ్రామాల్లో సందర్శించడం జరిగింది. ముఖ్యంగా వ్యవసాయ పంటలకు సంబంధించి మండల వ్యాప్తంగా మొక్కజొన్న 60 ఎకరాలు సాగులో ఉండగా పి కొత్తపల్లి మరియు ఎన్ పి కుంట గ్రామాల్లో 7 మంది రైతులకు గాను 10 ఎకరాలలో 33 శాతం కంటే అధికంగా మొక్కజొన్న పంట నష్టపోయినట్లు అధికారులు గుర్తించి ప్రాథమిక నివేదికను జిల్లా వ్యవసాయ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. అలాగే ఉద్యాన పంటలకు సంబంధించి మండల వ్యాప్తంగా దాదాపు 300 ఎకరాలలో సాగు చేస్తున్న మామిడి తోటల్లో వడగండ్లు మరియు ఈదురు గాలుల దెబ్బకు పిందె మరియు కాయలు అధిక మొత్తంలో నేలరాలినట్లు ఉద్యాన అధికారి ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ మరియు ఉద్యాన అధికారులతో పాటు రైతు సేవా కేంద్ర సిబ్బంది హరి, శ్రీకృష్ణ నాయక్ మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# ప్రాణాపాయ స్థితిలో గర్భవతి

## -అత్యవసర శస్త్రచికిత్సతో ప్రాణాలు కాపాడిన వైద్యులు

## -వైద్యుల చర్యల పట్ల ప్రశంసలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

తీవ్ర వాంతులు, కడుపునొప్పితో బాధపడుతూ గురువారం అర్ధరాత్రి ప్రభుత్వాసుపత్రికి వచ్చిన ఒక మహిళను అత్యవసరంగా శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడిన సంఘటన జరిగింది. మడకశిర మండలం బి. రాయాపురంకు చెందిన మహిళ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఇప్పటికే ఎల్.ఎస్.సి.ఎస్. ట్యూబెక్టమీ ద్వారా ఇద్దరు పిల్లలు ఉన్న ఈ మహిళకు పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. ఆ సమయంలో బయట ఎటువంటి స్కానింగ్ సదుపాయం అందుబాటులో లేకపోయినా, అనంతరం నిర్వహించిన స్కాన్‌లో గర్భాశయానికి దూరంగా ఎడమపై భాగంలో సజీవంగా ఉన్న ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ ఉన్నట్లు నిర్ధారించారు. ఇది అత్యంత ప్రమాదకర పరిస్థితి కావడంతో వెంటనే చర్యలు చేపట్టారు. సూపరింటెండెంట్‌కు సమాచారం అందించిన తరువాత గైనకాలజిస్ట్ వైద్యులు బాబాబుడేన్, అనస్థీషియా వైద్యురాలు నాగశ్రీ సహకారంతో వైద్య బృందం అత్యవసరంగా లాపరోటమీ శస్త్రచికిత్స చేపట్టారు. శస్త్రచికిత్సలో ఫైబ్రియల్ ఎండ్ నుంచి సుమారు 1000 మిల్లీలీటర్ల గడ్డకట్టిన రక్తస్రావం జరుగుతున్నట్లు గుర్తించారు. అలాగే వెనుక పొత్తికడుపు గోడకు అతుక్కుని ఉన్న ఎడమ అడెనెక్సియాలో సజీవంగా ఉన్న పిండాన్ని వైద్యులు అత్యంత జాగ్రత్తగా తొలగించారు. సంక్లిష్ట పరిస్థితుల్లోనూ వేగంగా స్పందించి, సమర్థవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యుల నైపుణ్యంతో మహిళ ప్రాణాపాయం నుంచి బయటపడింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్య బృందం చూపిన చొరవ, నైపుణ్యంపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా సేవలను అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారని అభినందిస్తున్నారు.



# 'బాబుతోనే జాబు'ను నిజం చేస్తున్నాం : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

- ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు
- ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల
- మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్
- గతేడాది మెగా డీఎస్సీతో 16 వేల టీచర్ పోస్టుల భర్తీ
- 6 వేలకు పైగా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకం
- 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం
- మాట తప్పిన జగన్... హామీని నిలబెట్టుకున్న లోకేశ్
- ఉద్యోగాల భర్తీ అంటూ యువతకు జగన్ మోసం : మంత్రి



ప్రజాభూమి ప్రతినిధి,సోమందేపల్లి/శ్రీసత్యసాయి

బాబుతోనే జాబు గ్యారంటీ అనే నినాదాన్ని నిజం చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగ యువతను జగన్ మోసం చేస్తే, టీచర్, పోలీసు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి మంత్రి నారా లోకేశ్ మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను నిలబెట్టుకుంటామని మంత్రి సవిత స్పష్టంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు విజయవంతం చేశామని, ఉగాది సందర్భంగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కోసం దివ్యాంగుల శక్తి పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్లు, పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణం ఇలా అభివృద్ధిని, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

**మాట నిలబెట్టుకున్న లోకేశ్ :** ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారని మంత్రి సవిత తెలిపారు. 10,060 ఉద్యోగాల భర్తీకి ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. ఇది రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు శుభవార్తని అన్నారు. అధికారంలోకి రాగానే 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. జగన్ సహా వైసీపీ నాయకులు కోర్టుల్లో ఎన్ని కేసులు వేసినా, వాటిన్నింటినీ అధిగమించి మెగా డీఎస్సీ నిర్వహించారని మంత్రి నారా లోకేశ్ ను కొనియాడారు. అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను నిలబెట్టుకుంటామని మంత్రి సవిత స్పష్టం చేశారు. బాబుతోనే జాబ్ గ్యారంటీని అనే నినాదాన్ని మాటలతో సరిపెట్టకుండా నిజం చేస్తున్నామన్నారు. ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ నిరుద్యోగ యువతను జగన్ మోసం చేశారని మండిపడ్డారు.

**ఘనంగా చౌడేశ్వరీ దేవి జాతర :** అంతకుముందు సోమందేపల్లిలో వెలసిన చౌడేశ్వరీ దేవిని మంత్రి సవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి సోమందేపల్లి వాసులు ఘన స్వాగతం పలికారు. జాతర ఏర్పాట్లు, సౌకర్యాల గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. వారంతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తనను కలిసి విలేకరులతో మాట్లాడుతూ, జాతర ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులను అభినందిస్తూ, జాతర సజావుగా నిర్వహణకు ఆలయం వరకూ సీసీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలో రూ.2.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి కల్పన వంటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాష్ట్రంపై చౌడేశ్వరీ దేవి కృప ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మంత్రి సవిత వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు, చౌడేశ్వరీ దేవి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి సకాలంలో గ్యాస్ పంపిణీ చేస్తున్నాం

- వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దు
- ఎవరూ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చి వేచి చూడరాదు
- అనవసరంగా గ్యాస్ బుక్ చేయవద్దు
- ఇంటి వద్దకే గ్యాస్ డోర్ డెలివరీ చేయబడుతుంది
- యధావిధిగా గ్యాస్ సరఫరా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్
- అనంతపురం రూరల్ లోని ఆలమూరు వద్దనున్న ఉమా భారతీ ఇండియన్ గ్యాస్ గోడౌన్ ను, నగరంలోని పవన్ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..




ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, సరిపడా గ్యాస్ నిల్వలున్నాయని, ఆన్లైన్లో బుక్ చేసుకున్న వారికి సకాలంలో గ్యాస్ పంపిణీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ స్పష్టం చేశారు. శుక్రవారం అనంతపురం రూరల్ పరిధిలోని ఆలమూరు వద్దనున్న ఉమా భారతీ ఇండియన్ గ్యాస్ గోడౌన్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అవసరం ఉన్న వినియోగదారులకు గ్యాస్ పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. యధావిధిగా గ్యాస్ సరఫరా చేయడం జరుగుతోందన్నారు. గ్యాస్ పంపిణీలో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. వినియోగదారులు అనవసరంగా గ్యాస్ బుక్ చేయవద్దన్నారు. ఆన్లైన్లో బుక్ చేసుకోవాలని, ఓటీపీ ద్వారా డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఏజెన్సీల వద్దకు వెళ్లి బుక్ చేసుకోవాల్సిన అవసరం లేదని, ఎవరు ఏజెన్సీల వద్దకు రావద్దని, ఇంటి వద్దనే గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేయడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన స్టాక్ అందుబాటులో ఉందని, ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. పట్టణ ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో మైక్ ల ద్వారా చెత్త సేకరణకు వచ్చే వాహనాల్లో ప్రచారం చేయించాలని, ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్, డిపిఓలతో మాట్లాడి గ్యాస్ అందుబాటులో ఉంది, ఎవరూ ఆందోళన చెందవద్దు అనేది విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా తహసీల్దారులు వారి మండలాల్లో గ్యాస్ ఏజెన్సీలను తనిఖీ చేయమని చెప్పామని, శుక్రవారం ఆయా మండలాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఎక్కడ గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్ కు వెళ్లకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీఆర్వోలు జిల్లాలో ఉన్న 50 ఏజెన్సీలలో అందుబాటులో ఉండాలని, గ్యాస్ సరఫరాని మానిటర్ చేయాలన్నారు. పవన్ గ్యాస్ ఏజెన్సీ తనిఖీ, అనంతరం జిల్లా కలెక్టర్ నగరంలోని ఏపిహెచ్బి కాలనీలోని పవన్ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపెనింగ్ బ్యాలెన్స్ ఎంత ఉంది, యావరేజ్ సేల్స్ ఎలా ఉంది, తదితర వివరాలను అడిగి తెలుసుకుని ఆన్లైన్లో గ్యాస్ బుకింగ్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వెంకటేశ్వర్లు, సిఎస్డిటి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురము

జిల్లాలోని ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్, జేసి సి.విష్ణుచరణ్, డిఆర్ఓ మలోల తదితరులు తెలిపారు. శనివారం అనంతపురం నగరంలోని ఈద్గా మైదానంలో రంజాన్ పండుగ ఈద్-ఉల్-ఫితర్ అన్నది ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగ అని, ఇది ముస్లింలు పవిత్ర ఉపవాసాలతో గడిపే రంజాన్ నెలకు ముగింపు రోజు అని, సఖ్యతకు, త్యాగానికి ప్రతీక అని, ముస్లిం సోదర, సోదరీమణులు సుఖ సంతోషాలతో సుహృద్భావ, సామరస్య, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

# ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

## -మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

## -ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన సేవలు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

వచ్చే వేసవిలో పట్టణంలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హిందూపురం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో పాటు వివిధ విభాగాల అధికారులు కలెక్టర్ కు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పురపాలక సంఘానికి సంబంధించిన కౌన్సిల్ ఆమోదం పొందిన అంశాలపై రికార్డులను పరిశీలించారు. ప్రతి పనికి కేటాయించిన నిధులు, అమలు పరిస్థితులపై కమిషనర్ ను అడిగి తెలుసుకున్నారు. అలాగే మున్సిపాలిటీకి సంబంధించిన సమగ్ర నివేదికలను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లీం సోదరులకు రంజాన్ శుభకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రాతినిత్యం వహిస్తున్నారని, హిందూపురం పురపాలక సంఘానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పురపాలక పరిధిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. త్వరలో మున్సిపల్ పరిధిలోని 38 వార్డులను క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసిన అయన, పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమగ్రంగా అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని చెప్పారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల సంరక్షణ వంటి అత్యవసర సేవలు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

# హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

## -గృహావసర సిలిండర్లు ఉపయోగిస్తే కఠినచర్యలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

బహిరంగ మార్కెట్‌లో గ్యాస్ వినియోగంపై తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాల సిలిండర్లు కాకుండా గృహావసర సిలిండర్లు వినియోగిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ హారతి నేతృత్వంలో రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆయా హోటళ్లు, రెస్టారెంట్లలో వంటగదిలోని పరిశీలించి ఎలాంటి సిలిండర్లను ఉపయోగిస్తున్నారన్న విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ హారతి మాట్లాడుతూ, హోటళ్లు, రెస్టారెంట్లలో వాణిజ్య అవసరాల సిలిండర్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఎవరైనా తమ వ్యాపారాల కోసం గృహవసర సిలిండర్లను వినియోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

# కనిపించిన నెలవంక

## -నేడే రంజాన్ -ముస్తాబయిన ఈద్గా, మసీదులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పవిత్ర రంజాన్ మాసంలో నెలవంకను చూసి ముస్లీం సోదరులు కఠిన ఉపవాస దీక్షలను ప్రారంభిస్తే మళ్లీ నెలవంకను చూసి పండుగను జరుపుకుంటారు. శుక్రవారం నెలవంక కనిపించడంతో శనివారం పవిత్ర రంజాన్ పండుగను జరుపుకోనున్నారు. పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల కోసం పట్టణంలోని ఆర్పీజిటి రోడ్డులో ఉన్న అల్ హిలాల్ ఈద్గా మైదానంతో పాటు రహమత్ పురం, మేళాపురం, కోట, మోడల్ కాలనీ, పూలకుంట తదితర ప్రాంతాలతో పాటు వివిధ మసీదుల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరుపు కోవాడానికి ముస్తాబు చేశారు. ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరుపనున్నారు. గత కొన్ని రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పోస్టుల నేపథ్యంలో రంజాన్ సందర్భంగా పట్టణంలో ఎక్కడా ఏలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

**అన్ని సౌకర్యాలు కల్పిస్తాం :** పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ఈద్గా మైదానాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అన్నారు. ముందుగా పట్టణ ముస్లీం సోదరులకు పవిత్ర రంజాన్ శుభకాంక్షాలు తెలిపారు. పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లీం సోదరులు నిర్వహించుకునే ప్రార్థన స్థలాల్లో అన్ని సౌకర్యాలను కల్పించాలని ఇప్పటికే అధికారులను అదేశించామన్నారు.

# వాణిజ్య కార్యకలాపాల పెరుగుదల నేపథ్యంలో పన్నుల వసూళ్లు పక్కాగా జరగాలి..

- జీఎస్టీ బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
- ఆదాయాన్ని అందించే శాఖలు రాష్ట్ర జీఎస్టీ శాఖతో సమన్వయంతో పనిచేయాలి :అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి మార్చి 20 :- రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ అందించే శాఖలు రెవిన్యూ ఆదాయ లక్ష్యాలను అధిగమించాలని, వాణిజ్య కార్యకలాపాలు, వస్తువుల మరియు సేవల వినియోగంపై జివిస్టి వసూళ్లు పక్కాగా జరగాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలో రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని అందించే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు,రవాణా శాఖ, మైనింగ్, రిజిస్ట్రేషన్, అటవీ శాఖ, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖ లకు ఆదాయ వనరుల పెంపుపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ కలెక్టర్ కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రస్తుతం పంచాయతీ పరిధిలో వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో, గృహ పన్నుల కంటే వాణిజ్య సంస్థల నుంచి సరైన పన్నుల వసూళ్లు జరగడం అత్యంత అవసరమని సూచించారు. ముఖ్యంగా మున్సిపాలిటీ, పంచాయితీ పరిధి వెలుపల ఉన్న పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మరియు ఇతర వాణిజ్య సంస్థలపై దృష్టి సారించి,తగిన విధంగా ప్రోపోర్షనల్ టాక్స్ వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పన్ను వసూళ్లలో ఏవైనా లోపాలను ఉన్నట్లు గుర్తిస్తే వాటిని వెంటనే సరిచేసే చర్యలు చేపట్టాలన్నారు. జివిస్టి నంబర్ల ఆధారంగా వ్యాపార లావాదేవీలను పరిశీలించి, నాన్-జెన్యూన్ రిటర్న్ ఫైలర్స్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాలకు సంబంధించి ప్రత్యేక మానిటరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసుకొని రోజువారీ పురోగతిని సమీక్షించాలన్నారు. అన్ని శాఖల నుంచి ప్రతి వారం బిల్లుల ప్రాసెసింగ్‌కు సంబంధించిన సమాచారం సేకరించి, కమర్షియల్ టాక్స్ శాఖతో పంచుకోవాలని,సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి, సమాచార మార్పిడిని బలోపేతం చేయాలని ఏ శాఖ నుంచి సహకారం లోపించినా, వెంటనే మానిటరింగ్ విభాగానికి తెలియజేసి లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యాచరణ అంశాలపై అన్ని శాఖలు సమగ్ర నివేదికను సిద్ధం చేసి త్వరితగతిన సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో పన్నుల వసూళ్లలో పారదర్శకత, సమర్థతను పెంపొందించడంతో పాటు ఆదాయ వృద్ధి సాధించడం లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మైన్స్ తదితర ఆదాయ వనరుల శాఖలు తమ లావాదేవీలను క్రమబద్ధంగా నమోదు చేసి పన్ను చెల్లింపులను నిర్ధారించి ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. జీఎస్టీ వసూళ్ల పై పెండింగ్ లో బకాయిలు, కేసుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ శాఖలు, కాంట్రాక్టర్లు నుండి రావలసిన వసూళ్లకు సంబంధించిన వివరాలను వివిధ శాఖల అధికారులు జీఎస్టీ శాఖ అధికారులకు అందజేసి సమన్వయంతో కలిసి పనిచేసి జీఎస్టీ వసూళ్ల పై పెండింగ్ జీఎస్టీ బకాయాలను సమీక్షించుకొని వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ పై అవగాహన పెంచి ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటూ రెవెన్యూ ఆదాయ శాఖల్లో వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదాయం తెచ్చిపెట్టే వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, లక్ష్య సాధనలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా కట్టుదిట్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఎక్సైజ్ శాఖ , రవాణా శాఖ , జీఎస్టీ , డిపిఓ, బిఎస్డబ్ల్యుఓ,పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మైనింగ్, అటవీ శాఖ, మదనపల్లి, పుంగనూరు, బి.కొత్తకోట మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వివేక హత్య కేసు లేకుంటే బీటెక్ రవికి టిడిపిపార్టీలో మనుగడలేదు

- నీకు ఏ అర్హత ఉంది అని చర్చకు సిద్ధమా అంటున్నావు
- బిటెక్ రవి నీకు అవినాష్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదు
- వైకాపా నాయకులు



ప్రజాభూమి,పులివెందుల

వివేకా హత్య కేసు లేకుంటే టిడిపి పార్టీలో బీటెక్ రవికి మనుగడే లేదని , నీకు ఏ అర్హత ఉందని చర్చకు సిద్ధమా అంటున్నావుమని, బీటెక్ రవి నీకు అవినాష్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదని, మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నప ల్లె కిషోర్, స్టేట్ జాయింట్ సెక్రటరీ దేరంగుల చంద్ర మౌళి, మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్, లు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జగన్ క్యాంపు కార్యాలయం లో విలేకరులతో మాట్లాడుతూ బీటెక్ రవి నీ మనుగడ కాపాడుకునేందుకే సునీత వెనుకాలే తిరుగుతూ,అనవసర విషయాల్లో జోక్యం చేసుకుం టూ పబ్బం గడుపుతున్నావు అన్నారు.ఏ సెక్షన్ ఎవ్వరికీ పెట్టాలో ఎవ్వరికి ఏ శిక్ష వేయాలో చెప్పడానికి నువ్వు సునీతమ్మ మీరే జడ్జి లుగా వ్యవహరించితే ఇక సుప్రీమ్ కోర్ట్ లు ఎందుకు సీబీఐ ఎందుకు అని వారు ప్రశ్నించారు. నెలకు ఒకసారి పులివెందుల రావడం, వివేకా హత్య కేసు గురించి మాట్లాడటం మళ్ళీ అదృశ్యం అవ్వడం తప్ప ఈరెండేళ్లలో ప్రజలకు చేసింది శూన్యమే అన్నారు.ఏ అర్హత ఉందని ఎంపీ అవినాష్ రెడ్డిని చర్చకు సిద్ధం అని అడుగుతున్నావు అన్నారు. ఊర్లో పెళ్లికి ఎవరో హడావుడి అన్నట్లు నీ గోల ఏంటో ఎవ్వరికీ అర్థం అవ్వడం కాలేదన్నారు. ప్రపంచంలోనే ఇదొక వింత, చంపినోడికి ఒకడే లాయర్, సునీతమ్మ కి ఒక్కడే లాయర్, ఆదుకుం టున్న చంద్రబాబు కు ఒక్కడే లాయర్, ఇంత వింత గురించి మాట్లాడే నీకు అవార్డులు ఇవ్వాలి అన్నారు.సావిత్రిని కాదు నిన్ను పెట్టి మహానటి సినిమా తీసుంటే కచ్చితంగా ఆస్కార్ కంటే పెద్ద అవార్డు వచ్చుండేది అన్నారు.జిల్లాలో అవినాష్ రెడ్డి క్రేజ్ ముందు నీ కుప్పిగంతులు బలాదూర్ అన్నారు.ఎన్ని చారలు పెట్టుకున్న పిల్లి పులి అవ్వదు, వైయస్ అవినాష్ రెడ్డి కి నీవు సరితూగ వు అన్నారు.అవినాష్ రెడ్డి ఏ తప్పు చేయలేదు, ధర్మం ఉంది కాబట్టే అటు రాష్ట్రం లో ఇటు కేంద్రం లో కీలకంగా ఉన్న చంద్రబాబు, సిద్ధార్థ లూథ్ర, సీబీఐ అంతా ఏకమైన సుప్రీమ్ కోర్ట్ లో అన్ని పిటిషన్ లు వీగిపోయాయి, న్యాయం గెలిచింది, గెలుస్తుంది అన్నారు.నీచ రాజకీయాల కోసం నీ లాంటి వారంతా వైఎస్ కుటింబీకుల పంచన చేరి షర్మిల, సునీత, చంద్రబాబు, నువ్వు, ఆదినారాయ ణ రెడ్డి, వాసు అంతమంది కలిసి అవినాష్ రెడ్డి పై బురద చల్లినా, ఎంపీ గెలుపును అడ్డుకోలేక పోయారన్నారు. బురదజల్లే మాటలు మానుకొని పులివెందులను అభివృద్ధి కి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ఉగాది పండుగ ఉద్యోగాల పండుగ

## పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి



ప్రజాభూమి, పులివెందుల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నడూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో ఉద్యోగాల నియామ కాలు ప్రభుత్వం చేపట్టిందని పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కచ్చితంగా ప్రతి ఉగాదికి జాబ్ క్యాలెండర్ వదలుతామని ఇచ్చిన హామీని నెరవే ర్చడం జరిగిందన్నారు. పరిశ్రమల్లో కూడా ఉద్యోగా లు భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది అన్నా రు.పెట్టుబడులు పెట్టేవాళ్లను ప్రోత్సహిస్తున్నారు అన్నారు.గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక్క సచివాలయ ఉద్యోగులను తప్ప ఒక్కరికి ఒక్క ఉద్యోగం కల్పించలేదు అన్నారు. గ్రూప్ -1, గ్రూప్ -2 లలో పెద్ద ఎత్తున 10,060 ఖాళీలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బీటెక్ రవి నేడు ప్రపంచవ్యాప్తంగా జరిగే రంజాన్ పండుగను ముస్లిం సోదరులు సంతోషంగా జరుపుకోవాల ని,ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న అన్నారు.

# రంజాన్ మాసం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక

## - ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు

## - జనసేన పార్టీ నేత డా. దాసరి రవిశంకర్



ప్రజాభుమి, వేంపల్లె

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత డా. దాసరి రవిశంకర్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసం ఆధ్యాత్మిక చింతనకు, ఆత్మపరిశీలనకు, సహనానికి మరియు పరస్పర సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పవిత్ర నెలలో ఆచరించే ఉపవాసాలు మనుషుల్లో నియంత్రణ, నియమం, దయ, దాక్షిణ్య భావాలను పెంపొందిస్తాయని తెలిపారు. సమాజంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొనాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో రంజాన్ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ సమగ్ర అభివృద్ధికి మత సామరస్యమే ప్రధాన బలమని అభిప్రాయపడ్డారు. రంజాన్ మాసం సేవా భావం, పంచుకునే సంస్కృతి, మానవతా విలువలను గుర్తు చేస్తుందని పేర్కొంటూ, ఈ పవిత్ర సమయంలో అల్లాహ్ కృపాకటాక్షాలు సమస్త ప్రజలపై ఉండాలని, రాష్ట్రంలో శాంతి--సౌభ్రాతృత్వాలు మరింత బలపడాలని దాసరి రవిశంకర్ ఆకాంక్షించారు.

# రైతులకు సకాలంలో డ్రిప్ పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలి



ప్రజాభూమి,పులివెందుల

రైతన్నలకు సకాలంలో డ్రిప్ పరికరాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పులివెందుల నియోజకవర్గ రైతు విభాగపు అధ్యక్షుడు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డ్రిప్పు పరికరాలపై సబ్సిడీ ఇస్తున్నప్పటికీ కొన్ని డ్రిప్ కంపెనీలు రైతులకు డ్రిప్ పరికరాలు అందజేయడంలో విఫలమయ్యాయి అ న్నారు. గతంలో డ్రిప్ కంపెనీ లు నగదు చెల్లించిన పది రోజులకే రైతులకు డ్రిప్పు పరికరాలు అంద జేస్తూ వస్తున్నారని, ఇప్పుడు నెల దాటినా డ్రిప్ పరికరాలు అందించడం లేదని సకాలంలో పంటలు నాటుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. కావున అధికారులు చొరవ తీసుకొని డ్రిప్ పరికరాలు రైతులకు సకాలంలో అందేలా చూడాలని ఆయన అధికారులను కోరారు.

# "యువత ఆశలపై నీళ్లు చల్లిన జాబ్ క్యాలెండర్"



ప్రజా భూమి తొండూరు:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై అఖిల భారత అభ్యుదయ వేదిక కడప జిల్లా ఉపాధ్యక్షులు కుప్పం వాసుదేవాచారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఇదేనా జాబ్ క్యాలెండర్ అంటే?" అంటూ ఆయన ప్రశ్నించారు. భారీగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, తక్కువ పోస్టులతో యువత ఆశలను నెరవేర్చకుండా ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. వాసుదేవాచారి మాట్లాడుతూ, రాష్ట్రంలో వేల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగాల సంఖ్య మాత్రం చాలా స్వల్పంగా ఉందని అన్నారు. ఇది యువతకు ఉపశమనం కలిగించే చర్య కాదని, కేవలం ప్రకటనలకే పరిమితమైన చర్యగా మిగిలిపోతుందని విమర్శించారు. "జాబ్ క్యాలెండర్ అంటే నిరుద్యోగులకు దిశానిర్దేశం చేయాలి. కానీ ఈ క్యాలెండర్ యువతను మరింత అయోమయంలోకి నెట్టింది" అని అన్నారు.ఇక ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ గురించి ఎక్కడా ప్రస్తావన లేకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఆ అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టడం యువతను అవమానించడమే" అని మండిపడ్డారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచిన నిరుద్యోగ యువతకు ఇది పెద్ద ద్రోహమని పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు చదువు పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, వారికి సరైన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకంగా, సమగ్రంగా అన్ని ఖాళీలను ప్రకటించి, వేగంగా నియామకాలు చేపట్టాలి" అని ఆయన డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి, పూర్తి స్థాయి ఉద్యోగ నియామక ప్రణాళికను ప్రకటించాలని, నిరుద్యోగ భృతి అంశాన్ని కూడా అమలు చేయాలని అఖిల భారత అభ్యుదయ వేదిక డిమాండ్ చేసింది.

# అంధుల ఆశ్రమంలో అంధులకు అల్పాహారం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో నూర్జహాన్ ఎనిమిదో వర్ధంతి సందర్భం గా ఆమె కుమారుడు అజార్, మనవళ్లు అయాన్, అర్షద్ లు అల్పాహారాన్ని అంధులకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, మాజీ కౌన్సిలర్ ఖాదర్ భాషా, వెంకట చలపతి, జెండా మాను వీధి మున్నా, తుపాకుల గిరి, లు హాజరై నూర్జహాన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అజార్ ఏర్పాటుచేసిన అల్పాహారాన్ని అంధులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా అజార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్ధంతి సందర్భంగా ఏదో ఒక కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, భరత్ ,మమ్మద్, హరీష్ పాల్గొన్నారు.

# విస్తృతంగా వాహనాల తనిఖీ



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు తదితర ప్రాంతాలలో ఎస్సై మధుసూదన్ రెడ్డి సిబ్బందితో కలిసి విస్తృతంగా వాహనాల శుక్రవా రం తనిఖీ లు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనా లలో గంజాయి, అక్రమ మద్యం, ఇతర మత్తు పదా ర్థాలు సరఫరా కాకూడదని తనిఖీలు నిర్వహించారు. అనంతరం నంబర్లు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. పెండింగ్ లో ఉన్న జరిమానాలు చెల్లించాలని లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో పోలీసులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

## సిద్దవటం తహసీల్దార్ హెచ్చరిక



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని ప్రభుత్వ డీకేటీ భూములను అన్యాక్రాంతం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు హెచ్చరించారు. మొహిద్దీన్ సాహెబ్ పల్లి (శాఖరాజు పల్లి రెవెన్యూ) పరిధిలోని సర్వే నంబర్ 246లో సుమారు 1.50 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. శుక్రవారం ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆ భూమిని పరిశీలించారు. రికార్డుల ప్రకారం ఇది 'కొండ పరంబోకు' ప్రభుత్వ భూమి అని, ఇక్కడ ఎలాంటి చదును పనులు చేసినా, ఆక్రమణలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో హరికృష్ణ మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చుక్క నీరు లేక 'వెంకటేశ్వరాపురం' విలవిల..

## ఖాళీ బిందెలతో మహిళల నిరసన!



ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటేశ్వరాపురంలో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. గత పది రోజులుగా గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటితో పాటు కనీస అవసరాలకు కూడా నీరు లేక, పనులు మానుకుని పక్క గ్రామాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా "చూస్తాం.. చేస్తాం" అనే సమాధానాలే తప్ప, ఆచరణలో సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. నీళ్లు లేక పిల్లలు బడికి వెళ్లాలన్నా, తాము పనులకు వెళ్లాలన్నా నరకయాతన అనుభవిస్తున్నామని వారు వాపోతున్నారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో మీడియా ముందు నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల లగ్న పత్రిక లేఖనం





ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ భద్రావతి భావనారాయణ సమేత సీతారాముల దేవస్థానంలో పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి కల్యాణ మహోత్సవ లగ్న పత్రికను గురువారం శాస్త్రోక్తంగా రాశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు శెట్టి పుత్తా శ్రీనివాసులు, ధర్మకర్త మేరువ కుమార్ మాట్లాడుతూ.. పద్మశాలి బహోత్తమ సంఘం ఆద్వర్యంలో ఈ ఏడాది స్వామివారి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వైశాఖ శుక్ల దశమి ఏప్రిల్ 26, ఆదివారం నాడు స్వామివారి కల్యాణ మహోత్సవం, అన్నదానం నిర్వహిస్తారు. మరుసటి 27 సోమవారం నాడు మహానైవేద్యాలు, వసంతోత్సవం, తీర్థప్రసాద వినియోగం మరియు ఏకాంత సేవ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. ఈ వేడుకల్లో పద్మశాలీ కుల బాంధవులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సిద్ధవటంలో 'జన బాటా

## ఇంటింటికి తిరిగి విద్యుత్ సమస్యల పరిష్కారం



ప్రజాభూమి, సిద్ధవటం: విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా సిద్ధవటం మండలంలోని బెటాలియన్ సమీపంలో శుక్రవారం "జన బాట" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ జయచంద్ర మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన సేవలందించేందుకు ప్రతి ఇంటిని సందర్శిస్తూ క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు. వినియోగదారుల ఇబ్బందులను తొలగించడానికి నిరంతరం కృషి చేస్తామని, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది మరియు ఉద్యోగులు పాల్గొని స్థానికుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

# గండి ఆలయ అర్చకుడు రాజా రమేష్ స్వామికి ఉగాది పురస్కారం



ప్రజాభూమి, చక్రాయపేట

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కారాల సందర్భంగా గండిక్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన ఉప ప్రధాన అర్చకుడు రాజా రమేష్ స్వామికి ఉగాది పురస్కారం లభించింది. ఈ సందర్భంగా గండిక్షేత్రంలో రాజా రమేష్ స్వామిని శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. అనంతరం దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టేం గురుప్రసాద్, గండి ఆలయ మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి లు మాట్లాడుతూ రాజా రమేష్ స్వామి ఆలయ అభివృద్ధికి, భక్తులకు అందిస్తున్న సేవలు విశేషమని కొనియాడారు. అంకితభావంతో ఆలయ సేవలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని, ఇటువంటి పురస్కారాలు మరింత సేవా తపనకు దోహదం చేస్తాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొని రాజా రమేష్ స్వామికి అభినందనలు తెలిపారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శనివారం 21 మార్చి 2025


## చంద్రగిరి పట్టణం నూకలగుంట లో శ్రీ గురప్ప స్వామి దేవాలయ భూమి పూజ కార్యక్రమం.....

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి.





కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నాని కి పూర్ణకుంభ స్వాగతం పలికిన ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు. ప్రత్యేక పూజలో పాల్గొని పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పులివర్తి నాని. ఉగ్రాణం, కాపు వీధి, కామాటం, ఆరంభాకం, పట్రం కుటుంబ సభ్యులు ప్రజలు మాట్లాడుతూ ఇప్పుడు రెడ్డివిధిలోని ఇండ్ల మధ్యన శ్రీ గురప్ప స్వామి ఆలయం ఉండడంతో పూజలు నిర్వహించుకోడానికి ఇబ్బందిగా ఉందని గతంలో ఎమ్మెల్యే .కి విన్నవించుకున్నారు. గత రెండు వారాల క్రితం గురప్ప స్వామి వారి ఆలయంకు స్థలం మంజూరు చేయాలని ఎమ్మెల్యేని కోరిన గ్రామస్తులు. వారి విజ్ఞప్తిని స్వీకరించిన ఎమ్మెల్యే . తక్షణమే ఆలయానికి స్థలం మంజూరు చేశారు. అడిగిన వెంటనే స్థలం మంజూరు చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని కి ఘనంగా సన్మానించి... ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు మహిళలు , కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సభలను జయప్రదం చేయండి

ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్



ఈ నెల 22వ తేదీన తిరుపతి వేదికగా జరిగే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ప్రప్రథమ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ ఫెడరేషన్ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, పెరిమిడిరఘు పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద గురువారం ఫెడరేషన్ మహాసభల కరపత్రాలు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్ హాజరయ్యారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఫెడరేషన్ ముందు వరుసలో ఉంటుందని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. పాలక ప్రభుత్వాలు నిజమైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయని వాపోయారు. పలు రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులకు ప్రభుత్వాలు పెన్షన్ సాయమందిస్తున్నా, ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ఆ ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే పాస్ లను పునరుద్ధరించాలనీ, అక్రిడిటేషన్ల మంజూరులో నిబంధనలను సడలించాలనీ, చిన్న పత్రికలకూ ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు మీడియా కమిషన్ ను ఏర్పాటు చేసి గవర్నింగ్ బాడీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

## ప్రజలకు వంట గ్యాస్ అందుబాటులో ఉంచండి -సిపిఎం

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.




సత్యవేడు నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో వంట గ్యాస్ అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ తెలిపారు. ప్రభుత్వ గ్యాస్ కొరత లేదని ప్రకటిస్తున్నప్పటికీ ప్రజలకు గ్యాస్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు నాగలాపురం సత్యవేడు కేవీబీపురం వరదయ్యపాలెం పిచ్చాటూరు నారాయణ మనం ఇలాంటి మండలాల్లో పత్రికలో వస్తున్న వార్తలను బట్టి తెలుస్తుందని జనార్ధన్ తెలిపారు. జిల్లా అధికారులు గ్యాస్ ఏజెన్సీ లతో మాట్లాడి వంట గ్యాస్ ఇబ్బంది లేకుండా సకాలంలో సరఫరా చేసే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్యాస్ ధరలను సిలిండర్ పై60 రూపాయలు పెంచిన ప్రభుత్వం ప్రజలకు సరఫరా చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. అధికారులు స్పందించకపోతే గ్యాస్ గోడౌన్ వద్ద ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని తెలిపారు.

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

### -- పేద కుటుంబానికి అండగా నిలిచిన ప్రసాద్

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం





రామచంద్రపురం మండలంకుప్పం బాదూరు పంచాయతీ పరిధిలోని వడ్డీ కాల్వ గ్రామానికి చెందిన బి. వినోద్ కుమార్ మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఈ కుటుంబానికి దహన క్రియలు నిర్వహించేందుకు కూడా నిధులు లేకపోవడం తెలిసిన వెంటనే పచ్చికాపలం శ్రీ లక్ష్మీ గ్రూప్స్ అధినేత ప్రసాద్ మానవత్వంతో స్పందించారు. తాను వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయినా, వెంటనే తన ప్రతినిధులను పంపించి రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. “ఇది సరిపోతుందా? ఇంకా ఏమైనా అవసరమైతే చెప్పండి, తప్పకుండా సహాయం చేస్తాను” అంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ ఆర్థిక సహాయం అందించడంలో చంద్రగిరి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ ఎస్. సెంథిల్ కుమార్ కీలక పాత్ర పోషించారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించి సహాయాన్ని సమన్వయం చేశారు. సమాచారం అందుకున్న క్షణంలోనే ఎలాంటి ఆలస్యం చేయకుండా సహాయం చేయడం పట్ల గ్రామస్తులు ప్రసాద్‌ను అభినందించారు. కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వడం నిజమైన మానవత్వమని, ప్రసాద్ వంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుప్పం బాదూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎ. విజయ్ కుమార్, కే. రామకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు కాల్వ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనలో అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్ ఎన్.మౌర్య.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి, తిరుమలలో రెండు రోజుల పర్యటన నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు.శుక్రవారం పర్యటన మార్గాల్లో పారిశుద్ధ్యం, రోడ్ల పరిస్థితులను పరిశీలించిన కమిషనర్, రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని, డివైడర్లలో మొక్కలు కత్తిరించాలని, చెత్తను తొలగించాలని సూచించారు. అలిపిరి, జూ పార్కు ప్రాంతాల్లో అనధికార దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పర్యటన విజయవంతం చేయాలని కమిషనర్ తెలిపారు.

# ఇది జాబ్ క్యాలెండర్ కాదు- నిరుద్యోగుల దగా క్యాలెండర్

### -రాష్ట్ర వైకాపా విద్యార్థి విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి





ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలండర్ పై మీడియా సమావేశంలో మండి పడ్డ రాష్ట్ర వైఎస్ఆర్ సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి.ఇది జాబ్ క్యాలండర్ కాదు.. నిరుద్యోగుల దగా క్యాలెండర్ అంటూ ఘాటు వ్యాఖ్యలు.అధికారంలోకి రాకముందు వేలాది ఉద్యోగాలు ఖాళీ వున్నా భర్తీ చేయలేదని యువగళం పాదయాత్రలో ఆరోపించిన నారా లోకేష్ విద్యాశాఖా మంత్రిగా ప్రమాణం చేసి రెండేళ్లు గడిచింది. ఆ ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయాలేదు.. .అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలు ఊడబెరికి.. కొత్తగా జాబ్ క్యాలండర్ ఇస్తున్నట్లు నాటకాలు ఆడుతున్నారు. జగనన్న ప్రభుత్వంలో 2024 మార్చి నాటికి ఏపీలో ఉద్యోగుల సంఖ్య 11.79 లక్షలు వుంటే.. కూటమి ప్రభుత్వం వచ్చాక 2025 డిసెంబరు నాటికి ఉద్యోగుల సంఖ్య 10.07 లక్షలు మాత్రమే వున్నారు. అంటే 22 నెలల్లో 1.72 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఆ తగ్గిన ఉద్యోగాలను ఎప్పటికప్పుడు ఎందుకు భర్తీ చేయాలేదు. జాబ్ క్యాలండర్ లో ఆ ఉద్యోగాలను ఎందుకు చూపలేదు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.. అందుకోసం ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామన్నారు.. రెండేళ్లు గడచిన తరువాత 10,060 పోస్టులకు మొక్కుబడిగా జాబ్ క్యాలండర్ ఇచ్చారు. ఇది మోసం కాదా ?. ఇకపోతే నిరుద్యోగ భృతి ప్రతి నెల రూ.3000లు చెల్లిస్తామన్నారు. రెండేళ్లు గడచిపోయింది. ఇప్పటికీ అమలు కావడం లేదు. ఆ లెక్కన గడచిన రెండేళ్లు నిరుద్యోగ యువతకు చెల్లించ్చాలిన మొత్తం 21,600కోట్లు ఎగనామం పెట్టారు. వాలంటీర్లకు పది వేలు గౌరవ వేతనం ఇస్తామని నమ్మబలికి ఏకంగా ఆ వ్యవస్థను రద్దు చేసి వారి కడుపుకొట్టారు. వాలంటీర్ల పొట్టగొట్టి ఏడాదికి రూ.1500కోట్లు మిగుల్చుకుంటున్నారు. దీనిని ఏమంటారు మోసం చేయడం కాదంటారా..?. 2025 ఆగస్టు 31 నాటికి హోం వాఖలో 11639 పోస్టులు వివిధ కేడర్‌లో ఖాళీలు ఉన్నట్టు డీజీపీ కార్యాలయం హోంశాఖ ముఖ్య కార్యదర్శికి వివరాలు పంపించింది నిజం కాదా..? నిర్ణీత సమయం లోపు ఆ పోస్టులు భర్తీ చేయాలని హైకోర్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన మాట వాస్తవం కాదా ? మరి ఆ పోస్టులను నిన్న విడుదల చేసిన జాబ్ క్యాలండర్ లో ఎందుకు కనబరచలేదు.. తాజాగా మీరు చూపిన జాబ్ క్యాలండర్‌లో హోంశాఖ నుంచి 2778 పోస్టులు మాత్రమే చూపడానికి అర్థం ఏమిటి ? మిగతా పోస్టులన్నీ ఎవరి కోసం దాచిపెట్టారు. ఎందుకోసం బయట పెట్టడం లేదు .గతంలో పాఠశాల విద్యా శాఖలో 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయని ప్రచారం చేసిన ఇప్పటి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పాఠశాల విద్య, ఇంటర్ విద్యలో కేవలం 3004 పోస్టులు ప్రకటించడం ఏమిటో అర్థం కావడం లేదు. అంటే ఆ పోస్టు లేకుండాలి.. లేదా అధికారంలోకి రావడానికి అబద్ధం చెప్పియుండాలి. ఇలా ప్రభుత్వ రంగ సంస్థల్లో వున్న ఖాళీ ఉద్యోగాలను దాచిపెట్టి కంటి తుడుపు చర్యగా 10060 పోస్టులతో జాబ్ క్యాలండర్ విడుదల చేసి చంకలు గుద్దుకుంటున్నారంటే ఈ ప్రభుత్వాన్ని ఏమనాలి. జాబులు దాచిపెట్టి జాబ్ క్యాలండర్ వదలడం ఒక్క నారా లోకేష్ కు మాత్రమే తెలిసనట్టుంది. చివరగా ఒక్కమాట చెప్ప దలచుకున్నా.. నిశ్పక్షపాతంగా జాబ్ క్యాలండర్ విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలి. మీరు ఇస్తామన్న నిరుధ్యోగ భృతిని తక్షణం అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాం.

# సత్యవేడులో ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్ద నోస్టాక్ బోర్డు

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.





కార్యాలయం మూసివేయడంతో వినియోగదారుల ఇబ్బందులు. తిరుపతి జిల్లా సత్యవేడులో ఇండియన్ గ్యాస్ కొరత నెలకొంటుంది.అమెరికా అండదండతో ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో గ్యాస్ నిల్వలుపై ప్రభావం పడుతోంది.దీని ప్రభావం సత్యవేడును నువ్వు తాకింది.ఇండియన్ గ్యాస్ స్టాక్ లేకపోవడంతో తాజాగా శుక్రవారం ఇండియన్ గ్యాస్ గోడౌన్ మెయిన్ గేట్ సిబ్బంది నోస్టాక్ బోర్డు పెట్టి కార్యాలయాన్ని మూసివేశారు. ఈ నేపథ్యంలో గ్యాస్ వినియోగదారులు పలువురు ఇండియన్ గ్యాస్ కోసం ఖాళీ సిలిండర్లతో ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్దకు చేరుకున్న వినియోదారులకు నోస్టాక్ బోర్డు కనిపించడంతో ఆందోళన చెందుతున్నారు.పైగాగ్యాస్ పై ఆధారపడి వంట చేసే పరిస్థితులు నేడు అధికమయ్యాయి.గతంలో లాగా ఎక్కడా కూడా ప్రస్తుతం వంట చెరుకుతో వంట చేసే పరిస్థితి లేదు. దీంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా ప్రతి ఇంటికి గ్యాస్ కనెక్షన్ ఇచ్చేసింది.పైగా గ్యాస్ కనెక్షన్ లేని ఇల్లు ఎక్కడ కూడా కనిపించని పరిస్థితి.ఈ క్రమంలో వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇండియన్ గ్యాస్ అందించాల్సి ఉంది.ఒకపక్క రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు కొరత లేదంటూ స్వయానా రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పత్రికా ప్రకటనలు జారీ చేస్తున్న ఆచరణలో మాత్రం ఇందుకు భిన్నంగా కనిపించడం పట్ల వినియోగదారుల్లో ఆందోళన నెలకొంటుంది. పైగా ఇక్కడ ఇండియన్ గ్యాస్ సిలిండర్ల నిల్వలు,పంపిణీ, వంటి విషయాలపై స్థానిక ఇండియన్ గ్యాస్ మేనేజర్ పర్యవేక్షణ లోపించడంతో ఇటువంటి పరిస్థితులు తలెత్తడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.ఇండియన్ గ్యాస్ నోస్టాకు బోర్డు పెట్టడంపై సంబంధిత ఇండియన్ గ్యాస్ మేనేజర్ అనూషను వివరణ కోసం మొబైల్ ద్వారా సంప్రదించిన అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా దీనిపై జిల్లా పౌర సరఫరాల అధికారి స్పందించి సత్యవేడులో ఇండియన్ గ్యాస్ కొరత లేకుండా చూడడంతో పాటు సకాలంలో వంటగ్యాస్ సిలిండర్లు అందేలా చూడాలని ఇండియన్ గ్యాస్ వినియోగదారులు పలువురు కోరుతున్నారు.

## ఏప్రిల్ 11 నుంచి కెవీపిఎస్ ‘ప్రతిఘటన’

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్







ఏప్రిల్ 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కుల విపక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఊరూరా ప్రతిఘటనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా నాగరాజు హాజరయ్యారు. స్వాతంత్రం సిద్ధించి 80 ఏళ్ళు కావస్తున్నా సమాజంలో కుల వివక్ష, అంటరానితనం సమసిపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ దళితులకు ఆలయ ప్రవేశం లేదనీ, రెండు గ్లాసుల విధానం కొనసాగుతోందని విచారం వ్యక్తం చేశారు. దళిత, గిరిజనులు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారనీ, సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల వృత్తి ఆధారంగా జీవనోపాధి పొందుతున్న డప్పు కళాకారులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. వారికి 50 ఏళ్లకే పెన్షన్, భూమిపంచాలని డిమాండ్ చేశారు.కుల వివక్షను అంతమొందించేందుకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో21 నుంచి 30 వరకు క్షేత్ర సాయి పర్యటన, ఏప్రిల్ 5 వరకు సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన, 6న కలెక్టర్ ముట్టడిని చేపడుతున్నట్లు తెలిపారు. పూలే, అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని 11వ తేదీ నుంచి, 14 తేదీ వరకు ప్రతిఘటనా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, అధ్యక్షులు ఎన్డీ శ్రీను, అధ్యక్షులు అంగేరి పుల్లయ్య, రెడ్డిపల్లి సురేష్, అరుణాచలం, డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య, పెంచలయ్య, మధుసూదన్ రావు, ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బుధవారం రాత్రి అకాల వర్షం పడి వరి పంటలు తీవ్ర నష్టం వాటిల్లిందన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి.





పంట నష్టపోయిన పొలాలను మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలతో స్వయంగా వెళ్లి పరిశీలించి.. రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే పులివర్తి నాని . రైతులు అధైర్య పడొద్దు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ... పంటనష్టం వచ్చే విధంగా చర్యలు చేపడదామని తెలిపిన ఎమ్మెల్యే . బుధవారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన వర్షం పడడంతో బందార్లపల్లి, రంగంపేట, కొటాల, పుల్లయ్యగారి పల్లి గ్రామాలలో సుమారు 70 నుంచి 80 ఎకరాలకు పైగా వరి , ఇతర పంటలు నష్టం వాటిల్లింది. పంట నష్టం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే .సంబంధిత అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రతి రైతుకు పంట నష్టం అందేలాగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే .తెలిపారు. పంట నష్టం వివరాలు రైతుల నుండి సేకరించి ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయ శాఖ అధికారులను ఎమ్మెల్యే . ఆదేశించారు. అనంతరం గ్రామ ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు ,కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉచిత వ్యాక్సిన్- వెంకటగిరిలో ప్రారంభించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ప్రజా భూమి ప్రతినిధి వెంకటగిరి.



రాష్ట్రములో ఆడపిల్లల భవిష్యత్తును మరియు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు . ఆదేశాల మేరకు, వెంకటగిరి నియోజకవర్గంలో 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా ‘హ్యూమన్ పాపిలోమావైరస్’ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో వెంకటగిరి శాసనసభ్యులు .కురుగొండ్ల రామకృష్ణ . లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ . మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ. 4,000 నుండి రూ. 5,000 వరకు ఖర్చయ్యే ఈ ఖరీదైన వ్యాక్సిన్‌ను, పేద ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడిం చారు.



వెంకటగిరి నియోజకవర్గంలోని బాలయపల్లి, డక్కిలి, వేంకటగిరి రూరల్ మండలాలు మరియు వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో సుమారు 3,500 మంది 14 ఏళ్ల బాలికలకు ఈ వ్యాక్సిన్ అందించడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం 200 వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే మిగతా వారికి కూడా విడతల వారీగా వ్యాక్సిన్ వేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు మాట్లాడుతూ.. ఈ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్‌ను 90-95% వరకు నివారిస్తుందని తెలిపారు. ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల భవిష్యత్తులో పిల్లలు పుట్టరనే అపోహల్లో ఎలాంటి నిజం లేదని, ఇది పూర్తిగా సురక్షితమని, శాస్త్రీయంగా నిరూపించబడినదని డాక్టర్లు స్పష్టం చేశారు. 14 ఏళ్లు నిండిన ఆడపిల్లల తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా తమ పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇప్పించి, వారిని ప్రాణాంతక క్యాన్సర్ బారి నుండి రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ఏఎంసీ చైర్మన్, ఏఎంసీ మాజీ చైర్మన్, పట్టణ అధ్యక్షులు, మాజీ పట్టణ అధ్యక్షులు, జనసేన అధ్యక్షులు, హాస్పిటల్ అభివృద్ధి సభ్యులు, నర్సింగ్ సిబ్బంది, మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## “స్విమ్స్ కార్మికుల సమస్యలపై యాజమాన్యం మూగనాటకం...”

### “22 రోజులుగా రిలే నిరాహార దీక్షలు -- ఉధృతమవుతున్న కార్మికుల తిరుగుబాటు”



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి స్విమ్స్‌లో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 22వ రోజుకు చేరుకున్నాయి. సమస్యలను పలుమార్లు తెలియజేసినా యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మికులు నిరసన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో మాట్లాడిన సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంతకాలంగా దీక్షలు కొనసాగుతున్నా స్పందన లేకపోవడం సరైంది కాదన్నారు.కార్మికులు ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కార్మిక శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా లేబర్ అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. చర్చల పేరుతో వాయిదాలు వేయడం వల్ల సమస్యలు మరింత ఆలస్యం అవుతున్నాయని చెప్పారు.సుమారు 800 మంది కార్మిక కుటుంబాలు ఈ సమస్యల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. ఎల్ సిఐటీయూ పిలుపు మేరకు రేపు జిల్లాలోని 36 మండలాలలో స్విమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా తిరుమలకు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటీయూ నాయకులు కే. వేణుగోపాల్ మాట్లాడుతూ, యాజమాన్యం కాలయాపన చేసినా కార్మికుల పోరాటం ఆగదన్నారు. సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూరి, మారి ముత్తు, కోటయ్య, రాజా, బాలకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వీకులకాలం నుండి వస్తున్న జీవనాధారని కాపాడండి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.




అంగడి భూమిపై వివాదం,బెదిరింపుల ఆరోపణలు అంటూ బాధితుడి ఆవేదన... రైతు నాయకుల హెచ్చరిక. పూర్వీకుల కాలం నుంచి కొనసాగుతున్న అంగడిని బలవంతంగా తొలగించేందుకు బెదిరింపులకు, పాల్పడుతున్నారని బాధితుడు కుమారస్వామి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ తాము 1980ల నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలో చిన్న టీ షాప్ అంగడి నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ అంగడి తమ కుటుంబానికి ఏకైక జీవనాధారమని పేర్కొన్నారు. అయితే సమీప భూమిని 2010లో కొనుగోలు చేసిన ఒక ప్రముఖ వైద్యుడి భర్త తమ అంగడిని ఆక్రమించుకోవాలనే ఉద్దేశంతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మా సర్వే నంబర్,వారి సర్వే నంబర్ వేరే అయినప్పటికీ ఇది నాదే అంటూ పోలీసులు, ఇతర వ్యక్తులను తీసుకొచ్చి ఖాళీ చేయించాలని ఒత్తిడి చేస్తున్నారు. మాకు న్యాయం చేయాలి అంటూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. అధికారుల ద్వారా, కోర్టు ద్వారా సర్వే నిర్వహించి నిజానిజాలు బయటపెట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గతంలోనే తమ అంగడికి సంబంధించిన విద్యుత్ బిల్లులు, ఆధారాలు ఉన్నప్పటికీ తప్పుడు రికార్డులతో కోర్టులో కేసులు వేస్తున్నారని ఆరోపించారు. మా అంగడి లేకపోతే మాకు జీవనం లేదు. మమ్మల్ని రోడ్డున పడేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు, వామపక్ష నేతలు మాట్లాడుతూ పేదల జీవనాధారాలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న కుటుంబాన్ని బలవంతంగా వెళ్లగొట్టే ప్రయత్నాలు, చేస్తే సహించబోమని, హెచ్చరించారు. డబ్బున్నవారు పేదల అంగడులను, భూములను ఆక్రమించుకోవడం సమంజసం కాదని తెలిపారు. సర్వే నంబర్లు స్పష్టంగా వేరైనా తప్పుడు పత్రాలతో ఒత్తిడి చేయడం దుర్మార్గం అని విమర్శించారు. మండల రెవెన్యూ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సంబంధిత భూమిపై సర్వే నిర్వహించాలని, నిజానిజాలు వెలికి తీయాలని డిమాండ్ చేశారు. కోర్టు వ్యవహారం పేరుతో సర్వే చేయకపోవడం వల్ల సమస్య మరింత క్లిష్టంగా మారుతోందని పేర్కొన్నారు. పోలీసులు కూడా పక్షపాతం లేకుండా వ్యవహరించి పేదలకు రక్షణ కల్పించాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ముని రామయ్య, కుమారస్వామి, సిపిఎం రైతుసంఘం,జిల్లా కార్యదర్శి హేమలత, సుబ్బా రత్నమ్మ,రైతు సంఘం నాయకులు వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# రూ. 3 కోట్లతో గుండోడు కణంకు తారు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం

- శరవేగంగా సాగుతున్న గుండోడు కణం బిటి రోడ్డు నిర్మాణ పనులు.
- గుండోడు కణం రోడ్డు హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే పులివర్తి నానికి





ప్రజా భూమీ ప్రతినిధి,రామచంద్రాపురం

రామచంద్రపురంమండలంలోని తాటి తోపు కండ్రిగ-నెన్నూరు గ్రామ పంచాయతీలకు అటవీ ప్రాంతం మధ్యలో ఉన్న గుండోడు కణం రహదారిని రూ. 3 కోట్ల రూపాయలతో నిర్మించి, తారు రోడ్డు పనులను ప్రారంభించారు. స్వాతంత్ర్యం రాకముందు రహదారి సౌకర్యాలు లేక ప్రజలు గుండోడు కణం కాలినడక దారిలో రాకపోకలు సాగించేవారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లేందుకు తమిళనాడు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే శ్రీవారి భక్తులు పూర్వం గుండోడు కణం కాలినడక మార్గంలోనే నడిచి వెళ్లేవారు. తర్వాత శ్రీకృష్ణదేవరాయలు రాయల చెరువు నిర్మాణం చేపట్టిన తర్వాత రాయల చెరువు మార్గంలో తిరుపతికి రహదారిని ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో రాయలచెరువు వరద నీటితో నిండిపోతే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. దీంతో తాటిమాకుల కండ్రిగ, కుప్పం బాదూరు, మిట్ట కండ్రిగ గ్రామస్తులు 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకటమణి ప్రసాద్ ( నాని) ని గుండోడు కణం రోడ్డు నిర్మాణం చేయించాలని కోరగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుండోడు కణం రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల రూపాయల నరేగా నిధులు మంజూరు చేయించారు. 2025 జనవరిలో గుండోడు కణం నూతన రోడ్డు పనులకు ఎమ్మెల్యే పులివర్తి నాని భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ రోడ్డు పనులను గుత్తేదారులు లెక్కల దినేష్ చౌదరి, కోరా హరిప్రసాదులు శరవేగంగా కంకర్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. గుండోడు కణం రోడ్డుకు తారు రోడ్డు నిర్మాణ పనులను గురువారం చురుకుగా సాగిస్తున్నారు. ఈ గుండోడు కణం రోడ్డు నిర్మాణం వల్ల చిత్తూరు జిల్లా నుండి వచ్చే ప్రయాణికులకు, వాహన చోదకులకు గుండోడు కణం రోడ్డు మీదుగా తిరుపతికి వెళ్లేందుకు సుమారు 10 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఈ సందర్భంగా గుత్తేదారు కోరా హరి ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజులలో తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం..... గుండోడు కణం నూతన రహదారిలో వాహనాల రాకపోకలు కొనసాగుతాయి అన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవ తీసుకొని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గుండోడు కణం రోడ్డు నిర్మాణం చేపట్టినందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సుమారు ఏడాది కాలం పట్టినప్పటికీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలతో కూడిన రహదారి నిర్మాణం పూర్తవుతున్నందుకు తాటి తోపు కండ్రిగ, నెన్నూరు, కుప్పం బాదూరు, పరమాల, మిట్ట కండ్రిగ, రాయల చెరువు పేట గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి - ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

ముఖ్యమంత్రి చంద్రబాబ నాయుడు . నాయకత్వంలో ఐటి విద్య మంత్రివర్యులు నారా లోకేష్ . సారధ్యంలో నిన్నటి దినం యువతకు ఇచ్చిన ఉగాది కానుక జాబ్ క్యాలెండరు . ఇది ఒక చారిత్రాత్మకమైనటువంటి కార్యక్రమం అని గురువారెడ్డి అన్నారు. జగన్మోహన్ రెడ్డి.

తన 5 ఏళ్ళ పాలనలో ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అని నమ్మబలికి యువతను దగా చేసారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిన్న ఉగాది కానుక గా ఉద్యోగాల భర్తీ కి జాబ్ క్యాలెండరు ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .విడుదల చేసారు .

మొత్తం 10,060 ఉద్యోగాల భర్తీ కి నోటిఫికేషన్ తేదీలతో సహా ఏ శాఖలలో ఎనెన్ని పోస్టులు వివరాలతో కూడిన జాబ్ క్యాలెండరు ను విడుదల చేసారు .

జాబ్ క్యాలెండర్ లోని వివరాలు :

1) ఉన్నత విద్య -1500 పోస్టులు : నోటిఫికేషన్ తేది .మే 15,2026.

2) గ్రూప్ 1: 91 పోస్టులు . హోమ్ శాఖ :2778 పోస్టులు , ఇతర శాఖలు : 928 పోస్టులు . నోటిఫికేషన్ తేది : ఆగష్టు 15, 2026.

3) గ్రూప్ 11: 750 పోస్టులు , ఇంజినీరింగ్ : 503, ఇతర శాఖలు : 506. నోటిఫికేషన్ తేది : సెప్టెంబర్ 15,2026.

4) పాఠశాల / ఇంటర్ విద్య : 3004 పోస్టులు , నోటిఫికేషన్ తేది : అక్టోబర్ 15, 2026.

పై మొత్తం పోస్టులు : 10,060.

లి ?నిన్న విడుదల చేసి జాబ్ క్యాలెండరు కేవలం ప్రకటన మాత్రమే కాదు .

నిరుద్యోగులకు ఇచ్చిన భరోసా కూడా జాబ్ క్యాలెండర్. జాబ్ క్యాలెండర్లో అసోసియేట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా 1500 సబ్ ఇన్స్పెక్టర్గా 418 కానిస్టేబుల్ గా 1970 జైలు వార్డన్లగా 171 ఫైర్ ఇంజన్ డ్రైవర్లగా 147 బీసీ హాస్టల్ వార్డెన్ లాగా 100 ప్లానింగ్ ఆఫీసర్లు స్టాటికల్ ఆఫీసర్లగా 251 అసిస్టెంట్ ఇంజనీర్లుగా 503 గ్రూప్ వన్ అధికారులు 91 గ్రూప్ 2 అధికారులుగా750 ఎక్సైజ్ కానిస్టేబుల్ 400 డీఎస్సీ ద్వారా టీచర్లు 2535 జూనియర్ లెక్చరర్ గా 209 గ్రంథాలయ లైబ్రరీలుగా 100 ప్రకటించినటువంటి కూటమీ ప్రభుత్వం ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు . నాయకత్వంలో విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ .సారధ్యంలో అని ప్రజలందరికీ తెలియపరుస్తూ యువత నిరుద్యోగుల తరఫున వర్షం వ్యక్తం చేస్తున్నామని గురవారెడ్డి అన్నారు. ఆనాడు ప్రతిపక్షంలో భవిష్యత్ గ్యారెంటీ బాబు షూరిటీ అనే కార్యక్రమం ద్వారా. సూపర్ సిక్స్ పథకాలను హామీ ఇవ్వడం జరిగింది దానికి నిదర్శనంగానే యోగాలను స్ఫూర్తిదాత నారా లోకేష్ బాబు .యోగలం సందర్భంగా 20 లక్షల ఉద్యోగాలు అనే హామీని ప్రజలకు ఇవ్వడం అదిశగా లక్ష్యం నిర్దేశించుకొని పని చేస్తున్న కూటమి ప్రభుత్వం అని అన్నారు.




- గత 20 నెలలో 6,28,247 ఉద్యోగాలు కల్పించడం జరిగింది .
- అందులో 30, 607 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడమైనది .
- -ఎంఎస్ఎంలఈ ల నుంచి ఉపాధి : 2,48,906 మంది ,
- -జాబ్ పెయిర్ , స్కిల్ డెవలప్మెంట్ ద్వారా : 1,46,627 మంది ,
- -పరిశ్రమల రంగం : 95,174 మంది ,
- -పుడ్ ప్రాసెసింగ్ : 64,035 మంది ,
- -ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ : 13,866 మంది ,
- -పర్యాటక రంగం ; 5,028 మంది .
- -పై విధంగా 20 నెలలోనే 6,28,347 ఉద్యోగాలను యువత కు అందించడం జరిగింది.
- జగన్మోహన్ రెడ్డి భవిష్యత్ ను నాశనం చేసారు
- జగన్ పాలనలో విడుదల చేసిన ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఉపాధి లేక 4,100 మంది నిరుద్యోగులు ఆత్మ హత్యలకు పాల్పడ్డారు.
- -నిన్న జాబ్ క్యాలెండరు విడుదల చేయడంతో యువత హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞత గా ముఖ్యమంత్రి చంద్రబాబు .లోకేష్ చిత్ర పటాలకు పాలాభి షేఖాలు నిర్వహిస్తున్నారు .
- -అయితే వైకాపా మాత్రం తన సాక్షి తదితర మీడియా లో దుష్ప్రచారం మొదలు పెట్టారు .

ఒక జవాబు దారి ప్రభుత్వం పని చేసే నాయకత్వం నారా చంద్రబాబు నాయుడు ది. అటు అభివృద్ధి సంక్షేమాన్ని సమపాళ్లలో ప్రజలకు అందిస్తూ ఆరోజు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేస్తూ ముందుకు పోతున్నటువంటి నీతివంతమైన పాలన అందించేటటువంటి నాయకుడు నారా చంద్రబాబునాయుడు . నారా లోకేష్ .అని గురువారెడ్డి అన్నారు ఈరోజు యువత నిరుద్యోగుల తరఫున హర్షం వ్యక్తం చేస్తూ గ్రంథాలయాల చరిత్రలో ఇంతవరకు ఉద్యోగాల్ని చాలా కాలం నుంచి భర్తీ చేయకపోవడం ఈరోజు 100 లైబ్రరీ పోస్టులను జాబ్ క్యాలెండర్లో పెట్టి గ్రంథాలయాలను బలోపతం చేస్తున్నటువంటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు .కి విద్య ఐటీ మంత్రివర్యులు నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామని గురవారెడ్డి అన్నారు.

# క్యారేజ్ రిపేర్ షాప్ లో క్యాజువాల్టీ హెల్త్,వార్డు ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.



క్యారేజ్ రిపేర్ షాప్ తిరుపతి. సి. ఆర్. యస్ సబ్ డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో కొత్తగా పునరుద్ధరించిన క్యాజువాల్టీ వార్డును గౌరవనీయులు (సి,డబ్ల్యూ,ఎం) ఎస్. శ్రీనివాస్( సి ఎం ఎస్ గుంతకల్, ) వేణుగోపాల్ రెడ్డి సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమజాభాయి , సీనియర్ (డి ,ఎం ,ఓ ,) ఇతర వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు. ఈ సందర్భంగా (ఎస్, సి ఆర్ ,ఎం యు) చైర్మన్ కే. సదాశివరెడ్డి (సి, ఎం, ఎస్,) వేణుగోపాల్ రెడ్డి కి



మెమొరాండం సమర్పించి ముఖ్యమైన ఆసుపత్రి సమస్యలపై చర్చించారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని కేటగిరీల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని, మెరుగైన నిర్ధారణ సేవల కోసం శాశ్వత రేడియోగ్రాఫర్‌ను నియమించాలని కోరారు. రెఫెరల్ హాస్పిటల్స్ తిరుపతి నందు హీ లియోస్,మరియు అమర, ఇతర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను గుర్తింపు పొందిన రెఫరల్ హాస్పిటల్స్ గా చేర్చాలని ప్రతిపాదించారు. అవుట్ పేషంట్ (ఓపి) వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు అదనపు డిస్పెన్సరీ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, అడిషనల్ ల్యాబ్ టెక్నీషియన్ ను, ఫిజియోథెరపీ డాక్టర్ని కూడా ఏర్పాటు చేయాలని, రైల్వే కార్మికులకు మెడిసిన్స్ నాణ్యమైనవి కల్పించాలని మజ్దూర్ యూనియన్ కోరడమైనది.( సి, ఎం ,ఎస్, గుంతకల్) వేణుగోపాల్ రెడ్డి ఈ డిమాండ్లను సానుకూలంగా స్పందించి, ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యల తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ కార్యవర్గ సభ్యులు ట్రెజరర్ పి.ముని కుమార్, హేన్రి పాల్, చంద్ర నాయక్, బిఇసి మెంబర్స్ అచ్చం బాబు, నరేంద్ర,సుధాకరయ్య, దేవళం రాజేష్, రామ తులసి, ఇంతియాజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# సరైన వసతులు లేక అల్లాడుతున్న ఎస్టి కాలనీ వాసులు. కనీస వసతులు కల్పించండయ్యా..



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి రూరల్...

శ్రీకాళహస్తి మండలంలోని పోలి పంచాయతీ ఎస్టీ కాలనీ నందు త్రాగునీటికి అల్లాడుతున్న స్థానికులు. దాదాపు 35 కుటుంబాలు జీవనం సాగిస్తున్న ఈ ఎస్టీ కాలనీలో సరైన వసతులు లేక ఇక్కడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ కనీసం త్రాగడానికి నీళ్లు లేవు. 3 రోజులకు ఒకసారి పోలి పంచాయితీ నుండి త్రాగునీరు బండి వస్తుంది. 3 రోజులకు సరిపడా త్రాగునీటిని వీళ్లు నిల్వ చేసుకోవాలి లేదంటే 3 కిలోమీటర్లు నడిచి వెళ్లి త్రాగునీరు తెచ్చుకోవాలి. ఉన్నది ఒక్క బోరు ఆ బోర్ లో నీరు చాలా ఉప్పగా ఉన్నాయని అవి త్రాగడానికి పనికి రావని వారు వాపోయారు. హౌసింగ్ నిధులు సక్రమంగా అందక ఎక్కువ గుడిసెలో దర్శనమిస్తున్నాయి. రోడ్లు లేవు. ఇక్కడ త్రాగునీటి ట్యాంకు ఏర్పాటు చేసి ఇంటింటికి త్రాగునీటి కులాయిని అమర్చి, రోడ్లు వేసి, ఇండ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం సహకరించాలని ఇక్కడి స్థానికులు కోరుతున్నారు. ఎన్నిసార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన ఎటువంటి ప్రయోజనం లేదని ఇప్పటికైనా అధికారులు మా మొర ఆలకించి మాకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



# ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు

**అకాల వర్షాలు, గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు :



ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై శుక్రవారం క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్పీజీ సరఫరాపైనా సీఎం సమీక్షించారు. ఇరాన్ -- ఇజ్రాయిల్, అమెరికా మధ్య మరి కొన్నాళ్లు యుద్ధం కొనసాగితే... ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉందని, ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా రాష్ట్రంలో సమర్ధవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. ఎక్కడా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చూడాలన్నారు. గ్రామీణ - గిరిజన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆలయాలు, అన్న క్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ డెలివరీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎరువులు, పెట్రోల్, డీజిల్‌కు లోటు రానివ్వకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్లోనే జాయింట్ కలెక్టర్ ఏ రాజేంద్రన్ ఆయన ఛాంబర్ నందు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి హాజరయ్యారు.

# నేడు శ్రీ వేదనారాయణస్వామివారి ఆలయంలో మత్స్య జయంతి

ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి:

నాగలాపురం శ్రీ వేదనారాయణస్వామివారి ఆలయంలో నేడు మత్స్య జయంతి ఘనంగా జరుగనుంది. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొల్పి, తోమాల, అర్చన నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 7 నుండి 8.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణస్వామివారికి మత్స్య జయంతి ఉత్సవం (తిరువీధి ఉత్సవం) నిర్వహిస్తారు. ఉదయం 9 నుండి 11 గంటల వరకు శాంతిహోమం, ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు గరుడ వాహనంపై స్వామివారు ఆలయ మాఢవీదులలో ఉరేగుతు భక్తులను అనుగ్రహిస్తారు. ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# జడ్పిసి సీఈఓ ని కుంభాభిషేక కార్యక్రమానికి ఆహ్వానించిన శ్రీ పరుశురామేశ్వర స్వామి ఆలయ చైర్మన్ బత్తలగిరి నాయుడు.

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



ఈరోజు చిత్తూరు జడ్పిసి సీఈఓ ని మర్యాదపూర్వకంగా ఆలయ చైర్మన్ బత్తలగిరి నాయుడు కార్యనిర్వాహణాధికారి కలిసి రానున్న కుంభాభిషేకమునకు దంపత సమేతంగా విచ్చేయవలసిందిగా కోరినారు అందులకు జడ్పిసి సిఈవో తప్పకుండా కుంభాభిషేకమునకు హాజరవుతారని తెలిపినారు ఈ సందర్భంగా ఈవో ఒక ప్రకటనలో రానున్న కుంభాభిషేకమునకు ఆలయములో పలు పనులకు ఆసక్తిగల ఆశాభావులు కొటేషన్ ఇవ్వవలసిందిగా వారిని కోరడం జరిగింది.

# ప్రజలు మెచ్చేలా ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వహించాలి

## -మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

ప్రజాభూమి ప్రతినిది నాయుడుపేట టౌన్

నాయుడుపేట పట్టణంలో వెలిసి ఉన్న గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ జాతరను ప్రజలు మెచ్చేలా ప్రశాంత వాతావరణంలో నిర్వహించి,విజయవంతం చేయాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచించారు.శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,కమిటీ సభ్యులతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువాలు కప్పి,సన్మానించి శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మే నెల 5,6 తేదీల్లో జరుగునున్న నాయుడుపేట శ్రీ పోలేరమ్మ జాతరను ప్రశాంత వాతావరణంలో ప్రజలు మెచ్చేలా నిర్వహించి,విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నిత్యా కృష్ణారెడ్డి, ఆబోతుల బాబు,నల్లబోతుల రామారావు,నాయకులు ఆమవరపు సత్యం,మైలారి రాజశేఖర్, పోట్లపూడి రాజేష్, ఆకుల కుబేరుమణి,పసల గంగా ప్రసాద్, భారతాల సాయిరాం కిషోర్, బి ఎల్ శ్రీను, విన్నమాల మధు రెడ్డి, గాది రెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులకు, మా అక్కచెల్లెల్లకు, అన్నదమ్ములకు నా హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు.

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్



పవిత్రమైన రంజాన్ మాసం అనేది ఆత్మశుద్ధి, నియమ నిష్టలు, సహనం, దయా గుణం, సమానత్వం వంటి గొప్ప విలువలను మనకు బోధించే దైవిక కాలం. ఈ పవిత్ర మాసంలో మీరు భక్తిశ్రద్ధలతో, అల్లాహ్‌ను స్మరిస్తూ, కఠోర ఉపవాస దీక్షలు పాటించడం నిజంగా అభినందనీయం. మీరు ఇన్ని రోజులు ఆచరించిన ఈ పవిత్ర ఉపవాస దీక్షలకు ఆ అల్లాహ్ కరుణ కటాక్షాలు మీపై, మీ కుటుంబాలపై ఎల్లప్పుడూ నిలిచి ఉండాలని నా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీరు చేసిన ఈ పూజలు, ప్రార్థనలు ఫలించి మీ కుటుంబాలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను.రంజాన్ మాసం అనేది ప్రేమ, పంచుకోవడం, పరస్పర గౌరవం, సోదరభావం పెంపొందించే పవిత్ర సమయం. ఈ పవిత్రతను మన జీవితాల్లో ఎల్లప్పుడూ నిలబెట్టుకుంటూ, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని మరింతగా పెంపొందిద్దాం. మీరు ఈ పవిత్ర మాసాన్ని ఎలా భక్తి భావంతో, ఆనందంగా గడిపారో, అలాంటి ఆనందం, శాంతి మీ జీవితాల్లో ఎల్లప్పుడూ నెలకొని ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

# కాలూరు ముస్లిం పేటలో లిటిడిపి బ్యానర్లను ధ్వంసం చేసిన ఆకతాయిలు





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్.

వైసీపీ మద్దతు దారులని టిడిపి నాయకులు ఆందోళన పోలీసులకు ఫిర్యాదు . తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం కాలూరు ముస్లిం పేటలో తెలుగుదేశం పార్టీకి చెందిన బ్యానర్లను వైసీపీ మద్దతు దారులు ధ్వంసం చేశారని బ్లేడ్తో కట్ చేశారని టిడిపి నాయకులు ఆరోపణ చేస్తున్నారు వివరాలు ఎలా ఉన్నాయి. కాలూరు ముస్లిం పేటలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్య నాయకుడి బర్త్డే సందర్భంగా బ్యానర్లను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల అదే గ్రామంలో ఓ ముస్లిం టిడిపి నాయకుడికి, గ్రామ పెద్ద ముత్తు వల్లికి జరిగిన సంభాషణ ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. దీంతో వైసిపి మద్దతుదారులు టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన దీంతో ముత్తు వల్లే తమ అనుసరుల దగ్గర ఈ పని చేయించారని స్థానిక టిడిపి నాయకులు ముత్తువల్లిని వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకొని బ్యానర్లు కట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బ్యానర్లు బ్లడ్ తో కట్ చేశారు. ఆరోపణ చేస్తున్నారు. టిడిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ముస్లిం పేట భూతి ఇంచార్జ్ షావలి సమాచారాన్ని మల్లవరం గ్రామం పంచాయతీ ఇంచార్జ్ మనోహర్ చౌదరికి తెలియజేశారు. ముస్లిం పేటలో రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా శనివారం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బ్యానర్ కట్ చేయడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింపేటలో ఉన్న తెలుగుదేశం పార్టీ మద్దతు దారులు తమ పార్టీ నాయకుల ఫ్లెక్సీ కట్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా గ్రామంలో ప్రశాంతంగా పండగ నిర్వహించుకోవాలంటే ఇలాంటి పని చేయడంపై గ్రామస్తుల సైతం రంజాన్ పండుగ సందర్భంగా గ్రామంలో గొడవలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు.రంజాన్ పండుగ ప్రశాంతంగా జరగాలని స్థానికులు కోరుకుంటున్నారు.




# కె వి బి పురం ఎస్సీ హాస్టల్ ను పునః ప్రారంభించండి




కేవీబీ పురం ఎస్ ఎస్సీ హాస్టల్ భవనాలు మరమ్మత్తులు చేయడమా నూతన భవనాలు నిర్మించడమా వాటి స్థానంలో ఐదు కోట్ల రూపాయలు వెచ్చించి భవనాల నిర్మిస్తే బాగుంటుందని ఎందుకో నిర్లక్ష్య ధోరణలో ధోరణితో అధికారులు ఉన్నారని సాంఘిక సంక్షేమ శాఖ అధికారు స్పందించి లోని మారుమూల ప్రాంతమైన మండలమైన కేవీ బి పురం మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ ప్రభుత్వ బాలు ర హాస్టల్ ను పునః ప్రారంభించాలని మండల సర్పంచుల మరియు గ్రామాల్లోని ఎస్సీ ఎస్టీ విద్యార్థుల పేరెంట్స్ కోరుతున్నారు పాదయాత్రలో లోకేష్ బాబు గారు హామీ ఇచ్చారని ఎస్సీ హాస్టల్లో ప్రారంభిస్తామని ప్రభుత్వం వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న ఎస్సీ హాస్టల్ ప్రారంభించడంలో అధికారులు సర్వ చూపు లేకపోవడం శోచనీయమని పలువురు ఎస్సీ హాస్టల్లో పునః ప్రారంభించాలని కోరుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ వారి దగ్గర జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికలు ఉన్నాయని సంక సంక్షేమ శాఖ మంత్రివర్యులు విద్యాశాఖ మంత్రివర్యులు చొరవ చూపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు . ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సర్పంచి పొన్నూరు బాలాజీ మాజీ సర్పంచి వీమని ముని వేలు గజేంద్ర దేవేంద్ర రామచంద్ర పరమ శివయ్య లి బాబు డిల్లయ్య లక్ష్మయ్య నాగభూషణమ్మ కాటయ్య నాదముని మునెమ్మ బలరామయ్య వెంగమ్మ వెంకయ్య సుశీల సరళ ఇతరులు ప్రారంభించాలని కూడా ప్రార్థిస్తున్నారు

# రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న మంత్రి నారాలోకేష్.



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా హైదరాబాద్ ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికిన అధికారులు ,టిడిపి నాయకులు కార్యకర్తలు అనంతరం రోడ్డు మార్గం గుండా తిరుమలకు బయలుదేరి వెళ్లారు

# ప్రమాదవశాత్తు తెలుగు గంగా కాలువలో పడిన జింకను.....

## సురక్షితంగా కాపాడిన స్థానికులు...



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

మండలంలోని బాలకృష్ణాపురం గ్రామం సమీపంలో తెలుగు గంగ కాలువ నీటి ఉధృతిలో పడిన అటవీ జింక ను స్థానికుల సహకారంతో అటవీ శాఖ సిబ్బంది వేణు బృందం సురక్షితంగా ఉబ్బలమడుగు అడవికి తరలించారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండల కేంద్రము ఆనుకొని దాదాపు మండలంలో అధిక శాతం గ్రామాలను అనుసంధానిస్తూ వేలాది ఎకరాలుగా అటవీ భూమి ఉంటుంది. ఈ అటవీ భూమిలో ఎక్కువ భాగం అటవీశాఖ కార్పొరేషన్ ద్వారా జామ్ ఆయిల్ (యూకలిప్టస్) చెట్లు నాటి పెంచుతూ ఉండడంతో వన్యప్రాణులకు ఆహారం, నీరు, వాటి సంచార ఆవరణం తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ఈ అటవీ లో ఉన్న అటవీ పందులు, జింకలు, ఇతర వన్యప్రాణులు వ్యవసాయ భూములపై దాడి చేస్తుంది. బుధవారం రాత్రి ఓటమి జింక నీరు త్రాగడానికి వచ్చి కాలుజారి తెలుగు గంగాలో పడడంతో నీటి ఉధృతి అధికంగా ఉండడాన్ని బట్టి కొట్టుకొని పోయినట్టు తెలుస్తుంది. నీటి ఉధృతికి కొట్టుకొని పోయిన జింక బాలకృష్ణాపురం గ్రామ సమీపంలోని కల్వర్టు సమీపంలో నీతి ఉధృతి తక్కువగా ఉండడంతో కల్వర్టు కిందకు చేరింది. స్థానికులు దీన్ని గుర్తించి అటవీ శాఖ అధికారులకు గురువారం ఉదయం సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఎఫ్ ఆర్ వో త్రినాథ్ రెడ్డి సిబ్బందిని హుటాహుటిన సంఘటన స్థలానికి చేరవేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వేణుగోపాల్ బృందంతో కలిసి స్థానికులు త్యాగరాజు, మోహన్, స్టీఫెన్, వినోద్ వారితో కలిసి నీటి ఉధృతిని ఎదుర్కొంటూ చాకచక్యంగా అటవీ జింకను సురక్షితంగా రక్షించి వాటి శరీరానికి ఉన్న చిన్నపాటి గాయాలకు సమీపంలోని పశు వైద్యశాలలో వైద్యం నిర్వహించారు. అనంతరం ఉన్నత అధికారుల సూచన మేరకు వరదయ్య పాలెం మండలంలోని ఉబ్బల మడుగు అటవీ లోనికి సురక్షితంగా జింకను తరలించి స్వేచ్ఛగా విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బందులు, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# శివయ్య సేవలో మద్రాస్ కోర్టు జడ్జి కుటుంబ సభ్యులు



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి

జస్టిస్ సి .కుమార్పన్, జడ్జి, మద్రాస్ హై కోర్ట్ వారు ఈరోజు కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేసి యున్నారు. ఆలయ అధికారులు వారిని సాదరంగా ఆహ్వానించి వారికి అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం ఏర్పాటు చేయడమైనది. తీర్థప్రసాదాలు స్వామి వారు చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రోటోకాల్ ఏ ఈ ఓ మోహన్, ఏపీ పి ఆర్ ఓ రవి, శ్రీనివాసులు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన మండల పార్టీ అధ్యక్షులు పి.గిరి బాబు

ప్రజా భూమి ప్రతినిధి నారాయణవనం



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని హైదరాబాద్ నివాసంలో శుక్రవారం సాయంత్రం నారాయణవనం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పి.గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిసి శింగిరి కోనలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి తీర్థ ప్రసాదాలు మరియు స్వామివారి చిత్ర పటాన్ని అందించి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# శ్రీ మిట్ట గంగమ్మ ఆలయంలో వైభవంగా 'లలితా సహస్రనామ హోమం'



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి పట్టణంలోని కొలువైన శ్రీ మిట్ట గంగమ్మ దేవి ఆలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ధర్మకర్త మొక్కల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ లలితా సహస్రనామ పారాయణం మరియు లలిత మూలమంత్ర హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు లలిత మూలమంత్ర సహస్రనామ హోమం కన్నులపండువగా జరిగింది. పూసల



గౌరమ్మ లలితా సహస్రనామ పారాయణ బృందం ఆధ్వర్యంలో మొత్తం 1008 సార్లు లలితా పారాయణం చేయాలనే మహా సంకల్పంతో ఈ క్రతువును చేపట్టారు. ఈ నెల 12వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరుగుతున్న ఈ పారాయణంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బు స్వామి మాట్లాడుతూ.. "లలితా సహస్రనామంలో అమ్మవారికి 'నామ పారాయణ ప్రీతి' అనే నామం ఉందని, ఆ తల్లి నామాన్ని నిరంతరం పారాయణం చేయడం వల్ల సకల శుభాలు, అభివృద్ధి కలుగుతాయని" తెలియజేశారు. హోమం అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అలంకరణ నిర్వాహ అర్చకులు సుబ్రహ్మణ్యం రెడ్డి,ఉత్సవ నిర్వాహకులుకాపు వీధి సునీల్, కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

# ముద్దిరెడ్డిపల్లిలో ఘనంగా పంచమ జ్యోతుల మహోత్సవం -తరలివచ్చిన భక్తులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి ఏటా ఉగాది తర్వాత రోజున చౌడేశ్వరి అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం అర్ధరాత్రి నుండి గ్రామంలో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్ అమ్మవారిని



వివిధ రకాల ఆభరణాలతో, అలంకరణ సామాగ్రితో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్ ఎదురుగా ప్రత్యేక అఖండ దీపాన్ని ఏర్పాటు చేసి వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవంలో భాగంగా నిర్వహించిన జ్యోతుల నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జ్యోతులను ఐదుగురు వ్యక్తులు తలపై మోసుకుని లయబద్ధంగా నృత్యం చేయడం అందరిని మంత్రముగ్ధులను చేసింది. రంగురంగుల దీపాలతో వెలుగొందిన కార్యక్రమం భక్తి పారవశ్యంలో నింపింది. దేవాలయంలో మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ,ప్రసాద వినియోగం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

# డ్రైవర్ అజాగ్రత్త ..... యువకుడు దుర్మరణం....



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలో ఈరోజు జరిగిన సంఘటన పలువురి హృదయాలను కలచివేసింది. బ్రతుకు తెరువు నిమిత్తం బీహార్ నుండి లారీ క్లీనర్ గా పనిచేస్తున్న డ్రైవర్ నిర్లక్ష్యం వలన ప్రాణాలు కోల్పోయిన రూపేష్ చౌహాన్. తండ్రి లాల్ బాబు చౌదరి. (చనిపోయిన వ్యక్తి రూపేష్ చౌహాన్ వయసు 32) వరదయ్యపాలెం కు చెందిన కుమార్ స్వామి



లారీ. నంబర్ ఏపీ 07 టిడబ్ల్యూ 9009కి డ్రైవర్ గా పనిచేస్తున్న గోపి నిర్లక్ష్య కారణంగా నిండు ప్రాణం బలైంది. ఈ యొక్క వాహనం ప్రమాదానికి గురైన వివరాలు రైతులు దగ్గర ధాన్యం కొనుగోలు చేసి లోడ్ చేసుకొని హైవే రోడ్డు పైకి వచ్చే సమయంలో డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని నడపడం వలన అదుపుతప్పి ఎస్ ఎస్ కెనాల్ కాలువలో వాహనం పడిపోవడం జరిగింది. ఈ వాహనంలో ఉన్నటువంటి కొందరికి గాయాలు కాగా వారిని అంబులెన్స్ సహాయంతో దగ్గరలో ఉన్న వైద్యశాలకు తరలించారు. దురదృష్టవశాత్తు వాహనంలో ఉన్న క్లీనర్ రూపేష్ చౌహాన్ చనిపోవడం జరిగింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# ముచ్చివోలులో శ్రీ సీతారామ స్వామి ఆలయ మహా కుంభాభిషేకంకు ఆహ్వానం



ప్రజా భూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చివోలు గ్రామంలో నూతనం గా నిర్మించిన శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామ స్వామి వారి దివ్య దేవాలయం మహాకుంభాభిషేకం మార్చి 25వ తేదీన నిర్వహించనున్నట్లు శ్రీరామ సేవా సమితి, మరియు ముచ్చివోలు హరేరామ భజన బృందం వారు తెలియజేశారు ఇందులో భాగంగా 23 మార్చి నుంచి కార్యక్రమాలు 25 మార్చి వరకు జరుగునున్నాయి ఆధ్యాత్మిక రంగంలో ముచ్చివోలు గ్రామం ఎంతో ముందంజలో ఉంది. ఈ ముచ్చివోలుగ్రామం లో అనేక రకాల ఆలయాలు ప్రతి పండుగను నిర్వహించేందుకు ఉన్నాయి. సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ సహకారంతో నిర్మించారు . కార్యక్రమాలు మార్చి 23న భగవత్ ప్రార్థన, అనుజ్ఞ, విశ్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, రక్షాబంధన పూజ, పంచగవ్యారాధన, ఋత్విక్ వరణం, రక్షాధారణ ,పంచగవ్య ప్రాసన, గ్రామోత్సవం, మృత్సంగ్రహణం, శాల వాస్తు, అంకురార్పణం, సర్వ అగ్నికుండేషు అగ్ని ప్రతిష్ట, అకల్మష హోమం, కుంభారాధన, ఊక్త హోమం, లఘు పూర్ణాహుతి, చతుర్వేదం ,హారతి 24 మార్చి విశ్వక్సేన పూజ, పుణ్య హవాచనం, అగ్ని ప్రణయనం, కుంభఆరాధన , ఉత్త హోమం, 25 మార్చి ఉదయం 9: 48 ని నుండి 9 గంటల 52 నిమిషాల మధ్యలో మహా కుంభాభిషేకం , తరువాత మహా పూర్ణాహుతి, యంత్రస్థాపన దేవస్య బింభస్థాపన, యాత్రాదానం, విమాన కుంభాభిషేక సంప్రోక్షణ, ఆరాధన, బలి ,స్వామి దర్శనం, గో దర్శనం, కన్యాదర్శనం, హారతి, శ్రీనివాస శాంతి కళ్యాణ మహోత్సవం, అక్షతారోపణం, బ్రహ్మగోష, వేద ఆశీర్వచనంతో ముగిస్తుంది ఈ మూడు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తారు అదేవిధంగా 25వ తేదీ శ్రీ సీతారామ కళ్యాణం నిర్వహించబడుతుంది అని శ్రీ సీతారామ సేవా సమితి వారు, ముచ్చివోలు హరేరామ భజన బృందం వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేసి స్వామి అమ్మవార్ల కృపా కటాక్షాలను పొంది జయప్రదం చేయవలసిందిగా ముచ్చివోలు హరేరామ భజన బృందం , శ్రీరామ సేవా సమితి వారు, గ్రామ సర్పంచ్, మరియు గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు

# వైభవంగా చౌడేశ్వరిదేవి రథోత్సవం

## -భారీగా తరలివచ్చిన భక్తజనం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండలం కొటిపిలో చౌడేశ్వరి అమ్మవారి రథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో అలంకరించిన రథంపై చౌడేశ్వరి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొుక్కులు చెల్లించారు. రథోత్సవం సందర్భంగా భక్తులు జై చౌడేశ్వరి మాతా నినాదాలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. మహిళలు బోనాలు, హారతులతో అమ్మవారికి ప్రత్యేక సేవలు సమర్పించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథం సాగడంతో ఎక్కడ చూసినా భక్తుల సందడి కనిపించింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. చౌడేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని భక్తులు ఆకాంక్షించారు.

# ఉంజల్ సేవలో పద్మావతి అమ్మవారు



ప్రజా భూమి ప్రతినిధి నారాయణవనం

మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన ప్రముఖ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం టిటిడి ఆలయమైన శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పద్మావతి అమ్మవారికి ఘనంగా ఉంజల సేవ నిర్వహించారు. ఉదయం6 గంటలకు సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పి, నిత్య పూజా కార్యక్రమాల అనంతరం10 గంటలకు స్వామి అమ్మవార్లకు పాలు పెరుగు నెయ్యి కొబ్బరి నీళ్ల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. తర్వాత వివిధ పుష్పాలతో సు మనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.సాయంత్రం పద్మావతి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సు మనోహరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిరోహించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించి ఉంజల సేవ వేడుకగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, అర్జిత్ ఇన్స్పెక్టర్ భరత్, ఆలయ అర్చకులుశ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది, వాహన మోతగాళ్లు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో బావ, బామ్మర్దులు కత్తులతో దాడి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని దండురోడ్డులో శుక్రవారం తాగిన మైకంలో బావల బామ్మర్ది పరస్పరం కత్తులతో దాడులు చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు పట్టణంలోని దండు రోడ్డులో నివాసముంటున్న హరీష్ రెడ్డి చెల్లిని లేపాక్షి మండలం కల్లూరులో నివాసం ఉంటున్న విశ్వనాథ్ రెడ్డి రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే ఈ వివాహం హరీష్ రెడ్డికి ఇష్టం లేదు. ఈ నేపథ్యంలో ఉగాదిని పురస్కరించుకొని గురువారం హరీష్ రెడ్డి చెల్లెలి ఊరికి వెళ్లి వచ్చాడు. శుక్రవారం చెల్లి బావ ఇద్దరూ వారి ఇంటికి వచ్చారు. ఇద్దరూ తాగిన మత్తులో మాట మాట పెరిగి ఇంట్లో ఉన్న కత్తులతో దాడులు చేసుకున్నారు. వెంటనే వారిద్దరిని హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వన్ టౌన్ ఎస్సై శ్రీధర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# అకాల వర్షాలతో పంట నష్టంపై సీఎం వీడియో కాన్ఫరెన్స్

## -- అన్నమయ్య జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్ నిశాంత్ కుమార్



మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి,మార్చి 20: అకాల వర్షాలు, భారీ గాలులు, వడగళ్ల వర్షాల కారణంగా రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదన్ రావు తో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమీక్షలో పంటల నష్టం, రైతులకు అందించాల్సిన సహాయం, భవిష్యత్ చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 42 మండలాల్లో సుమారు 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ పంటల నష్టం విలువ సుమారు రూ.40 కోట్లుగా అంచనా [illegible]వేశారు. అదేవిధంగా 9 జిల్లాల్లో 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, ఆరెంజ్, నిమ్మ వంటి ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, వీటి నష్టం రూ.22.68 కోట్లుగా అధికారులు వివరించారు. పంట నష్టంపై వెంటనే అంచనాలు పూర్తి చేసి రైతులకు తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే ఎల్పీజీ సరఫరా వ్యవస్థపై కూడా సీఎం సమీక్షిస్తూ ఇరాన్--[illegible]ఇజ్రాయిల్ యుద్ధం ప్రభావంతో గ్లోబల్ సప్లై చైన్ దెబ్బతినే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఫెర్టిలైజర్లు, పెట్రోల్, డీజిల్ వంటి అవసరమైన వనరుల లోటు రాకుండా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆలయాలకు ఎల్పీజీ సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ, ఈవీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అన్నమయ్య జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ..జిల్లాలో గత రెండు సంవత్సరాల అనుభవాన్ని ఆధారంగా తీసుకొని, ముందస్తు వర్షపాతం అంచనా నివేదికలను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా సహజ వనరుల నిర్వహణ, వరద ప్రవాహ అంచనా మరియు ప్రజల భద్రతకు సంబంధించి కీలక చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఇప్పటివరకు 5 రోజుల వ్యవధిలో సేకరించిన ముందస్తు అంచనా నివేదికల ద్వారా, 6 నుండి 7 రోజుల ముందుగానే మండల వారీగా వర్షపాతం అంచనాలు పొందగలిగామని, ఈ అంచనాలు సుమారు 90% వరకు ఖచ్చితత్వాన్ని చూపించగా, వాస్తవ వర్షపాతం తో పోలిస్తే సగటున 10-15% వరకు మాత్రమే వ్యత్యాసం ఉన్నట్లు గమనించడం జరిగిందని, ఈ నేపథ్యంలో, రాబోయే 7 రోజుల వర్షపాతం అంచనాలను ఆధారంగా తీసుకొని ఎక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో ముందస్తుగా సహజ వనరుల నిర్వహణ పనులు చేపడతామని,నీటి నిల్వ, వినియోగం, పంపిణీ అంశాల్లో సమర్థవంతమైన చర్యలు తీసుకొని, నీటి వనరుల శాఖలో అమలులో ఉన్న "డికెన్స్ ఫార్ములా" ఆధారంగా వరద ప్రవాహాన్ని అంచనా వేసి, జిల్లా పరిధిలోని ఉప-జలవిభాగాల వారీగా అధిక నీటి ప్రవాహం ఉండే ప్రాంతాలను గుర్తించి అధిక నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునే చర్యలు చేపట్టడం జరుగుతుందనిజిల్లాకు సంబంధించిన వివరాలను సీఎంకు వివరించారు.

# ఆత్మశుద్ధి, మానవత్వానికి మార్గదర్శి - రంజాన్



ప్రజా భూమి తొండూరు : ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు అత్యంత భక్తి, విశ్వాసాలతో ఆచరించే పవిత్రమైన నెల రంజాన్. ఇది కేవలం ఉపవాసం పాటించే కాలం మాత్రమే కాదు; మనిషి ఆత్మను శుద్ధి చేసుకునే, మనసును నియంత్రించుకునే, జీవన విలువలను పునరుద్ధరించుకునే ఒక మహత్తరమైన ఆధ్యాత్మిక యాత్ర. ఈ నెలలో ప్రతి ఒక్కరూ తమలోని చెడును తగ్గించి, మంచితనాన్ని పెంపొందించుకునే దిశగా ప్రయాణిస్తారు.

ఉపవాసం నియంత్రణకు ప్రతీక

రంజాన్ నెలలో ప్రతి రోజు ఉదయం సూర్యోదయానికి ముందు సాహూర్ తీసుకొని, సాయంత్రం సూర్యాస్తమయం వరకు ఉపవాసం పాటించడం విశేషం. ఈ ఉపవాసం కేవలం ఆకలి, దాహాన్ని భరించడం మాత్రమే కాదు; అది మనసులోని కోపం, అసూయ, స్వార్థం వంటి చెడు లక్షణాలను నియంత్రించుకోవడమే ప్రధాన ఉద్దేశం.ఆకలి అనుభవించడం ద్వారా పేదవారి బాధను అర్థం చేసుకోవడం జరుగుతుంది. సాయంత్రం ఇఫ్తార్ సమయంలో ఖర్జూరం, నీటితో ఉపవాసం విరమించడం ఆనవాయితీ. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఇఫ్తార్ చేయడం ద్వారా ఐక్యత మరింత బలపడుతుంది.

ప్రార్థనలు,ఆత్మకు శాంతి, స్థిరత్వం

రంజాన్ నెలలో ప్రార్థనలకు ప్రత్యేక స్థానం ఉంది. రోజుకు ఐదు సార్లు నమాజ్ చేయడం, రాత్రివేళల్లో తరావీహ్ నమాజ్ నిర్వహించడం, ఖురాన్ పారాయణం చేయడము అన్ని ఇవి భక్తిని మరింతగా పెంచుతాయి. ప్రార్థనల ద్వారా మనిషి తన ఆత్మను పరిశీలించుకొని, తనలోని లోపాలను సరిదిద్దుకునే అవకాశం పొందుతాడు. ఇది ఆధ్యాత్మికంగా ఎదగడానికి దోహదం చేస్తుంది.

దానం సమాజానికి సహానుభూతి సందేశం

రంజాన్ నెలలో జకాత్ (దానం) చేయడం ఒక ముఖ్యమైన విధి. పేదలు, నిరుపేదలకు సహాయం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుంది. ఆహారం, దుస్తులు, డబ్బు వంటి సహాయాలు అందించడం ద్వారా "మనిషి మనిషికి తోడుగా ఉండాలి" అనే భావన బలపడుతుంది. దానం చేయడం ద్వారా మనసుకు కలిగే ఆనందం ఎంతో గొప్పది.

ఈద్ ఉల్ ఫితర్ -- ఆనందోత్సవ క్షణాలు

రంజాన్ నెల ముగిసిన తరువాత వచ్చే పండుగ ఈద్ ఉల్ ఫితర్. ఈ రోజు ఆనందం, సంతోషం, ఐక్యతకు ప్రతీక.

ముస్లింలు కొత్త బట్టలు ధరించి, ప్రత్యేక నమాజ్ నిర్వహించి, బంధుమిత్రులతో కలిసి విందులు చేసుకుంటారు. స్వీట్లు పంచుకొని సంతోషాన్ని పంచుకుంటారు. ఇది కేవలం పండుగ మాత్రమే కాదు; మనుషుల మధ్య ప్రేమ, స్నేహాన్ని బలపరచే సందర్భం.

రంజాన్ ఇచ్చే జీవన పాఠాలు

రంజాన్ మనకు ఎన్నో గొప్ప విలువలను నేర్పుతుంది:

సహనం -- కష్టాలను ఓర్పుతో ఎదుర్కోవడం

నియంత్రణ -- మనసును అదుపులో ఉంచుకోవడం

దయ -- ఇతరుల బాధను అర్థం చేసుకోవడం

దానం -- పంచుకోవడం ద్వారా ఆనందాన్ని పొందడం.

ఈ విలువలు మన జీవితాన్ని మరింత గొప్పదిగా మలుస్తాయి. రంజాన్ అనేది కేవలం ఒక మతపరమైన ఆచారం కాదు; అది మానవత్వాన్ని పెంపొందించే ఒక గొప్ప పాఠశాల. మనిషిని మంచి మార్గంలో నడిపించే శక్తి దీనిలో ఉంది. "ఆకలిని జయించడం కాదు... మనసులోని చెడును జయించడం నిజమైన రంజాన్." ఈ పవిత్ర నెల ప్రతి ఒక్కరిలో మంచి మార్పు తీసుకురావాలని కోరుకుందాం.

# వివేకానంద చైతన్య సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఉగాది ఉత్సవాలు



ప్రజాభూమి పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణంలోని వివేకానంద చైతన్య సమితి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉగాది ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా దుబ్బాక కిషోర్ శర్మ స్వామి పంచాంగ శ్రవణం వినిపించారు. ప్రవచనకర్తగా విచ్చేసిన గీతా ప్రచారక్ శ్రీమతి పెళ్ళూరు సుష్మ మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో చెప్పిన గీతను నేర్చుకోవడం వల్ల జీవితం ప్రగతి వైపు పయనిస్తుందని అన్నారు కాబట్టి ప్రతి ఒక్కరూ భగవద్గీతను నిత్య జీవితంలో నేర్చుకొని ఆచరించాలని కోరారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన యనమల సుధాకర్ మాట్లాడుతూ ఉగాది ప్రకృతి సిద్ధంగా వచ్చిందని కాబట్టి అందరూ మంచి సంకల్పంతో ముందుకు వెళ్లి ఈ సంవత్సరం విజయం సాధించాలన్నారు. వివేకానంద చైతన్య సమితి అధ్యక్షులు బీరం రామకృష్ణారెడ్డి, కార్యదర్శి గుండెబోయిన శ్రీనివాసులు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్న స్వామి వివేకానందుని స్ఫూర్తితో ప్రతి సంవత్సరం విద్యార్థులకు అనేక రకాల ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి వాళ్లలో చైతన్యాన్ని నిర్మాణం చేస్తామని ఉగాది ఉత్సవాలను సంక్రాంతి సంబరాలను స్వామి వివేకానంద జయంతిని సామాజిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని అన్నారు. సమితి వారి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాల సందర్భంగా భగవద్గీత పోటీలను నీతి పద్యాల పోటీలను దేశభక్తి దైవభక్తి పాటలను ఉగాది కవితల పోటీలను పాఠశాలలవిద్యార్థులకు సమితి వారు నిర్వహించి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను బహుమతులను అందజేయడం జరిగింది. మరియు పోరుమామిళ్ల పరిసర ప్రాంతాలలోని సాహితీవేత్తలను కవులను ప్రోత్సహిస్తూ బహుమతులను ఇచ్చి సన్మానించడం జరిగింది మరియు పోరుమామిళ్ల పరిసర ప్రాంతాలలో వివిధ సేవా రంగాలలో కేవలందించే వారికి ప్రోత్సాహక బహుమతులను అందించి గౌరవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి బెల్లంకొండ ఫణీరావు స్వామి వెంకటరామిరెడ్డి రవి కేశవరావు పోకల సుబ్బారెడ్డి నూనె శ్రీనివాసులు సుమంత్ గురుమూర్తి కుర్ర చెన్న కృష్ణయ్య అచ్యుత రామారావు రామకృష్ణారెడ్డి పెద్ద ఎత్తున పోరుమామిళ్ల పట్టణ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వాహనదారులందరూ లైసెన్స్ కలిగి ఉండాలి

## - ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

## - సీఐ టి. నరసింహులు



ప్రజాభూమి, వేంపల్లె వాహనదారులందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ టి. నరసింహులు తెలిపారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ టి. నరసింహులు మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని తెలిపారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో వాహనదారులు హెల్మెట్ తప్ప నిసరిగా ధరించడంతో పాటు, వాహన పత్రాలు మరియు డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉం చుకోవాలని సూచించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దుకాణదారులు తమ బోర్డులను దుకాణాల పరిధిలోనే ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కిరణ్, శ్రీనాథ్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీ అంబికాను సన్మానించిన చత్రపతి శివాజీ ట్రస్ట్



ప్రజాభూమి, హిందూపురం టౌన్ అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణను హిందూపురం పట్టణంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం శ్రీ చత్రపతి సేవా ట్రస్టు, వానరసేన సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా కు ఆయా ట్రస్టు సభ్యులు చత్రపతి శివాజీ చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. హిందూపురం పట్టణంలో మేళాపురం తెలుగుతల్లి విగ్రహం సమీపంలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న విషయం విదితమే. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ట్రస్టు సభ్యులు ఎంపికు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చత్రపతి సేవా ట్రస్ట్ అధ్యక్షులు చలపతి, ఆర్టీసీ జగదీష్ , శ్రీరామ్ చిట్స్ రామకృష్ణ, దేవాంగం శంకరప్ప, వానర సేన సభ్యులు నరేంద్ర, శ్రీచరణ్, ప్రణయ్,షిండే, ప్రాణేష్ దేవకర్, గంగా ప్రసాద్, శ్రీ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి, సహనం, సేవకు ప్రతీక రంజాన్ పండుగ

## - జిల్లా టిడిపి మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయరామి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె పవిత్ర రంజాన్ మాసం ముస్లిం సోదర సోదరీమణుల జీవితంలో శాంతి, ఐశ్వర్యం, ఆరోగ్యాన్ని తీసుకురావాలని జిల్లా టిడిపి మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయరామి రెడ్డి తెలిపారు.అలాగే, ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ సందర్భంగా ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సింగారెడ్డి జయరామి రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం మాసం శాంతి, సహనం, సేవకు, ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. రంజాన్ మాసం కేవలం ఉపవాసం మాత్రమే కాదు. ఇది క్రమశిక్షణ, దయ, ఇతరులకు సహాయం చేసే గొప్ప సమయం. ఈ నెలలో చేసే ప్రార్థనలు, సత్కార్యాలు మనకు సహనం, ఆకలి, కోపాన్ని జయించే శక్తిని ఇస్తాయి. దానం (జకాత్) ద్వారా ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, మనసుకు శాంతి, దైవచింతన పొందడం సాధ్యమవుతుంది అని అన్నారు.

# ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ విడుదల

## - హర్షం వ్యక్తం చేసిన కొండూరు చైతన్య కుమార్



ప్రజాభూమి, పులివెందుల శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ పై నియోజకవర్గ టిడిపి ప్రొఫెషనల్ వింగ్ మాజీ అధ్యక్షుడు కొండూరు చైతన్య కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి మాట నిలబెట్టుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ వంటి పారదర్శక విధానం ద్వారా నిరుద్యోగ యువతకు స్పష్టత, నమ్మకం పెరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు యూపీఎస్సీ వంటి కేంద్ర స్థాయి సంస్థల్లో మాత్రమే ఉన్న ఈ విధానాన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయడం మంచి ముందడుగని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం ద్వారా యువతకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ విడుదల నిరుద్యోగ యువతకు నిజమైన ఉగాది కానుకగా నిలిచిందని అన్నారు.

# రంజాన్ సందర్భంగా దివ్యాంగులకు గాజుల బాబయ్య మాంసం, గుడ్లు పంపిణీ

**-రంజాన్ పవిత్ర స్ఫూర్తి -- దివ్యాంగులకు మానవతా ఆర్తి**

**-వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి**



ప్రజాభూమి, పులివెందుల సర్వసృష్టికర్త అయిన దేవుని దృష్టిలో అందరూ సమానులేనని, తనతోటి వ్యక్తులు, నిరుపేదలు, అనాధలు, దివ్యాంగులు ఆకలితో అలమటిస్తుంటే, మనంకడుపునింపుకొని పండగ చేసుకోవడం ఇస్లాం ధర్మానికి విరుద్ధమని, అటువంటి అభాగ్యు ల ఆకలి తీర్చేందుకే ప్రతి ముస్లిం తనఆదాయంలో కొంతభాగం దేవుని పేరు మీదుగా జకాత్, ఫిత్రా రూపంలో నిరుపేదలకు దానధర్మాలు చేయడం ప్రపంచంలోనే సర్వోత్కృష్టమైన పవిత్ర కార్యమని , అల్లా చూపిన దారిలో పయనిస్తూ, రోటరీపురం కౌన్సిలర్ గాజుల సలీమా, గాజుల బాబయ్య కుటుంబసభ్యులు పండుగ సందర్భంగా దివ్యాంగు లకు పోషకాహారమైన మాంసం, కోడిగుడ్లు పంపిణీ చేయడం అభినందనీయమని, వారి సేవాస్ఫూర్తి అందరికీ ఆదర్శమని వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పేర్కొన్నారు.రంజాన్ పండుగను పురస్కరించుకొని స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూ నిటీ భవనశీలో ఏర్పాటుచేసిన ఒకకార్యక్రమంలో రోటరీపురం నాయకులు గాజుల బాబయ్య కుటుం బ సభ్యులు ఒక్కో కుటుంబానికి కిలో చికెన్, 30 కోడిగుడ్ల చొప్పున 25 మంది వికలాంగులకు పంపిణీ చేశారు. అంతకుమునుపు దివ్యాంగులకు స్వస్థత చేకూరాలని, వారికి ఆయురారోగ్యాలు ప్రాప్తించాలని బాబయ్య తండ్రి గాజులఫకృద్దీన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, గాజుల బాబయ్య కుటుంబ సభ్యులు బాబా ఫక్రుద్దీన్, నౌషాద్, సనా తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది విందులో టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి



ప్రజాభూమి, వేంపల్లె పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. శుక్రవారం, మండలంలోని గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు మల్లంగి సుధాకర్ రెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి, మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, కన్వీనర్ రామముని రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేమకుమార్, మాచిరెడ్డి శివసాగర్ రెడ్డి, మహమ్మద్, రాజా నాయక్, గండికోట శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డిని సన్మానించిన చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి



ప్రజాభూమి పోరుమామిళ్ల : ఉగాది సందర్భంగా పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని, అలాగే నియోజకవర్గం బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించి ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి,పార్టీ మండల అధ్యక్షులు సీఎం భాష, ఎంపీటీసీ ఇషాక్, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు చాపాటి సాయి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి రాతిబండలాగుడు పోటీలు

ప్రజాభూమి, పుట్లూరు. పుట్లూరు మండలంలోని నాయకుని పల్లి గ్రామం వద్ద ఉగాదిని పురస్కరించుకొని నేడు నిర్వహించే తిరుణాల సందర్భంగా రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించడం జరుగుతుందని పుట్లూరు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూనాయకుని పల్లి గ్రామం వద్ద ఉగాది పండుగ సందర్భంగా సుంకులమ్మ తిరుణాల రెండు రోజులపాటు జరుగుతుందని ఇందులో భాగంగా రాతిబండ రాగుడు పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఇందులో గెలుపొందిన వాటికి మొదటి బహుమతి 50వేల రూపాయలు, రెండవ బహుమతి 40000 వేల రూపాయలు, మూడవ బహుమతి 30,000 వేల రూపాయలు, నాలుగవ బహుమతి 20వేల రూపాయలు, ఈ విధంగా మొత్తం తొమ్మిది నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందని మరిన్ని వివరాలకు 70133 17740, 901011 6 420 నెంబర్లకు సంప్రదించాలని గ్రామ పెద్దలు తెలిపారు.

# పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు

## కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం అనేది విశ్వాసం, నియమశీలత, త్యాగం, కరుణ వంటి మహోన్నత విలువలను మన జీవన విధానంలో ప్రతిబింబించే ఆధ్యాత్మిక యాత్ర అని పేర్కొన్నారు. ఉపవాస దీక్షలు మన స్సును పరిశుభ్రం చేయడమే కాకుండా, అవస రంలో ఉన్నవారి పట్ల సానుభూతి కలిగించే గొప్ప సాధనమని అన్నారు.సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం



మరింత బలప డేలా ముస్లిం సోదరులు దానధర్మాలు, సేవా కార్యక్రమాల ద్వారా రంజాన్ యొక్క నిజమైన స్ఫూర్తిని చాటి చెబుతారని పేర్కొన్నారు. ఈ పవిత్ర సందర్భంలో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రతి హృదయంలో శాంతి నిండాలని, సమాజంలో సౌభ్రాతృత్వం చిరస్థాయిగా నెలకొనాలని కలెక్టర్ గారు ఆకాంక్షించారు. విశ్వాసం మనకు దారి చూపు తుంది... దయ మనలను కలుపుతుంది... సేవ మన సమాజాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది – ఇదే రంజాన్ సందేశం అని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.



# యువత ఆశలకు కొత్త రెక్కలు తొడిగేలా జాబ్ క్యాలెండర్

- జాబ్ క్యాలెండర్ పై హామీ ఇచ్చాం అమలు చేసి చూపించాం
- 20 లక్ష ఉద్యోగాల కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి
- వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి
- మచిలీపట్నాన్ని అభివృద్ధికి కేరాఫ్ గా మోడల్ పట్టణంగా మార్చి చూపిస్తానన్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

ఉగాది పర్వదినాన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ యువతలో కొత్త రెక్కలు తొడిగిందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. టీడీపీ మచిలీపట్నం నియోజకవర్గ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారా లోకేష్‌లకు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేసి వారి ఆత్మహత్యలకు కారణమయ్యారు. ఎన్సీఈఆర్టీ నివేదిక ప్రకారం గత ఐదేళ్లలో 4,000 మందికి పైగా నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనపై దృష్టి పెట్టాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. రెండేళ్లలోనే 6,28,347 ఉద్యోగాలు కల్పించాం. ఉగాది సందర్భంగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్ లో గ్రూప్-1, గ్రూప్-2 కలిపి 600 పోస్టులు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 1,000 పోస్టులు, ఎక్సైజ్ కానిస్టేబుల్‌లకు 400 పోస్టులతో నోటిఫికేషన్లు విడుదల చేశాం. ఎంఎస్ఎంఈ రంగం ద్వారా 2,48,096 ఉద్యోగాలు కల్పించాం. వైసీపీ పాలనలో రాష్ట్రం నుండి వందలాది పరిశ్రమల్ని తరిమేశారు. ఏపీలో పెట్టుబడి అంటేనే భయపడే పరిస్థితి కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు క్యూ కడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రాన్ని ఇన్నోవేటివ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో సుమారు 25.03 శాతం ఏపీకి రావడం పాలనా దక్షతకు నిదర్శనం.

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అడ్డగోలుగా వాగుతున్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను చూసి కడుపు మంటతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. తిరుపతి కల్తీ నెయ్యి వివాదంలో చేయాల్సిందంతా చేసి.. కూటమి ప్రభుత్వంపై నిందలేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకోవడానికి వైసీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గేదే లేదన్నారు. మచిలీపట్నం మున్సిపాలిటీ అభివృద్ధిని వైసీపీ నాయకులు నిర్లక్ష్యం చేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన పేర్నినాని మచిలీపట్నం నియోజకవర్గానికి చేసిందేమిటి? కొడుకుతో గంజాయి అమ్మకాలు చేయించి, యువత జీవితాలను చిత్తు చేశాడు. మద్యం షాపులన్నీ గంపగుత్తగా హస్తగతం చేసుకుని జేబులు నింపుకున్నాడు. వైసీపీ ఆఫీసుల కోసం భూములు కేటాయించుకున్నారు తప్ప.. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణానికి యూనియన్ బ్యాంకు ముందుకొచ్చినా.. పనులు చేయకుండా అడ్డుకున్నారు. కానీ నేడు మచిలీపట్నం మున్సిపాలిటీకి స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజునే జిల్లా కలెక్టర్ ఆ స్మారక భవనం ఫైల్‌పై సంతకం చేయడం అభినందనీయం. ఈ భవనం నిర్మాణం ద్వారా స్థానిక యువతకు శిక్షణ, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని పేర్కొన్నారు.మచిలీపట్నం మేయర్ గా బలహీన వర్గాలకు అవకాశం రావడాన్ని జీర్ణించుకోలేక అభివృద్ధిని అడ్డుకున్నారు. మేయర్ పదవికి తగిన గౌరవం ఇవ్వకుండా మున్సిపాలిటీని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. మచిలీపట్నం అభివృద్ధి విషయంలో ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే రూ.73 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఇప్పటికే రూ.13 కోట్లతో డ్రైనేజీ పనులు చేశాం. 15 వ ఆర్థిక సంఘం నుండి రూ.16 కోట్లు తీసుకొచ్చాం. త్వరలోనే మరో రూ.10 కోట్లు రానున్నాయని, రాబోయే మూడు సంవత్సరాల్లో మచిలీపట్నాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతానాని ధీమా వ్యక్తం చేశారు.

సొంత బాబాయిని చంపి, తోడ బుట్టిన చెల్లికి అన్యాయం చేసినోడు రాష్ట్రానికి న్యాయం చేస్తాడన్నట్లుగా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారు. వంగవీటి రంగాను హత్య చేసినోళ్లను ఇంట్లో పెట్టుకుని విందులు ఇచ్చిన దుర్మార్గుడు పేర్ని నాని కాదా..రామానాయుడుపేట సెంటర్లో గతంలో ప్రజారాజ్యం దిమ్మ ఉంటే.. దాన్ని నేడు జనసేన దిమ్మ కట్టుకుంటే దాన్ని కూడా పేర్ని నాని రాజకీయం చేస్తున్నాడు. పోలీసులపై తిరుగుబాటు చేస్తున్నాడు. బందరు పేర్ని నాని జాగీరు అనుకుంటున్నాడేమో. రాష్ట్రంలో నడుస్తున్నది జగన్ రెడ్డి బందిపోటు రాజ్యం కాదు. ప్రజలు ఎన్నుకున్న కూటమి ప్రభుత్వం అని హెచ్చరించారు. బందరులో మద్యం వ్యాపారంలో ఏదో జరిగిపోతోందని మాట్లాడుతున్న పేర్ని నాని.. గతంలో వారి మద్యం షాపుల్లో కల్తీ జరుగుతోందని సమాచారంతో వెళ్లిన అధికారులపై దాడి చేయడం వాస్తవం కాదా. అలాంటి వ్యక్తి కూడా ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బెల్ట్ షాపులు, మద్యం పాలసీపై వైసీపీ నేతల విమర్శలను ఖండించారు. ఎక్కడైనా అవకతవకలు కనిపిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖ ద్వారా విచారణ జరిపిస్తున్నాం. గతంలో పారదర్శకమైన మద్యం విధానం అమలు చేస్తున్నాం. వైసీపీ హయాంలో రూ.3500 కోట్ల అవకతవకలు జరిగాయని సుప్రీమ్ కోర్టు కూడా తీవ్రంగా పరిగణించింది. కూటమి ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఎక్సైజ్ పాలసీని అమలు చేస్తోంది.

ఉగాది పండుగ రోజున మంత్రి నారా లోకేష్ తనయుడితో కలిసి ఇంట్లో పూజగదిలో పూజ చేస్తుంటే.. దాన్ని కూడా క్షుద్ర పూజ అంటూ వ్యాఖ్యానించడం అత్యంత దుర్మార్గం. హైందవ సంప్రదాయాలపై కనీసం కూడా నమ్మకం లేని జగన్ రెడ్డిని వంత పాడుతున్నారు. హైందవ సంప్రదాయాలపై జగన్ రెడ్డికి ఉన్న నమ్మకమేంటో నిన్న పూజలు సందర్భంగా బట్టబయలైంది. వైసీపీ డ్రామా కంపెనీకి కాలం చెల్లిపోయింది. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కాకపోయినా.. ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ అభివృద్ధిని అడ్డుకుంటామని ప్రయత్నిస్తే మాత్రం ఏమాత్రం సహించేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# పట్టాభి భవనం అనుమతులు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు



మచిలీపట్నం ప్రజాభూమి బ్యూరో

పట్టాభి స్మారక భవనం కు పరిపాలన అనుమతులు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు. మచిలీపట్నం కాంగ్రెస్ పార్టీ ఆఫీసు లో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టాభి స్మారక భవనం పరిపాలన అనుమతులు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. 1915 సంవత్సరం 50 వేల రూపాయలతో ఆంధ్రబ్యాంక్ ను స్థాపించి ప్రజలకు సేవలు అందించారు. పట్టాభి సీతారామయ్య అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా కూడా పని చేసినారు వారి సేవలు దేశానికి అందించిన స్వాతంత్ర్య సమర యోధుడన్నారు. ఈ సందర్భంగా వారిని స్మరించుకుంటూ వారి స్మారక భవనం నిర్మాణానికి పట్టిన అడ్డంకులు తొలగి పరిపాలన అనుమతులు మంజూరు చేసిన కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కు పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, ప్రభుత్వం సత్వరం స్మారక భవనం నిర్మాణం చేపట్టి కృష్ణ జిల్లా లోని యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ పరంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్, నల్ల ట్రోలు శామ్యూల్ కృష్ణ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్, చిత్త జల్లు ప్రభుదాస్, గరికిపాటి శంకరరావు , నందిని ,వసంత తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

-జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

మచిలీపట్నం/ ప్రజాభూమి



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర, సోదరీమణులకు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ శుభాకాంక్షలు తెలియ చేసారు. ఈ రంజాన్ పర్వదినాన్ని మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకుంటూ, అందరితో సోదర భావంగా వెలుగుతూ ఘర్షణలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన రంజాన్ మాసం అంతా ముస్లింలందరూ నెలరోజుల పాటు నియమనిష్ఠలతో, కఠోర ఉపవాస దీక్షతో అల్లాహ్ ను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారు. అల్లాహ్ రక్షణ, కరు ణ పొందుటకు రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, బీద, ధనిక అన్న తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో ఎంతో కొంత సాయం చేస్తూ సేవా దృక్పథాన్ని, చాటుతూ ఈ పండుగను జరుపుకుంటారు. క్రమశిక్ష ణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాస విశిష్టత అని, సర్వమత ఐకమత్యానికి, సద్భావ న, సర్వమానవ సమతకు ప్రతీక అని పేర్కొన్నారు.ఈ రంజాన్ పర్వదినం ముస్లిం సోదరుల కుటుం బాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వెల్లివిరియాలని, అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ఐక్యమత్యంతో, కుల మతాలకు అతీతంగా సోదరభావంతో అభివృద్ధి చెందాలని ఆకాం క్షించారు.

## ప్రభుత్వం కల్పించిన రాయితీని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం:



రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రాయితీని నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఈనెల 31వ తేదీలోగా ఆస్తి పన్నులన్నీ చెల్లించాలని జిల్లా కలెక్టర్, మచిలీపట్నం నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు.మచిలీపట్నం నగరపాలక సంస్థ నూతన ప్రత్యేక పాలనాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుపై ఉన్న వడ్డీని 50% రాయితీ కల్పించిందన్నారు. ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలన్నిటిని ఈనెల 31వ తేదీలోగా చెల్లించిన ఎడల వారికి వారు చెల్లించవలసిన వడ్డీలో 50 శాతం రాయితీ వర్తిస్తుందని కలెక్టర్ వివరించారు. నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆస్తి పన్నులన్నీ త్వరగా చెల్లించిన యెడల నగరపాలక సంస్థ ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. అప్పుడే నగరంలో పలు పౌర సేవలు అందించుటకు అవకాశం లభిస్తుందన్నారు.

# ప్రిజం అకాడమీ –అమ్మాయిల భవిష్యత్తుకు ప్రకాశవంతమైన దారి!


ప్రిజమ్ అకాడమీ ప్రత్యేకతలు – విద్యార్థినీలు సమగ్ర శిక్షణ

మచిలీపట్నం ప్రజాభూమి

మచిలీపట్నం సుకరాలబాద్‌లో ప్రారంభించిన ప్రిజమ్ అకాడమీ, విద్యార్థినీలకు నాణ్యమైన మరియు లక్ష్య సాధనకు దోహదపడే ప్రత్యేక శిక్షణను అందించాలి అనే ధ్యేయంతో ముం దు కు సాగుతామని తెలిపారు. ముఖ్యంగా ఇంటర్మీ డియట్ విద్యార్థినీయుల కోసం రూ పొం దించిన ప్రత్యేక విధానాలు ఈ అకాడమీకి ప్రత్యేక గుర్తింపును తీసుకు వస్తామని తెలుపుతూ.ఈ అకాడమీలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, కామర్స్ వంటి ప్రధాన సబ్జెక్టులలో బేసిక్స్ నుంచే పటిష్టమైన పునాది వేస్తామని. గ్రూప్ సబ్జెక్టులలో కాన్సె ప్టలను స్పష్టంగా అర్థమయ్యేలా బోధించి, వాటిని ఆబ్జెక్టివ్ విధానంలో అప్లై చేయడం నేర్పిస్తు. దీని ద్వారా విద్యార్థినీల పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా తయారు చేస్తామని.ప్రతిరోజూ 4 గంటల పాటు ప్రత్యేక ఆబ్జెక్టివ్ క్లాసులు నిర్వహించబడ తాయని, ప్రతి 15 రోజులకు ఒకసారి JEE మెయిన్స్ మోడల్ ఎగ్జామ్‌లు నిర్వహిస్తూ. జాతీయ స్థాయి పరీక్షలకు అనుగుణంగా కాన్సెప్చువల్ బుక్స్ మరియు ఎక్సర్‌సైజ్ మెటీరియల్ అందిస్తూ, విద్యార్థినీల ప్రాక్టీస్‌ను బలోపేతం చేస్తామని. అలా గే రెగ్యులర్ ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించడం ద్వారా విద్యార్థినీల ప్రతిభను నిరంతరం అంచనా వేయవ చ్చని.



డే స్కాలర్ విధానం కూడా అందుబాటులో ఉండటం విద్యార్థినీ యులను అనుకూ లంగా మా రింది. JEEలో 99 పర్సంటైల్ లక్ష్యంగా విద్యార్థినీలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు.డైరెక్టర్ & ప్రిన్సిపల్ పి. లక్ష్మీ లావణ్య, నాయకత్వంలో, అనుభవజ్ఞులైన బోధక బృందం విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడంలో కృషి చేస్తామని తెలిపారు.2026 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో, ఆసక్తి గల విద్యార్థినీలు త్వరగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.తల్లిదండ్రులైన వారు కోర్సుల నిమిత్తం తమ పిల్లలను దూర ప్రాంతాలకు పంపించి అక్కడ వారు ఎలా ఉన్నారో ఏమి, తింటున్నారో ఏం చేస్తున్నారో అనే దిగులుతో ఉండవలసిన అవసరం లేదు వారి ఇంటి దగ్గరే ఉంటూ ప్రతిరోజు కాలేజీకి వెళ్లి వస్తు కోర్సులను నేర్చుకొని గొప్ప భవిష్యత్తును పొందుకోగలరని నిర్వాహకులు తెలియపరచడం జరిగింది. ఇక్కడ అందుబాటులో ఉన్న కోర్సులు:MPC (JEE Mains, Advanced, EAPCET, CUET)BiPC (NEET, EAPCET) MEC & CEC (CA, CMA Foundation Basics) అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, ప్రత్యేకంగా Arithmetic & Reasoning లో బలమైన పునాది ఏర్పరచడం ఈ అకాడమీ లక్ష్యం అని తెలిపారు.ముఖ్యముగా గమనించదగినటువంటి విషయం ఏమనగా కాలేజ్ డైరెక్టర్ సే బోధకులుగా కొనసాగుతూ విద్యా ర్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడం గమ నార్హం.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కొనకల్ల జగన్నాధ రావు (బుల్లయ్య) రంక కాంట్రాక్టర్ బొర్రా నగేష్ తదితరులు పాల్గొన్నారు









# గంగానమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబం

మజ్జిగ పంపిణీని ప్రారంభించిన మండలి వెంకట్రామ్

కోడూరు ప్రజాభూమి ప్రతినిధి

కోడూరులో వేంచేసియున్న శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారి 51 వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్- సాయి సుప్రియ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా వారిని కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు అమ్మవారి ఆశీస్సులు అందించారు.అనంతరం ఉత్స వాల సందర్భంగా ఆలయం ఎదుట భక్తుల కోసం జనసేన పార్టీ యువ నాయకుడు బచ్చు వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ శిబిరాన్ని మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన వెంకటేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీ ఛైర్మెన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య, కోడూరు పట్టణ అధ్యక్షుడు కోట రాంబాబు, జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, కోడూరు, లింగారెడ్డిపాలెం, వి.కొత్తపాలెం పిఏసిఎస్ చైర్మన్లు పూతబోయిన కరుణ్ కుమార్, కోట సుబ్బారావు, రేపల్లె పిచ్చేశ్వరరావు, డైరెక్టర్లు తోట సోమశేఖర్, మంగళగిరి శ్రీనివాసరావు, జరుగు ఆదినారాయణ, మాజీ డీసీ వైస్ చైర్మన్ కాగిత రామారావు, మాజీ కేడీసీసీబీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, నాయకులు కడవకొల్లు మల్లి, అప్పికట్ల వినోద్, మల్లా వెంకటేశ్వరరావు, బచ్చు పూర్ణ చందర్రావు, పెద్ది బాబురావు, గుడిసేవ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.





# స్వయం ఉపాధి.. సాధికారతకు పునాది

- సాంకేతికత చేయూతతో ఆర్థికంగా ఎదగాలి
- మహిళలను ప్రోత్సహించడంలో అలీప్ కీలక భాగస్వామ్యం
- జిల్లాలో రైజ్ కేంద్రం ద్వారా ఔత్సాహికులకు ప్రోత్సాహం
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

స్వయం ఉపాధి.. వ్యక్తిగత స్వావలంబన, ఆర్థిక స్వేచ్ఛకు, సమాజ అభివృద్ధికి కీలక మార్గమని.. సొంతంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం ద్వారా మహిళలు తమ ప్రతిభను వెలికితీసి, ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశముంటుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతో పాటు ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌ల అభివృద్ధి లక్ష్యంగా అసోసియేషన్ ఆఫ్ లేడీ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) వి కార్ట్ ఎగ్జిబిషన్, భాగస్వాముల సదస్సు శుక్రవారం విజయవాడలోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ జాయింట్ సెక్రటరీ మెర్సీ ఎపావో, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జెడ్‌పీ మాజీ ఛైర్మన్ గద్దె అనూరాధ హాజరయ్యారు. డీఆర్‌డీఏతోపాటు వివిధ మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఆయా యూనిట్ల వ్యవస్థాపకులతో మాట్లాడి వ్యాపార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక రంగంలో ముందుకు రావడానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థిక సహాయం, శిక్షణ, మార్కెటింగ్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే కాకుండా సమాజ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. మహిళలను పరిశ్రమల స్థాపన దిశగా ప్రోత్సహించడంతో పాటు వారిని విజయం దిశగా చేయిపట్టి నడిపించడంలో అలీప్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జిల్లాలోని గుంటుపల్లిలో రైజ్ కేంద్రం ద్వారా కూడా ఔత్సాహిక మహిళలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అలీప్ అధ్యక్షురాలు రమాదేవి కన్నెగంటి మాట్లాడుతూ అలీప్- పే నియర్ బై మధ్య ఎంవోయూ కుదిరిందన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని.. వివిధ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ, వ్యాపార అవకాశాలు, మహిళా సాధికారత, హ్యాకథాన్, ఆర్థిక అవగాహన వంటి అంశాలపైనా చర్చోపచర్చలు జరుగుతాయని వివరించారు. ఎంఎస్ఎంఈల బలోపేతానికి, మహిళల ఆర్థిక పురోగతికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, అలీప్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

ప్రజాభూమి
జనరల్ 13
శనివారం 21 , మార్చి 2026

## అగ్ని బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు వస్త్రాలు పంపిణీ.

**తిప్పి రాజుపాలెంలో తాహసిల్దార్ ఠాగూర్ చేతుల మీదుగా పంపిణీ.**

**ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు.**



విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకు ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన ఆకు కుటుంబానికి కాజులూరు తాహసిల్దార్ జి. ఠాగూర్ చేతుల మీదుగా వస్త్రాలు ,నిత్యవసర సరుకులు అందజేశారు. ఈమేరకు శుక్రవారం కాజులూరు మండలం, తిప్పి రాజుపాలెం గ్రామం శివారు దూడల గరువులో గుదే బాల కృష్ణ కు చెందిన తాటాకు పాక విద్యుత్ షాట్ సర్క్యాక్ వల్ల అగ్ని ప్రమాలనికి గురైంది . దీంతో రెడ్ క్రాస్ సంస్థ నుంచి అందజేసిన వస్త్రాలు నిత్యాసర సరకుల కిట్ కాజులూరు తాసిల్దార్ జి. ఠాగూర్ తిప్పరాజుపాలెం వెళ్ళి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈయన వెంట కాజులూరు రెవిన్యూ ఇన్స్పెక్టర్ వేగేశ్వరరావు ఉన్నారు.

## ఈదురు గాలులు, వాన అతలాకుతలం

**ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.**




గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులు, వడగళ్ల వానతో సంభవించిన తుఫాను ప్రభావం వల్ల మండలంలోని వడ్డీగూడెం, వడ్డీగూడెం కాలనీ, విఆర్ పురం గ్రామ ప్రజలు, మండల ప్రజలు తీవ్రంగా నష్టపోయి అతలాకుతలం అయ్యారని, టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ అన్నారు. ప్రకృతి విలయ తాండవం చేసి తీవ్రంగా నష్ట పరిచిన పంట పొలాలను, ఇళ్లు దెబ్బతిన్న గృహాలను టీడీపీ మండల అధ్యక్షుడు శుక్రవారం స్వయంగా సందర్శించారు. బాధితులతో మాట్లాడి వారిని పరామర్శించి, మండల అధికారులతో వారి పరిస్థితిని తెలిపి ప్రభుత్వం తరుపున బాధితులకు తగు న్యాయం చేయాలని కోరారు. అలాగే గాలివాన సృష్టించిన బీభత్సం గురించి రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కి కూడా తెలియచేస్తానని ఆయన తెలిపారు. అదేవిధంగా ఈ ఈదురుగాలులు, వర్ష బీభత్సం గురించి ఎంపీడీవో కి సమాచారం ఇవ్వగా, స్పందించిన స్థానిక ఎంపీడీవో ఇమ్మానియేల్ రహదారుల పైకి పడిన భారీ చెట్లను తమ పంచాయతీ సిబ్బందితో తొలగింపుచేసి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది లేకుండా చేసి, దెబ్బతిన్న ఇళ్లను ఆయన పరిశీలించారు.

## నూతనముగా నిర్మించే దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ బప్లాంట్ భూమి పూజ కార్యక్రమం

**ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల**

**ప్రజా భూమి ప్రతినిధి ప్రత్తిపాడు**



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడి గ్రామంలో ఇంటింటికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే ప ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా తిరిగి ఈ నెల 23 వ తేది న నక్కపల్లి సమీపంలో దేశం లోనే అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గ నుండి భారీ సంఖ్యలో కూటమి నాయకులు టిడిపి నాయకులు కార్యకర్తలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23వ తేదీన అనకాపల్లి జిల్లా, బంగారయ్యపేట, జె.వి. నక్కపల్లిలో అర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ వారు సంయుక్తంగా నిర్మిస్తున్న దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ కు భూమిపూజ కార్యక్రమం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నో భారీ ప్రాజెక్టులు తరలి వస్తున్నాయని అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నారా లోకేష్ కృషి ఫలితంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ప్రజలకు వివరించారు.

## భద్రాచలం శ్రీ సీతరామ స్వామి కల్యాణానికి పాదయాత్రకు వెళ్లే భక్తులకు ఏలేశ్వరం లో ఘన స్వాగతం.

**ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం**



భద్రాచలం శ్రీ సీత రామస్వామి కల్యాణానికి పాదయాత్ర తో వెళ్లే భక్తులకు ఏలేశ్వరం లో టీ డి పి నాయకుడు అలమండ చలమయ్య బుధవారం స్థానిక బాలాజీ చౌక్ వద్ద ఘన స్వాగతం పలికారు. అలమండ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చలమయ్య గా రామభక్తులకు ఘన స్వాగతం పలికి వారికీ శీతల పానీయాలు, అల్పాహారం అందజేశారు. అలాగే భద్రాచలం వరకు సాగే వారి పాదయాత్రకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్విఘ్నంగా జరిగేలా బాలాజీ చౌక్ గుడిలో ఉన్నా విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొండరపు రాంబాబు రౌతు సుబ్బారావు, బోధ చిరంజీవి, బూర్లు సత్తిబాబు, రౌతు శ్రీను, బుర్లు సూరిబాబు, రామ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పుంత రోడ్డుపనులకు శంకుస్థాపన

**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**



తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామం బయ్యవరం లో ఉన్న పుంత రోడ్డు పనులకు సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు శ్రీకారం చుట్టారు. పంటపొలాలకు రైతులు వెళ్లడానికి పుంత రోడ్డు అధ్వానంగా తయారై,రైతులు వ్యవసాయ పనిముట్లు సైతం తీసుకువెళ్లలేని పరిస్థితి, పండించిన పంటను బయటికి తీసుకురావాలన్న నానా అవస్థలు పడే పరిస్థితి రైతులు ఎదుర్కొంటున్న బాధలను గుర్తించిన సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి రైతులు పడుతున్న అవస్థలను వివరించారు. పుంత రోడ్డుకు నిధులు ఎమ్మెల్యే మంజూరు అయ్యేలా కృషి చేశారు. ఈ సందర్భంగా నామా కొండబాబు మాట్లాడుతూ సుమారు ఒక కిలోమీటర్ మేర రూ 20 లక్షల రూపాయలతో గ్రాంట్ తో పుంత రోడ్డుకు నిధులు మంజూరు కాగా గురువారం పనులు కు శ్రీకారం చుట్టారు. రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు కార్యకర్తలు రైతులు గ్రామస్తులు కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

## తోట రామకృష్ణ కు పలువురు అభినందనలు

**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా ఉన్న వైకాపా నాయకులు తోట రామ కృష్ణ గోపాలపురం నియోజకవర్గం పరిశీలకులుగా నియమితులైన సందర్భంగా పలువురు నాయకులు మర్యాదపూర్వంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వేగేశ్వరపురం సర్పంచ్ మరియు తాళ్లపూడి మండలం సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షులు కొమ్మిరెడ్డి పరశు రామారావు, గ్రామ కమిటీ అధ్యక్షులు భగవాన్. జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు ఇంటి వీర్రాజు పాల్గొన్నారు. పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, నల్లజర్ల మండల వైస్ ఎంపీపీ శివాజీ , నల్లజర్ల సచివాలయ కన్వీనర్ వీరభద్రరావు, నల్లజర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత వెంకటస్వామి (పెద్ద కాపు) వారి స్వగృహంలో మర్యాద పూర్వంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్

**ప్రజాభూమి ప్రతినిధి,ఆగిరిపల్లి**



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను 14 నుంచి 15 సంవత్సరాల లోపు ఉన్న బాలికలు తప్పనిసరిగా వేయించుకోవాలని వైద్యులు డాక్టర్ జగన్ మోహన్ రావు, డాక్టర్ మంజుల దేవి, డాక్టర్ సునంద తెలిపారు. హెచ్‌పీవీ వైరస్ గర్భాశయ క్యాన్సర్‌కు ప్రధాన కారణమని, భారతీయ మహిళల్లో ఇది రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్ అని పేర్కొన్నారు. టీకాలు వేయించడం, స్క్రీనింగ్ నిర్వహించడం ద్వారా కేసులు, మరణాలు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. ఈ టీకా సుమారు 93 శాతం వరకు రక్షణనిస్తుందని, ఎటువంటి అపోహలు అవసరం లేదని సూచించారు. ఇంజక్షన్ చేసిన చోట స్వల్ప నొప్పి, వాపు, జ్వరం, బలహీనత వంటి తాత్కాలిక దుష్ప్రభావాలు ఉండొచ్చని, కానీ అవి ప్రమాదకరం కావని తెలిపారు. 14 ఏళ్ల బాలికలకు సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ టీకా ఉచితంగా అందుబాటులో ఉందని, అందరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గోదావరి లో విషాదం ఐదుగురుబీటెక్ విద్యార్థులు గల్లంతు

**మూడు మృతదేహాలు లభ్యం**

**ప్రజా భూమి కుకునూరు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పరిధిలో గోదావరి నదిలో జరిగిన విషాద ఘటనలో బీటెక్ విద్యార్థులు ఐదుగురు గల్లంతవ్వగా మూడు మృతదేహాలు లభ్యమయ్యాయి. సిహెచ్ శ్రీకర్ గుప్తా దగ్గుపాటి నవదీప్ పి అభిరామ్ పి సతీష్ కుమార్ జి తేజసాయి అను బీటెక్ విద్యార్థులు గోదావరి నదిలో గల్లంతు కాగా వారిలో సిహెచ్ శ్రీకర్ గుప్తా (19) దగ్గుపాటి నవదీప్ (19) పొడిచేటి అభిరామ్( 19) అనే ముగ్గురు వ్యక్తులు మృతదేహాలు లభ్యం కాగా మిగిలిన ఇద్దరు పాశం సతీష్ కుమార్ గోక తేజజ్ఞ సాయి ఇంకా ఆచూకీ దొరకలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాలు ఇలా ఉన్నాయి బుధవారం నాడు ఉగాది సెలవల సందర్భంగా భద్రాచలం ప్రాంతానికి చెందిన తమ మిత్రులు అభిరామ్ శ్రీకర్ గుప్తా నాతో కలిసి నవదీప్ సతీష్ కుమార్ తేజ సాయి దీపక్ హర్షవర్ధన్ అందరము భద్రాచలం రాముల వారి దర్శనం చేసుకుని ఆ రోజు భద్రాచలం నుండి పర్ణశాల వెళ్ళినాము అక్కడ దర్శనాలు చేసుకొని అక్కడి నుండి తిరిగి మరల భద్రాచలం తిరిగి వచ్చినట్లు తెలిపారు అదే రోజు రాత్రి భద్రాచలంలో సినిమా చూసినట్లు ఉదయం 7 గంటలకు లెగిసి పాపికొండలు వెళదాం అనుకున్నాము సమయం సరిపోదని ఆగిపోయినాము మరలా ఇంకో సినిమా చూద్దామనుకొని టిక్కెట్లు బుక్ చేసుకున్నాము అవి మరుసటి రోజుకి బుక్ కావడంతో ఈ సమయం ఖాళీగా ఉండటం ఎందుకని ఇక్కడ చూడదగినవి ప్రదే శంలో చూపించమని శ్రీకర్ను అడగగా ఇక్కడ నది ఒడ్డు బావుంటుందని చెప్పాడు మేమందరం అనగా దీపక్ అరుష సతీష్ తేజ నవదీప్, శ్రీకర్, అభిరామ్ ఏడుగురు కలిసి శుక్రవారం నాడు గోదావరి నది ఒడ్డుకు చేరుకున్నాము హర్ష సతీష్ తేజ నవదీప్ శ్రీకాంత్ అభిరామ్ అందరూ నీటిలోకి దిగారు వారిలో తేజ కొంచెం లోతుగా నదిలోకి వెళ్ళినాడు అతనికి కాళ్లు అందకపోవటంతో మునిగిపోతున్నాడు అది గమనించిన సతీష్ చేయి అందించాడు అతనికి కూడా నేల అందకపోవడంతో మిగిలిన వారు అందరూ ఒకరి చేతులు ఒకరు అందుకుంటూ నదిలో మునిగిపోయారు వారిలో హర్ష ఒక్కడు మాత్రమే నదుల నుంచి రోడ్డుకి బయటకు వచ్చినాడు నాకు ఈత రాకపోవడంతో నేను నదిలోకి వెళ్లకుండా బయటనే ఉన్నట్లు తెలిపాడు హర్ష బయటకు వచ్చాక కలిసి పోలీసు వారికి సమాచారం అందించినట్లు తెలిపారు ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గోదావరి నదిలో గజవేతకాలతో వెతికించక అభిరామ్ నవదీప్ శ్రీకర్ మృతదేహాలు లభ్యమైనట్లు చందూరు దీపక్ తెలిపినట్లు తెలిపారు



## గొయ్యి తీశారు పూడిక మరిచారు

**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**



ఏలూరు జిల్లా పట్టిసీమ వద్ద గల సత్య సాయి వాటర్ ప్రాజెక్ట్ కు చెందిన త్రాగు నీరు పైప్ లైన్ పాడై అన్నదేవరపేట మెయిన్ రోడ్ ప్రక్కనే గల లైటింగ్ సౌండ్ సిస్టమ్ యజమాని ఇంటి ముందు గత రెండు నెలలుగా నడిచే దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఇంటి యజమాని రమణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలిపితే సత్య సాయి వాటర్ ప్రాజెక్ట్ సిబ్బంది స్పందించడం లేదని కోరగా కోరగా జనవరి లో ఒకసారి వచ్చి ఇంటి ముందు పెద్ద గొయ్యి పెట్టి వెళ్లిపోయారు. వాటర్ తో బురధ మయమై చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన వాపోతున్నారు.

## రంజాన్ ఆనందం పంచిన "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్"

**50 మందికి రంజాన్ తోఫా, చీరలు పంపిణీ**

**ప్రేమ, సహనం, దయకు ప్రతీక రంజాన్**

**సత్యం వాసంశెట్టి పౌండేషన్ చైర్మన్**

**ప్రజాభూమి ప్రతినిధి రామచంద్రపురం.**



రామచంద్రపురం పట్టణంలోని పెద్ద మసీదులో సత్యం వాసంశెట్టి పౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు, రంజాన్ తోఫా కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది ముస్లిం సోదరులకు మహిళలకు చీరలు, పురుషులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రంజాన్ పర్వదినం ప్రేమ, సహనం, దయాగుణం, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. అందరినీ ప్రేమించాలి అనే అల్లా బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాల్సినవని చెప్పారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు ఈ పర్వదినం ప్రేరణనిస్తుందని అన్నారు. అనంతరం నేతలు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లిం సమాజానికి ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వాసంశెట్టి సత్యం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, ఎండి నవాబ్ , భాష, అల్లావుద్దీన్, షేక్ కరిముల్లా, అలీషా కూటమి పార్టీ నాయకులు మేడిశెట్టి సూర్యనారాయణ, గడి గోవిందు, లంక శ్రీను, నారపురెడ్డి బలరాం, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, కవల నానాజీ, సంపత్, రాజేశ్వరి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజాన్ తోఫా కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, ఏ ఎం సి చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లను ఘనంగా ఆహ్వానించి సత్కరించారు.

## గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి వైద్యం

**ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి**



తాళ్లపూడి మండలం ప్రక్కిలంక టి జంక్షన్ వద్ద గల శ్రీనివాస స్మార్ట్ హాస్పిటల్ ను స్థాపించి 2 వసంతాలు పూర్తి చేసుకుని 3 వ వసంతంలోకి అడ్డుపెట్టిన సందర్భంగా హాస్పిటల్ ప్రాంగణంలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహమూర్తి మాట్లాడుతూ హాస్పటల్ స్థాపించినప్పటి నుంచి ప్రజలకు అనేక విధాలుగా నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎటువంటివంటి రాజీ పడకుండా అనేక సవాళ్లను ఎదుర్కొంటూ రోగులపై అధికంగా ఆర్థిక భారం వేయకుండా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలను అందించమన్నారు. ఎల్లవేళలా 24/7 మా హాస్పిటల్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు అలాగే ఈ సేవలు అందించడంలో హాస్పటల్ సిబ్బంది ఎంతో అంకితభావంతో పనిచేశారన్నారుఈ హాస్పటల్ అభివృద్ధికి సహకరించిన ప్రజలకు, గ్రామీణ వైద్యులకు, ధన్యవాదాలు తెలియజేశారు ఈ

## చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు: మంత్రి సుభాష్!..

**విద్యార్థులతో కలిసి సహబంతి భోజనం చేసిన మంత్రి సుభాష్.**

**పాఠశాలలో వసతులుపై మంత్రి సుభాష్ ఆరా.**

**మధ్యాహ్న భోజనంపథకం పైనా విద్యార్థులను అడిగి తెలుసుకున్న మంత్రి సుభాష్.**

**ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం.**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రామచంద్రపురం పట్టణంలోని చింతపల్లి సూరన్న నగర్ హై స్కూల్‌ను సందర్శించిన మంత్రి, అక్కడ అందిస్తున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేసి, ఆహార నాణ్యతను తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంది? రుచిగా ఉందా? సరిపడినంతగా పెడుతున్నారా?" లేదా? అంటూ విద్యార్థులతో చర్చిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అంతేకాకుండా చదువుల పరిస్థితి, పరీక్షల సన్నాహకంపై కూడా ఆరా తీశారు. మంత్రి సుభాష్ ఆకస్మికంగా పాఠశాలకు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కొంతసేపు ఆశ్చర్యానికి గురయ్యారు. మంత్రి హైస్కూల్ సందర్శన, విద్యార్థులతో ముచ్చటించిన తీరుతో విద్యార్థుల్లో ఉత్సాహం నింపింది. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని మంత్రి సుభాష్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలు గాయత్రి కుటుంబానికి మంత్రి సుభాష్ రూ. 25 వేల ఆర్థిక సహాయం

**త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్ష**

**సహాయం చేయడంలో ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా.**

**ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం.**



వ్యక్తిగత కారణాల రీత్యా ఇటీవల మనస్థాపానికి గురై ఆత్మహత్య యత్నానికి పాల్పడిన కొల్లు గాయత్రి కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ 25 వేల రూపాయలు చెక్కును గాయత్రి కుటుంబ సభ్యులకు అందజేశారు. నాడు సమస్యను తెలుసుకున్న మంత్రి సుభాష్ అప్పట్లో ఫోన్లో మాట్లాడి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి వైద్యం విషయంలో అన్ని విధాలుగా సహాయం చేయడమే కాకుండా ఆయన తండ్రి వాసంశెట్టి సత్యాన్ని ఏరియా ఆసుపత్రికి పంపించి దగ్గరుండి వైద్యం చేయించిన సంగతి పాటలకు విధేయతమే ఈ తరుణంలో ఆ కుటుంబానికి మంత్రి సుభాష్ మానవతా దృక్పథంతో అండగా నిలిచి రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించారు. వివరాల్లోకెళితే రామచంద్రపురం నియోజకవర్గం కె గంగవరం మండలానికి చెందిన కొల్లు గాయత్రి ఇటీవల వ్యక్తిగత కారణాలతో మానసికంగా అనారోగ్యానికి గురై ఆత్మహత్య యత్నానికి పాల్పడింది చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో విషయాన్ని గంగవరం మండల కూటమి పార్టీ నాయకులు రవ్వా నాగభూషణం, కాటే సుబ్రహ్మణ్యం, తరపట్ల ఆనందరావు, మోర్త అబ్బులు, పీతల రాజు, గ్రామ పెద్దలు ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి సుభాష్, గాయత్రి తల్లిదండ్రులు కొల్లు సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతులకు రూ. 25,000 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గాయత్రి మెరుగైన వైద్యం పొందుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయం అందించడంలో తాను , సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నలుగురు పిల్లలతో ఇబ్బందులు పడుతున్న తమ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని సకాలంలో సహాయం అందించిన మంత్రి సుభాష్‌కు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంకు గాయత్రి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాయత్రిని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం పరామర్శించిన సంగతి తెలిసిందే.

## నవోదయ పోటీ పరీక్షల్లో సత్తా చాటిన మోడరన్ విద్యార్థిని తశ్విత శ్రీయ .

**పలువురు ప్రశంసలు, అభినందనలు.**

**ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం.**




రామచంద్రపురం పట్టణం ముచ్చిమిల్లిలో ఉన్న ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్ విద్యార్థిని పిల్లా తశ్వితశ్రీయ ప్రతిష్టాత్మక నవోదయ పరీక్షల్లో సత్తా చాటింది. ఈ సందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ ఎ. రమాదేవి మాట్లాడుతూ తన్విత 81.25% సాధించి 275 ర్యాంకు సాధించిందన్నారు. తమ ప్రైమరీ స్కూల్లో అకాడమిక్ సబ్జెక్టుల బోధనలతో పాటు పోటీ పరీక్షలకు కూడా ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా వార్షిక ప్రణాళిక రూపొందించామన్నారు. అనంతరం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్ నందు ప్రాథమిక స్కూలు స్థాయి నుండే పోటీ పరీక్షలపై అవగాహన కలుగజేయటమే కాకుండా అత్యుత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దడం సంతోషదాయకంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తన్వితను అధినేత జి. వి. రావు,అకాడమిక్ డైరెక్టర్లు ఎ. కృష్ణ,ఎ. రమాదేవి అభినందించారు. కార్యక్రమంలో వెంకటరమణ,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## యర్రవరం గ్రామ పంచాయతీలో అక్రమ సీసీ రోడ్ నిర్మాణం....

**మాజీ సర్పంచ్ నీరుకొండ.**

**ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం**



ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామములో ప్రభుత్వ నిధులతో ప్రభుత్వ కమ్యూనిటీ స్థలం మధ్యలోంచి ఎటువంటి ప్రభుత్వ అనుమతుల లేని అనధికార ప్రయివేట్ పొలం లోకి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం పై, మాజీ సర్పంచ్ నీరుకొండ సత్యనారయణ శుక్రవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యర్రవరం గ్రామ పంచయతీ అభివృద్ధి అధికారిని సీసీ రోడ్డు నిర్మాణం,పై తగు వివరణ కోరగా నిరకరిస్తున్నడన్నారు. పంచాయతీ అభివృద్ధి అధికారిగా చార్జి తీసుకుని మూడు నెలల గడుస్తున్న ఇప్పటి వరకు విధులు నిర్వహించిన కార్యదర్శి చార్జీ అప్పగించ లేదంటూ పొంతనలేని సమాధానం చెప్పుతూ వదిలేస్తున్నారని అయన మండి పడ్డారు. ఇదే విషయం పై మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి రవి వర్మ కి కూడా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నీరుకొండ సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం దిశగా యర్రవరం గ్రామ పంచాయతీ అధికారులు పనిచేస్తున్నారని పిర్యాదు చేసారు. గ్రామంలో ప్రజల ప్రభుత్వానికి సంబంధించిన స్థలం లోంచి ఎటువంటి అనుమతులు లేని ప్రైవేట్ వ్యక్తుల పొలాల్లోకి సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడం పై వివరణ ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఇదే విషయంపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, తదితర జిల్లా స్థాయి అధికారులకు తెలియపరచడం జరిగిందని అన్నారు. ఇదే విషయం పై గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా నాకు ఇంకా చార్జి అప్పగించలేదు అంటూ హాస్యస్పదంగా భదులిస్తున్నారని తెలిపారు. తక్షణమే దీనిపై సంభందిత అధికారులు చర్యలు చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని నీరుకొండ సత్యనారాయణ డిమాండ్ చేశారు.